ఈనాడు వరంగల్ రూరల్

ఆదివారం 31 డిసెంబరు 2017 | 16 పేజీలు


వ్యవసాయంలో సఫలం.. విఫలం

వివరాలు 3లో..

కలం కదిలింది.. సాయం అందింది!



వివరాలు మధ్యపేజీల్లో



24 గంటలు!

రైతన్నలకు కరెంటు తిప్పలు తప్పనున్నాయి. అర్ధరాత్రి బావుల వద్దకు వెళ్లి పంటలకు నీళ్లు పెట్టుకోవాల్సిన కష్టాలు ఇక తీరనున్నాయి. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా జనవరి ఒకటి నుంచి సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్తు ఇవ్వడానికి రంగం సిద్ధమైంది. దీనికి ఉత్తర మండల విద్యుత్తు పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) సమాయత్తమైంది. ఇప్పటి వరకు 9 గంటల పాటు (6+3) అందిస్తోంది.

- రేపటి నుంచి సాగుకు నిరంతర ఉచిత విద్యుత్తు
- సన్నద్ధమైన ఎన్పీడీసీఎల్
- ఇప్పటికే లోటుపాట్ల సవరణ
- ఆటోస్టార్టర్ల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్
- లక్షలాది మంది రైతులకు ప్రయోజనం

ఈనాడు, వరంగల్

వరంగల్ సర్కిల్‌లో (అర్బన్, రూరల్, జనగామ, జయశంకర్, మహబూబాబాద్ జిల్లాలు) 2.92 లక్షల వ్యవసాయ సర్వీసులు ఉన్నాయి. వీటికి 24 గంటల పాటు విద్యుత్తు సరఫరా చేస్తే ఇప్పుడున్న సాధారణ లోడుకన్నా 25 నుంచి 30 శాతం అధికంగా వచ్చే అవకాశం ఉంది. ఇందుకు అనుగుణంగా ఎన్పీడీసీఎల్ కొత్త సబ్‌స్టేషన్లను నిర్మించింది. అదనంగా పవర్‌ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసింది. డీడీలు కట్టి వ్యవసాయ కనెక్షన్ల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతులకు సీఎం ఆదేశాల మేరకు మంజూరు చేసింది. ఇది అన్నదాతలకెంతో మేలు చేసే నిర్ణయం. ఖాళీగా ఉన్న ఉద్యోగాల్ని భర్తీ చేస్తే మరింత ప్రయోజకరంగా ఉంటుంది.

ప్రయోగం సఫలం

సంస్థ నవంబరులో ప్రయోగాత్మకంగా నిరంతరాయంగా విద్యుత్తును అందజేసింది. ట్రయల్ రన్‌లో లోటుపాట్లను గమనించింది. అవి పునరావృతం కాకుండా చూసేందుకు తగిన చర్యలు తీసుకొంది. ఈ క్రమంలో ఆటోస్టార్టర్లు ఉంటే మిగతా 2లో...



సీనియర్స్

విజయాన్ని ముద్దాడారు!



జూనియర్స్

ఈసీసీ కప్-2017 జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శనివారంతో ముగిశాయి. సీనియర్స్ విభాగంలో వాగ్దేవి డిగ్రీ కళాశాల, జూనియర్స్ విభాగంలో ప్రభుత్వ వొకేషనల్ కాలేజీ జట్లు విజయం సాధించాయి. వరంగల్ అర్బన్ జిల్లా జాయింట్ కలెక్టర్ దయానంద్ బహుమతులు ప్రదానం చేశారు.

వివరాలు IIలో

వేడుకకు వేళాయె!

నయా సాల్ జోష్‌కు జిల్లా వాసులు సిద్ధం

నర్సంపేట, న్యూస్‌టుడే

వేడుకలన్నింటిలోనూ నూతన సంవత్సర సంబురాలకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. అన్ని వర్గాల ప్రజలు ఇందులో పాల్గొనేందుకు ఆసక్తిని కనబరుస్తారు. ఈసారి మరింత ప్రత్యేకతతో పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ... నయా సాల్‌కు స్వాగతం చెప్పడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గడిచిన మిగతా 2లో...





రెండో విడతకు శ్రీకారం

నర్సంపేట నియోజకవర్గంలో పౌరసరఫరాల సంస్థ రాష్ట్ర ఛైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి చేపట్టిన పల్లెప్రగతి రెండో విడత కార్యక్రమాన్ని శనివారం చెన్నారావుపేట మండలం ఎల్లాయిగూడెంలో డిప్యూటీ సీఎం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్ది గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైనా ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు.

వివరాలు.. 13లో

24 గంటలు!

(మొదటిపేజీ తరువాయి) భూగర్భ జలాలు ఇంకిపోయే ప్రమాదం ఉన్నందున వాటిని తొలగించాలని కర్షకులను కోరుతోంది. క్షేత్రస్థాయిలో స్పెషల్ డ్రైవ్‌ను ఏర్పాటు చేసినా ఆశించిన మేర పూర్తికాలేదు. ఇంకా శ్రద్ధ పెడితేనే మంచిది. లేకుంటే ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయి. ఇప్పటికే గృహ, వాణిజ్య అవసరాలకు నిరంతరాయ కరెంటును సరఫరా చేస్తుండగా.. తాజాగా వ్యవసాయానికీ ఇస్తుండడంతో అన్ని రకాల సర్వీసులకు అందినట్లవుతుంది.

మార్కెట్ ధరలు

వరంగల్ మార్కెట్, న్యూస్‌టుడే: మార్కెట్‌లో శనివారం వివిధ సరకులకు లభించిన గరిష్ఠ, కనిష్ఠ ధరలు (క్వింటాల్‌కు) రూపాయల్లో ఇలా ఉన్నాయి. ధాన్యం విజయమసూరి: 1880-1700, ఆర్ఎన్ఆర్: 1900-1900, 1010: 1570-1570, జేజే: 1720-1720, 1001: 1550-1540, మక్కలు: 1215-1060, తెల్లజొన్నలు: 1451-1451, కందులు: 4070-4070, నువ్వులు నల్లవి: 6459-6459, అలుచందలు నల్లవి: 4939-4939, పత్తి: 5105-4700.

కేసముద్రం: సాంబమసూరి(కొ) 2251-1722, పల్లికాయ 4519-3989, బొబ్బెర్లు 4321-4321, పత్తి 5129-4242,

వ్యాధులపై సర్వే నిర్వహించాలి


మాట్లాడుతున్న అప్పయ్య

భూపాలపల్లి టౌన్, న్యూస్‌టుడే: జయశంకర్ జిల్లాలో జనవరి 2వ తేదీ నుంచి అసాంక్రమిక వ్యాధులపై సర్వే నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి అప్పయ్య ఆదేశించారు. శనివారం ప్రగతి భవన్‌లో వైద్య ఆరోగ్యశాఖ నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల వారీగా నివేదికలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 7.55 లక్షల జనాభా ఉండగా వీరిలో 30 నుంచి 65 ఏళ్లలోపు వయసు కలిగిన వారందరిని కలిసి బీపీ, చక్కెర, క్యాన్సర్ వ్యాధుల గురించి అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ వ్యాధుల సర్వే సమయంలో స్థానిక ప్రజాప్రతినిధులకు సైతం సమాచారమివ్వాలని, వారు కూడా ఈ సర్వేలో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మేడారం జాతర సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో పనిచేసే వైద్యులు, వైద్య సిబ్బంది పూర్తి వివరాలను వారి సెల్ నంబర్లతో సహా త్వరలోనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాల్సిందిగా ఆయన ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై ఎల్ఈడీ దీపాలు

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే : గృహాలలో కరెంట్‌ను పొదుపు చేసేందుకు ప్రభుత్వం రాయితీపై ఎల్ఈడీ బల్బులను సరఫరా చేస్తోంది. ఆదివారం నుంచి వరంగల్ రూరల్, జయశంకర్, మహబూబాబాద్ జిల్లాల్లో తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు రాయితీపై ఎల్ఈడీ దీపాలను సరఫరా చేస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా మేనేజర్ రమణమూర్తి వెల్లడించారు. ప్రతి జిల్లాలో లక్ష ఎల్ఈడీ దీపాలను సరఫరా చేయాలని నిర్ణయించగా మొదటి విడతగా 50 వేల చొప్పున ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 9 వాట్ల ఎల్ఈడీ దీపాల మార్కెట్‌లో కంపెనీ బట్టి రూ.120 నుంచి రూ.130 లలో ఉంది. రాయితీపై 9 వాట్ల పిలిప్స్ కంపెనీకి చెందిన ఒక్క బల్బును రూ. 65పై ప్రజలకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఎక్కువ ధరకు విక్రయిస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని రమణమూర్తి వినియోగదారులకు సూచించారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రజలు వినియోగించుకొని కరెంట్‌ను పొదుపు చేసుకోవాలని రమణమూర్తి కోరారు.

ఉద్యోగ సాధనలో కంప్యూటర్ పరిజ్ఞానం కీలకం


ప్రసంగిస్తున్న పురుషోత్తం

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో కంప్యూటర్ రంగానికి ప్రాధాన్యం పెరుగుతుందని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె.పురుషోత్తం అన్నారు. ఉద్యోగాల సాధనలో ఈరంగానికి సంబంధించిన పరిజ్ఞానం కీలకంగా మారుతుందని ఉద్ఘాటించారు. కేయూ కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన రెండురోజుల జాతీయ సదస్సు శనివారం రాత్రి కేయూ సెనెట్‌హాల్లో ముగిసింది. "డిజైన్ అండ్ అనలిసిస్ ఆఫ్ అల్గారిథం" అనే అంశంపైన జరిగిన సమావేశానికి కేయూ కంప్యూటర్ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ బి.రమ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పురుషోత్తం ఐటీ రంగంలో వస్తున్న మార్పులను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. ఇలాంటి సదస్సుల నిర్వహణతో అధ్యాపక, పరిశోధక వర్గాలకు మేలు చేకూరుతుందని వివరించారు. కేయూ సైన్స్ డీన్ ఆచార్య వై.ప్రమీలాదేవి ప్రసంగిస్తూ.. కంప్యూటర్ రంగంలో మరిన్ని అధ్యయనాలు జరగాల్సిన అవసరముందన్నారు. సదస్సు సమన్వయకులు డి.రమేష్ ప్రసంగిస్తూ.. భవిష్యత్‌లో మరిన్ని శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెండు రోజుల కార్యక్రమంలో పలువురు జాతీయ స్థాయి నిపుణులు ప్రసంగించారని పేర్కొన్నారు. పుణెలోని సీ-డాక్ సహ సంచాలకులు డాక్టర్ వీసీవీ.రావు విషయ నిపుణులు పి.వెంకట సుబ్బారెడ్డి, డాక్టర్ సురేష్, డాక్టర్ ఐలయ్య, డాక్టర్ రమలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ బి.మంజుల, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.


హాజరైన అధ్యాపకులు

వేడుకకు వేళాయె!

(మొదటిపేజీ తరువాయి)

ఏడాదిలో జరిగిన మధుర ఘట్టాలను నెమరు వేసుకుంటూ కొత్త ఏడాదిలో మరిన్ని విజయాలు కలగాలని కోరుకుంటూ ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలు..

వరంగల్, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, నర్సంపేట తదితర ప్రాంతాల్లో ఎన్నో హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. వీటిలో వేడుకల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పసందైన వంటకాలతో పాటు అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలు సందడి చేయనున్నాయి. అందరినీ ఆకట్టుకొనేలా నిర్వాహకులు సరికొత్త ప్యాకేజీలతో ప్రచారం చేస్తున్నారు. ప్రముఖ నగరాల నుంచి పేరొందిన గాయకులను, డ్యాన్సర్‌లను తీసుకొస్తున్నారు. ఆదివారం సాయంత్రం సందడి మొదలు కానుంది.

హాస్టళ్లలో సందడే సందడి...

● ప్రతి విషయంలోనూ కొత్తదనం కోరుకొనే యువతీ యువకులు వేడుకలను మరింత అట్టహాసంగా నిర్వహించుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

● ముఖ్యంగా హాస్టళ్లలో హుషారు చేయనున్నారు. ప్రత్యేక సౌండ్ సిస్టమ్‌లను సిద్ధం చేసుకొని ఆటాపాటలతో దుమ్ము లేపనున్నారు. ఈ సమయం కోసం

● ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నామని పలువురు విద్యార్థులు చెబుతున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా కేక్‌లు...

'కొత్త' సంబురాల్లో కేక్‌లను కోయడానికి చాలా మంది ఇష్టపడతారు. ఇందుకోసం బేకరీల వారు ఆకర్షణీయమైన , విభిన్నమైన ఆకృతుల్లో కేక్‌లను తయారు చేసి సిద్ధం చేశారు. ఆఫర్లను ప్రకటించి ఆకట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

జయశంకర్ జిల్లా కలెక్టర్ మురళి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామాలలో నివసించే పేద ప్రజలను ఆదుకునేలా అధికారులు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఆకునూరి మురళి అన్నారు. పేదరిక నిర్మూలన కోసం జిల్లాలో ఎంపిక చేసిన 82 గ్రామాల ప్రత్యేకాధికారుల సమీక్ష సమావేశం శనివారం సింగరేణి క్లబ్‌హౌస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందేలా ప్రత్యేక అధికారులు చొరవ చూపాలన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించి ఆ కుటుంబాలను పేదరికం నుంచి బయటపడేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన దీన్ దయాళ్ యోజన విద్యుత్తు పథకంలో రూ. 120కే పేద ప్రజలకు విద్యుత్తు కనెక్షన్ అందించాలన్నారు. సంక్షేమ పథకాల గురించి, వాటిని ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియని వారికి అధికారులే దగ్గరుండి అన్నీ చూసుకోవాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించేలా కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయి అధికారుల నుంచి మొదలుకొని జిల్లా స్థాయి అధికారులు వరకు ఒక ఉద్యమంలా పనిచేస్తేనే గ్రామాలలో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి రాజారావు, విద్యుత్తుశాఖ డీఈఈలు మహేందర్, భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ మురళి

నూతన భవన నిర్మాణంపై చర్చ

మంజూర్‌నగర్‌లో నిర్మించబోయే నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ సముదాయంపై శనివారం రోడ్డు భవనాలశాఖ అధికారులతో కలెక్టర్ మురళి చర్చించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన ఆర్అండ్‌బీ అధికారులు కలెక్టరేట్ భవన నిర్మాణానికి సంబంధించి పలు మార్పుల మ్యాపులను కలెక్టర్‌కు చూపించారు. రోడ్డు నిర్మాణం, గేట్ ఏర్పాటు, కలెక్టర్ క్యాంపు కార్యాలయ భవన నిర్మాణం చేసే మ్యాపులను చూపించగా కలెక్టర్ అంగీకరించారు. త్వరలోనే పునాదులు తవ్వి భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆర్అండ్‌బీశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఆదివారం గణపురం మండలంలోని సింగరేణి భూనిర్వాసిత గ్రామమైన మాధవరావుపల్లిని తాను సందర్శించడానికి వస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. దీనికి తగిన ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా సింగరేణి అధికారులను ఆయన ఆదేశించారు. ఈ చర్చలో సింగరేణి జీఎం కొండయ్య, ఆర్అండ్‌బీ డీఈ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో పారదర్శకత పాటించాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో చేపడుతున్న రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణంలో పారదర్శకత పాటించాలని జిల్లా కలెక్టర్ ఆకునూరి మురళి అన్నారు. శనివారం భూపాలపల్లిలోని సింగరేణి క్లబ్ హౌస్‌లో జిల్లాలోని తహసీల్దార్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, సైట్ ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ పథకంలో అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలన్నారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసి ఆదర్శంగా నిలవాలన్నారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ నిర్మాణ పనులను అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఈ సమీక్షలో ఈఈలు కోటిరెడ్డి, రాంబాబు, ప్రత్యేకాధికారి కృష్ణమాచారి, తహసీల్దార్లు, ఇంజినీర్లు, సైట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

వ్యవసాయంలో..

సఫలం.. విఫలం..!

- 2017లో పరిస్థితి ఇది..
- కొత్త సంవత్సరంపైనే అన్నదాతల ఆశలు

జిల్లాలో వ్యవసాయ రంగంలో 2017 సంవత్సరమంతా ఒడిదొడుకులు ఎదురయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు మురిపించాయి. పంటల సాగు జోరుగా సాగింది. ఆ తర్వాత నెల రోజులపాటు ముఖం చాటేశాయి. దీంతో ఎదుగుదల దశలో పంటలు ఎండిపోయి నష్టం జరిగింది. ఆ తరువాత పూత, కాత దశల్లో భారీ వర్షాలు కురిసి పంటలను నష్టాల్లో ముంచాయి. నిధులున్నా అందని పథకాలు, అవసరమున్న పథకాలకు నిధుల లేమి ఏర్పడింది. రైతుల కోసం ప్రభుత్వం చేపట్టిన కొన్ని సంస్కరణలు మేలు చేకూర్చాయి. నూతన సంవత్సరంలోనైనా వ్యవసాయం పరుగులు తీస్తుందని ఆశిస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ ఏడాది జరిగిన ఫలితాలు ఇచ్చిన అంశాలు.. ప్రతికూలతలు వివరిస్తూ.. జరగాల్సిన ప్రగతిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

–వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే

సఫలం..

1. వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తలు సన్నరకంలో మేటి అయిన వరంగల్ 505, వరంగల్ 401 రకాలను రూపొందించారు. పరిశోధనలోనే రైతుల నుంచి ఆదరణ పొందిన రకాలు ఇవి.

2. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై ఇచ్చిన గొర్రెల పథకం సఫలమైంది. ఉమ్మడి జిల్లాలో 30 వేల మంది యాదవ రైతులకు 6 లక్షల గొర్రెలను ప్రభుత్వం సరఫరా చేసి ఉపాధి కల్పించింది. యాదవులకు ఉపాధి చూపినట్లైంది.

3. మత్స్యకారులకు వంద శాతం రాయితీపై చేప పిల్లలను చెరువుల్లో వేసి పెట్టుబడిని తగ్గించారు. చేపల వృద్ధిని పెంచారు. మత్స్యసంపద ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.



4. జిల్లాలోని 15 లక్షల పశువులకు ఉచితంగా గాలికుంటు టీకాలు వేసి వ్యాధిని వందశాతం నివారించారు. ప్రణాళిక ప్రకారంగా గ్రామాల్లో శిబిరాలు నిర్వహించారు.

5. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఐదు వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారి నియమించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 190 మంది ఏఈవో పోస్టులు భర్తీ చేశారు. దీంతో వ్యవసాయ విస్తరణ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

6. వ్యవసాయానికి నిరవధికంగా 9 గంటలపాటు విద్యుత్తును సరఫరా చేయడంతో మేలు జరిగింది. పంటలకు సరిపడా నీరు అందింది.

7. వ్యవసాయ పథకాలపై ఎప్పటికప్పుడు రైతులను చైతన్యపరిచేందుకు సమితిలను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో కమిటీలను నియమించారు.

8. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 15 వేల రాయితీపై రైతులకు కేంద్ర ప్రభుత్వ కృషి సంచాయ్ యోజన పథకం కింద వెయ్యి విద్యుత్ మోటార్లను సరఫరా చేశారు. దీంతో రైతులకు పెట్టుబడులు తగ్గాయి.


9. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల్లో పూడికతీత పనులు, మరమ్మతులు చేయడంతో భూగర్భజలాలు పెరిగాయి. పంటలకు సాగు నీరు, ప్రజలకు తాగు నీరు అందుబాటులోకి వచ్చాయి.

విఫలం..!

1. ఉమ్మడి జిల్లాలో 4.90 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ పంట పూత కాత దశలో గులాబీ రంగు పురుగు ఆశించి పంటను 60 శాతం వరకు నష్టం కలిగించింది. ఈసారి పత్తి సాగు చేసిన రైతులు పెట్టుబడి రావడమే గగనంగా మారింది.

2. రాయితీపై రైతులకు వ్యవసాయ ట్రాక్టర్లు, యంత్రాలను ఇచ్చేందుకు ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ.30 కోట్లు కేటాయించింది. నిధులు ఆలస్యంగా రావడం ఎంపిక ప్రక్రియలో రాజకీయ నేతల జోక్యం పెరగడంతో ఒక్క రైతుకు కూడా ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు ఇవ్వలేదు.

3. 100 శాతం రాయితీపై చెరువుల్లో చేపలు వేయడంలో నిధులు దుర్వినియోగమయ్యాయి. చాలా చెరువుల్లో ప్రైవేటు గుత్తెదార్లు చేపపిల్లల్ని వేశారు. ఈ చేప పిల్లల్నే తాము వేసినట్లు మత్స్యశాఖ అధికారులు చూపించి రికార్డుల్లో నమోదు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. ప్రభుత్వ రాయితీ మత్స్యకారులకు చెందకుండా అధికారులు, దళారులకు మేలు జరిగింది.



4. యాదవ రైతులకు ఇచ్చిన గొర్రెల పథకంలో అక్కడక్కడ అక్రమాలు చోటు చేసుకున్నాయి. కొంతమంది రాయితీ గొర్రెలను విక్రయించుకున్నారు. అర్హులకు కాకుండా పలుకుబడి ఉన్న వారికే రాజకీయ జోక్యంతో గొర్రెలను ఇచ్చారని ఆరోపణలున్నాయి.

5. వరంగల్ అర్బన్ జిల్లా వ్యవసాయశాఖను శాశ్వతంగా ఎత్తి వేశారు. దీంతో ఈ జిల్లాకు వ్యవసాయాధికారి పోస్టు లేకుండా పోయింది. పొరుగు జిల్లా అధికారే ఇన్‌ఛార్జిగా ఉండాల్సి వచ్చింది. శాశ్వత అధికారి లేకపోవడంతో కింది స్థాయి ఉద్యోగులు, జిల్లాలోని రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

6. ఉమ్మడి జిల్లాలో కొత్తగా 10 మండలాలు ఏర్పాటు చేశారు. ఈ మండలాలకు వ్యవసాయాధికారులను నియమించలేదు. దీంతో రైతులకు ప్రభుత్వ పథకాలు అందించేవారు లేకుండాపోయారు. అధికారులు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

7. పంట రుణాలు సకాలం అందించడంలో అధికారులు విఫలమయ్యారు. పంటల సీజన్లు అయిపోయాక రుణం ఇవ్వడంతో రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది.

8. ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పాలకవర్గం అక్రమాలకు పాల్పడినందుకు తొలగించారు. విచారణలో రూ.8 కోట్ల దుర్వినియోగమైనట్లు రుజువైంది. అయినా రికవరీ చేయలేదు. ఈ బ్యాంకు ద్వారా రైతులకు సక్రమంగా పంట రుణాలు అందించలేకపోయారు.

9. వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పరిశోధనల విస్తరణ జరగలేదు. ఈ కేంద్రంలో వ్యవసాయ కళాశాల, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయడంతో ఏడీఆర్‌తోపాటు ప్రధాన శాస్త్రవేత్తలలో చాలామంది బోధనకే పరిమితమయ్యారు. పరిశోధనలలో ప్రగతి లేకుండా పోయింది.

రైతులు ఏం కోరుకుంటున్నారంటే...

● పంటల సీజన్‌కు ప్రారంభంలోనే రుణాలివ్వాలి. ● రాయితీ ద్వారా సరఫరా చేస్తున్న ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను ప్రారంభంలోనే ఇవ్వాలి. నిధుల కేటాయింపు ఖరీఫ్ సీజన్‌కు ముందే విడుదల చేయాలి. ● వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలను పరిశోధనేతర కార్యక్రమాల నుంచి విముక్తి చేయాలి. పరిశోధనలు చేసి పంటలలోని సమస్యలపై రైతులను చైతన్య పరచాలి. ● రాయితీ పథకాల అమలులో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధుల జోక్యాన్ని తగ్గించాలి. ● ఖాళీగా ఉన్న మండల వ్యవసాయాధికారుల పోస్టులను భర్తీ చేయాలి. ● వరంగల్ అర్బన్ జిల్లాకు వ్యవసాయాధికారిని నియమించాలి. ● వంద శాతం రాయితీపై సరఫరా చేస్తున్న చేప పిల్లలను చెరువుల్లో వేసే సమయంలో పర్యవేక్షణ కమిటీ ద్వారా పరిశీలించాలి. అక్రమాలు జరిగితే అధికారులపై చర్యలు తీసుకోవాలి.

సీనియర్ సహాయకులకు పదోన్నతులు

బాలసముద్రం, న్యూస్‌టుడే : ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో పని చేస్తున్న సీనియర్ సహాయకులకు పదోన్నతి లభించింది. వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ఆమ్రపాలి పలు విభాగాల్లో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లకు నాయబ్ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన అధికారి పేరు, ప్రస్తుతం పని చేస్తున్న స్థలం వివరాలు ఇలా ఉన్నాయి. టి.తరంగిని (మహబూబాబాద్, తహసీల్దార్ కార్యాలయం), బి.పద్మావతిదేవి (సబ్ కలెక్టర్ కార్యాలయం, ములుగు), పి.రోజారాణి (కలెక్టరేట్, వరంగల్ అర్బన్), ఎ.రాందత్తశర్మ (కలెక్టరేట్, వరంగల్ అర్బన్), జె.లక్ష్మినారాయణ (రూరల్ ఆర్డీవో, రూరల్ జిల్లా), డి.మహాత్మ (కంతాలపల్లి ప్రాజెక్టు, అర్బన్ జిల్లా), జి.కోమల (తొర్రూర్, తహసీల్దార్ కార్యాలయం), ఎస్.కుమారస్వామి (స్టేషన్‌ఘన్‌పూర్, తహసీల్దార్ కార్యాలయం), టి.చక్రపాణి (ఆర్డీవో కార్యాలయం, నర్సంపేట), ఎస్.శ్రీనివాసులు (గిరిద్వార్, జనగామ తహసీల్దార్), డి.సూర్య (రఘునాథపల్లి, తహసీల్దార్ కార్యాలయం), పి.రవి (కంతనపల్లి ప్రాజెక్టు, జయశంకర్ జిల్లా), వి.రాజు (సబ్ కలెక్టర్ కార్యాలయం, ములుగు), పి.కిరణ్‌కుమార్ (కలెక్టరేట్, అర్బన్ జిల్లా), డి.భద్రు (ఆత్మకూర్, తహసీల్దార్ కార్యాలయం), పి.సంతోష్ (రూరల్ కలెక్టరేట్), కె.కృష్ణ (జనగామ, తహసీల్దార్ కార్యాలయం), ఇ.శ్రీనివాస్ (జనగామ కలెక్టరేట్), డి.మాల్యా (ఆర్డీవో కార్యాలయం, మహబూబాబాద్) పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ట్రెస్సా కార్యవర్గ నేతలు కలెక్టర్ ఆమ్రపాలికి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలుంటే నా దృష్టికి తీసుకురావాలి



మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో సుదీర్ఘంగా పని చేసి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులు ఏవైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని వరంగల్ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. శనివారం వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో పోలీసు విశ్రాంత ఉద్యోగుల సంఘం 2018 సంవత్సరం క్యాలెండర్‌ను పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనం స్థలం కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. విశ్రాంత ఉద్యోగుల వైద్య బిల్లులు 15 రోజులకోసారి పరీక్షిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిలను సరైన సమయంలో తెప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో సెంట్రల్‌జోన్ డీసీపీ వెంకట్‌రెడ్డి, ఈస్ట్‌జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, అదనపు డీసీపీ ఐ.పూజ, విశ్రాంత పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు గోనెల వీరగోవిందు, కార్యదర్శి మెడకట్ల సారంగపాణి, గౌరవ అధ్యక్షుడు ఆర్.సంజీవరెడ్డి, ఆర్.రాంమూర్తి, గంప సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్‌సీటీఏ సమావేశం

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్(ఆర్‌సీటీఏ) ఆధ్వర్యంలో హన్మకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు పింఛనుదారుల దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆర్‌సీటీఏ వ్యవస్థాపకుడు పులి సారంగపాణిగౌడ్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మహబూబాబాద్ పార్లమెంట్‌సభ్యుడు అజ్మీర సీతారాంనాయక్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో 2003వ సంవత్సరంలో పదవీ విరమణ పొందిన విశ్రాంత అధ్యాపకులను సన్మానించనున్నట్లు పాణి వివరించారు.

పరకాల

మిషన్ భగీరథ పనులు ప్రారంభం

దామెర, న్యూస్‌టుడే: మిషన్ భగీరథ పైపులైన్ పనులను శనివారం ఒగ్లాపూర్‌లో సర్పంచి కనుకుంట్ల శారద ప్రారంభించారు. పనులకు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నిధుల నుంచి రూ. 6 లక్షలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో తెరాస మండల అధ్యక్షుడు జాకీర్‌అలీ, ఉప సర్పంచి, టీఆర్ఎస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


ఎక్సైజ్ కార్యాలయానికి ట్యాబ్

పరకాల, న్యూస్‌టుడే: పరకాల ఎక్సైజ్ కార్యాలయానికి ట్యాబ్ ఇచ్చారని సీఐ కె.జగన్నాథరావు తెలిపారు. గ్రామాల్లో దాడులు చేసిన సమయంలో, మద్యం దుకాణాల్లో తనిఖీలు చేసిన సందర్భాల్లో ట్యాబ్ ద్వారా ఉన్నతాధికారులకు సమాచారాన్ని చేరవేస్తామన్నారు. ఎక్సైజ్ శాఖకు ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానం కింద ట్యాబ్‌లను ఇచ్చినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

ఐదు రోజులపాటు నిర్వహణ

గీసుకొండ, న్యూస్‌టుడే: గీసుకొండలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి సహిత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు వైభవంగా జరగనున్నాయి. శ్రీలక్ష్మీనరసింహస్వామి గుట్ట అతి పురాతనమైంది. పదేళ్లక్రితం ఇక్కడ జరిపిన తవ్వకాల్లో ఆది మానవుడి కాలం నుంచి శాతవాహన కాలంనాటి వరకు ఎన్నో చారిత్రక అవశేషాలు వెలుగు చూశాయి. రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులు కూడా ఇక్కడ తవ్వకాలు జరిపారు. అటు ప్రభుత్వం, ఇటు ప్రజాప్రతినిధులు అప్పట్లో ఎవ్వరూ పెద్దగా పట్టించుకోకపోవడంతో ఇక్కడి చరిత్ర మరుగునపడిపోయింది. నరసింహస్వామిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాల ప్రజలే కాకుండా వరంగల్ పట్టణం నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు. ఆదివారం రాత్రి గీసుకొండలోని వేణుగోపాలస్వామి ఆలయం నుంచి విగ్రహాలను ఊరేగింపుగా గుట్ట మీదుగా తీసుకొస్తారు. అప్పటి నుంచి జాతర ప్రారంభమవుతుంది. బ్రహోత్సవాల సందర్భంగా ఈ నెల 31న రాత్రి 8 గంటలకు అంకురార్పణ, ధ్వజారోణం, కల్యాణోత్సవం జనవరి 1న హోమబలిహరణములు, 2న జాతర రాత్రి బండ్లు తిరుగుట, 3న స్వామి వారి సేవలు, మొక్కుబడులు సమర్పించుట, 4న స్వామివారు ఊరేగింపుతో ఆలయ ప్రవేశం చేయడంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశపారంపర్య వ్యవస్థాపక ధర్మకర్త అర్చకులు వేదాంతం మురళీకృష్ణమాచార్యులు, వెంకటనరసింహాచార్యులు తెలిపారు.



శ్రీనరసింహస్వామి గుట్ట



గుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి

అన్ని ఏర్పాట్లు పూర్తి

జాతర సందర్భంగా భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను సమకూర్చినట్లు ఆలయ ఛైర్మన్ వటుకుల చంద్రారెడ్డి, కార్యదర్శి పసుల రాజేందర్, కోశాధికారి కోట ప్రమోద్ శనివారం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. గుట్టపై నిర్మించిన మెట్లు ఒకే రకంగా కాకుండా అక్కడ అక్కడ ఎత్తుగా నిర్మించడడంతో భక్తులు ఏటా ఎంతో ఇబ్బందులు పడేవారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని బాగా ఎత్తున్న మెట్లను తీసివేసి అన్ని ఒకే రకంగా నిర్మించి వాటికి రంగులు వేయించినట్లు వారు చెప్పారు. గుట్టపై భాగంలో చలువ పందిళ్లను వేయించి పై భాగంలో భక్తులకు నీటి సౌకర్యాన్ని కల్పించినట్లు వారు చెప్పారు. జాతరకు వచ్చే పలు మార్గాల్లో రహదారులకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలగించినట్లు వారు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు సమర్పించుకోవాలని వారు సూచించారు.

భాజపా పట్టణ మాజీ అధ్యక్షుడి మృతి

పరకాల, న్యూస్‌టుడే: భాజపా సీనియర్ నాయకుడు, పరకాల పట్టణ మాజీ అధ్యక్షుడు వీరగంటి స్వామి(96) అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన భార్య నర్సమ్మ ఏడాది కిందట మృతిచెందారు. స్వామికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. మాజీ ఎంపీ జంగారెడ్డి, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఎస్.సంతోశ్‌కుమార్, జి.జయపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి జయంత్‌లాల్, నియోజకవర్గ కన్వీనర్ కె.గురుప్రసాద్ తదితరులు మృతదేహంపై పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా కార్యదర్శిగా శివకుమార్



పరకాల, న్యూస్‌టుడే: తెలంగాణ నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా కార్యదర్శిగా పరకాలకు చెందిన ఓదెల శివకుమార్, ఉపాధ్యక్షుడిగా నాగెల్లి నరేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎడ్ల మురళి, సింగారపు సాంబయ్య ప్రకటించారు. శివకుమార్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి పాటుపడుతానన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

పరకాల, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీహర్ష జూనియర్ కళాశాలలో శనివారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సైగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన పి.శివప్రసాద్ విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను ఎలా అధిరోహించాలి అనే విషయాలను వివరించారు. ప్రతి ఒక్కరు ఏకాగ్రత, ఆరోగ్యం, ప్రణాళిక, పట్టుదల, సమయపాలన కలిగి ఉండాలని సూచించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ కె.రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాత కేసుల్లోని ముద్దాయిల బైండోవర్

పరకాల, న్యూస్‌టుడే: శాయంపేట మండలం గంగిరేణిగూడెం శివారు సూర్యానాయక్ తండాకు చెందిన ముగ్గురు పాత కేసుల్లోని ముద్దాయిలను శనివారం బైండోవర్ చేసినట్లు పరకాల ఎక్సైజ్ సీఐ కె.జగన్నాథరావు తెలిపారు. మాలోతు మోహన్, లావుడ్య శ్రీనివాస్, మాలోతు లక్ష్మిని పరకాల తహసీల్దార్ పి.హరికృష్ణ ఎదుట హాజరుపర్చగా సొంత పూచీకత్తుపై వదిలిపెట్టామన్నారు. మాందారిపేటలోని శ్రీ సాయి మద్యం దుకాణంలో తనిఖీలు చేశామని, నిబంధనల ప్రకారమే కొనసాగుతున్నట్లు తేలిందన్నారు. ఆదివారం నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు జరుపుకోనున్నారని, మద్యం దుకాణాల వ్యాపారులు మాత్రం నిబంధనల ప్రకారం నడచుకోవాలని సీఐ పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ఆత్మకూరు, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడంతో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆత్మకూరు మండలం పెద్దాపూర్ శివారు లింగమడుగుపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై రవీందర్ కథనం ప్రకారం... మండలంలోని పెద్దాపూర్ శివారు లింగమడుగుపల్లికి చెందిన వజ్రె నవ్యకు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో నల్లబెల్లి మండలం వేదనగర్‌కు చెందిన బూర్గుల నవీన్‌తో వివాహమైంది. కొంతకాలంగా భర్తతో పాటు అత్త, మామలు అదనంగా రూ.లక్ష కట్నం తీసుకురావాలని ఇబ్బందులకు గురి చేయడంతో పుట్టింటికి వెళ్లింది.. పెద్దల సమక్షంలో మాట్లాడినప్పటికీ వినకపోవడంతో మనస్తాపానికి గురైన నవ్య శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలి తండ్రి శ్యాంరావు ఫిర్యాదు మేరకు భర్త నవీన్, తల్లిదండ్రులు స్వరూప, రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకట్రాంరెడ్డి పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యులు సంజీవరెడ్డి, మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సుల తనిఖీ



బస్సులను తనిఖీలు చేస్తున్న ఎస్ఐ, ఏఎంవీఐ

దామెర, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ప్రైవేట్ స్కూల్ బస్సులను శనివారం దామెర పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మోహన్‌బాబు ఆధ్వర్యంలో వరంగల్ ఏఎంవీఐ అధికారులు తనిఖీలు చేశారు. బస్సులను ఎప్పటికప్పుడు మెకానిక్‌లకు చూపించి పొల్యూషన్ చెక్ చేయించుకొని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు.

గ్రానైట్ క్వారీలో స్వచ్ఛ భారత్



స్వచ్ఛభారత్ సభలో పాల్గొన్న అధికారులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛ భారత్ మిషన్ పారిశుద్ధ్య పక్షోత్సవాలలో భాగంగా మైనింగ్ సెక్టార్ ఆధ్వర్యంలో శనివారం పెద్దాపూర్‌లోని గాయత్రి గ్రానైట్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని చెట్లు నాటాలని సంబంధిత మైనింగ్ సెక్టార్ అధికారులు కార్మికులకు సూచించారు. మైన్స్ అండ్ జియాలజీ అధికారులు బాలు, సర్వేయర్ శైలజ, ఎంపీటీసీ రమేశ్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

గీసుకొండ, న్యూస్‌టుడే: గీసుకొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మనుగొండలోని ఉప కేంద్రాన్ని శనివారం జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు సందర్శించి పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలను వారు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రసవాలు, వ్యాధి నిరోధక టీకాలు కేసీఆర్ కిట్టు పథకాలను వారు పరిశీలించారు. ఆరోగ్య ఉప కేంద్రాలకు సొంత భవనాలు లేక చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు గమనించారు. భవనాలు సమకూర్చాలని ప్రతిపాదనలు పంపనున్నట్లు వారు తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు నవేన్ కిషోర్, మనేష్ మృణాల్, అవదేశ్ యాదవ్, సుబేర్ కుమార్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రాంమనోహర్‌రావు, జిల్లా మాస్‌మీడియా అధికారి స్వరూప, గీసుకొండ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి సీహెచ్ కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ ప్రకాశ్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు

కాంగ్రెస్ జెండా పండుగ



జెండా గద్దె వద్ద కొబ్బరికాయ కొడుతున్న వెంకట్రామిరెడ్డి

కొమ్మాల(గీసుకొండ) న్యూస్‌టుడే: గీసుకొండ మండలం గిరిజన తండాలైన మంగలితండా, మాన్‌సింగ్‌తండాల్లో శనివారం పరకాల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి పర్యటించి జెండా పండుగ నిర్వహించారు. ఆయా తండాల్లో పార్టీ జెండాలను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చడంలో రాష్ట్రంలోని తెరాస ప్రభుత్వం విఫలమైందన్నారు. టీపీపీసీ సభ్యులు రంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమురారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓనారెడ్డి, ప్రభాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి

దామెర, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని భాజపా మండలాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సింగరాజుపల్లిలోని కాంగ్రెస్, తెరాస, తెదేపా నుంచి సుమారు 35 మంది శనివారం శ్రీరాంరెడ్డి ఆధ్వర్యంలో భాజపాలో చేరారు. పార్టీలో చేరిన వారికి శ్రీరాంరెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణలో భాజపా అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, బీజేవైఎం మండలాధ్యక్షుడు చందర్, చుక్క మహేందర్, దేవేందర్, రాజేశ్, ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో శ్రీరాంరెడ్డి

పరకాల

అంతర్జాతీయ క్రీడలకు ఎంపికైన రాజేశ్‌కు సన్మానం

పోతరాజుపల్లి(గీసుకొండ), న్యూస్‌టుడే: గీసుకొండ మండలం రెండో డివిజన్ పరిధి పోతరాజుపల్లి గ్రామానికి చెందిన గట్టికొప్పుల రాజేశ్ అనే విద్యార్థి అంతర్జాతీయ ఖోఖో జట్టుకు ఎంపికయ్యాడు. రాజేశ్ వరంగల్‌లోని ఎన్ఆర్ఐ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఈ క్రీడాకారుడిని పోతరాజుపల్లి గ్రామంలో శనివారం కార్పొరేటర్ బాలయ్య, గ్రామ ప్రముఖులు శ్రీకాంత్‌శర్మ, బాబురావు, కృష్ణమూర్తి, సాంబయ్య తదితరులు సన్మానించారు.

తెరపై ఈనాడు

పరకాల, న్యూస్‌టుడే:

జయ డీలక్స్: MCA మిడిల్ క్లాస్ అబ్బాయ్

కాకతీయ: 2 కంట్రీస్

విద్యుత్తు కోసం రైతుల ఆందోళన



రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న రైతులు

పులిగిల్ల(పరకాల రూరల్), న్యూస్‌టుడే: యాసంగి సీజన్‌లో సాగు చేస్తున్న తమ పంటలకు విద్యుత్తు అధికారులు కరెంట్ సరఫరా నిలిపివేయడాన్ని నిరసిస్తూ మండలంలోని పులిగిల్ల గ్రామ రైతులు ప్రధాన రోడ్డుపై శనివారం ధర్నా నిర్వహించారు. తాము కరెంటు బిల్లులు చెల్లించినప్పటికీ పూర్తి స్థాయిలో రైతులు కరెంట్ బిల్లుల చెల్లింపు చేయలేదనే నెపంతో విద్యుత్తు అధికారులు కరెంట్ నిలిపివేశారని రైతులు ఆరోపించారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో వరి నార్లు పోసుకుని పంట దుక్కులు చేసుకుని సాగు నీరు పారించుకునే సమయంలో అధికారులు విద్యుత్తు సరఫరా నిలిపేయడంతో తమ పంటలకు సాగు నీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్తు శాఖ అధికారుల తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

ఎల్గూర్ రంగంపేట్‌లో సినిమా చిత్రీకరణ



నటీనటులకు సన్నివేశాన్ని వివరిస్తున్న దర్శకుడు

ఎల్గూర్‌రంగంపేట్(సంగెం), న్యూస్‌టుడే: ఎల్గూర్‌రంగంపేట్ గ్రామంలో శనివారం కాదల్ సినిమాలోని కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. గ్రామీణ ప్రేమ కథా నేపథ్యంలో తీస్తున్న ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలను గ్రామంలోని శబోతు వెంకన్న నివాసంలో చిత్రీకరించారు. సర్పంచి ఉమ-శ్రీనివాస్ క్లాప్ కొట్టి చిత్రీకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర దర్శకుడు అన్వేష్ మాట్లాడుతూ రుద్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌లో నిర్మిస్తున్న కాదల్(నా మనసులో నువ్వే) ప్రొడక్షన్ నెంబర్ 3ను ఎల్గూర్‌రంగంపేట్ గ్రామంలో చిత్రీకరిస్తున్నామని తెలిపారు. ఎల్గూర్‌రంగంపేట్, ఎల్గూర్ చెరువు, మొండ్రాయి తదితర ప్రాంతాల్లో 10 రోజుల పాటు సినిమా షూటింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సినిమాలో కథానాయకులుగా జలేందర్, విక్రం, కథానాయకురాలిగా మనీష, ఛాయాగ్రాహకులుగా ప్రవీణ్‌కుమార్, సాయన్న, నటీనటులుగా అంకిత, సుమన్, రంజిత్, భరత్ తదితరులు నటిస్తున్నారు. గ్రామంలో సినిమా చిత్రీకరణకు సహకరిస్తున్న అనిల్, శ్రీనివాస్, వెంకన్న తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ ట్రేడర్స్ అధ్యక్షుడిగా సారయ్య

పరకాల, న్యూస్‌టుడే: పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ట్రేడర్స్(ఛాంబర్ ఆఫ్ కామర్స్) అధ్యక్షుడిగా ఒంటేరు సారయ్య ఎన్నికయ్యారు. శనివారం పరకాల వ్యవసాయ మార్కెట్‌లో కమిటీని ఎన్నుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా కొమ్మిడి సాంబరెడ్డి, అధ్యక్షుడిగా సారయ్య, ప్రధాన కార్యదర్శిగా కొమ్మిడి వేణు, ఉపాధ్యక్షుడిగా పాత రాజు, కోశాధికారిగా సూరినేని స్వామిరావు, కార్యవర్గ సభ్యులుగా అల్లం రాజమౌళి, గుర్రాల రాజిరెడ్డి, పేరాల తిరుపతి ఎన్నికయ్యారు. సారయ్య మాట్లాడుతూ పత్తి, ఇతర సరుకులపై అడ్తీ కమీషన్, ఇతర ఛార్జీలను కలుపుకుని నాటికి 4 శాతం మాత్రమే వసూలు చేయాలని నిర్ణయించామన్నారు. రైతులు తేమ లేకుండా పత్తి పంట దిగుబడిని మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు.

'బహుజన వామపక్ష ఫ్రంట్ ఏర్పాటు'



మాట్లాడుతున్న గాదగోని రవి

గంగదేవిపల్లి(గీసుకొండ), న్యూస్‌టుడే: రాష్ట్రంలో బూర్జువా పార్టీలైన తెరాస, భాజపా, కాంగ్రెస్, తెదేపా పార్టీలకు ప్రత్యామ్నాయంగా జనవరి నెలలో బహుజన ఫ్రంట్‌ను ఏర్పాటు చేయబోతున్నామని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు గాదగోని రవి పిలుపునిచ్చారు. గీసుకొండ మండలం గంగదేవిపల్లిలో శనివారం వరంగల్ గ్రామీణ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజల మౌలిక సదుపాయాలతో పాటు అసమానతలను తగ్గించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. భాజపా ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో చావుదెబ్బతింటుందోనని రాబోయే కాలంలో మోదీ ప్రభుత్వం కూలటం ఖాయమన్నారు. కార్యక్రమంలో హంసారెడ్డి, కుమారస్వామి, వెంకన్న, బుచ్చయ్య, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

లోహిత (సంగెం), న్యూస్‌టుడే: లోహితలో రూ. 5 లక్షల సీడీపీ ప్రత్యేక నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం సర్పంచి ఎల్లస్వామి, ఎంపీటీసీ సభ్యుడు దొమ్మటి సంపత్ ప్రారంభించారు. ఎల్కపూరి రాజేశ్వర్ ఇంటి నుంచి నాగినేని సోమేశ్వర్‌రావు ఇంటి వరకు 98 మీటర్ల సీసీ రోడ్డును నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. త్వరలోనే గ్రామంలో అన్ని సీసీ రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు కానున్నట్లు ఆయన తెలిపారు. వార్డు సభ్యులు సోమేశ్వర్, అరుణ, భీములు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



సాంబయ్య దంపతులను సన్మానించిన ఉపాధ్యాయులు

వెల్లంపల్లి(పరకాల రూరల్), న్యూస్‌టుడే: వేలమంది విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయుడు వైనాల సాంబయ్య పదవీ విరమణను పురస్కరించుకుని వెల్లంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రజాప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు. శనివారం ఉపాధ్యాయుడు రాయిని గోవర్ధన్ అధ్యక్షతన ప్రధానోపాధ్యాయుడు సాంబయ్యకు వీడ్కోలు మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సాంబయ్య దంపతులకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువ, పూలమాలలతో సన్మానం చేశారు. సాంబయ్య శనివారం పదవీ విరమణ పొందుతూనే మరో పక్క తల్లిదండ్రులను కోల్పోయిన తన శిష్యురాళ్లు కురమ ప్రవళిక, కురమ లక్ష్మికి రూ. 5వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి విజయ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కె. శ్రీనివాస్, ఎండీ సాదిక్, మార్త రాజేందర్, కె. సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు బల్లల వితరణ



విద్యార్థులకు మిఠాయిలు పంచుతున్న విద్యార్థినులు

బొల్లికుంట (సంగెం), న్యూస్‌టుడే: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల సీఎస్‌సీ విభాగం తృతీయ, చివరి సంవత్సరం విద్యార్థులు బొల్లికుంట హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బల్లలు, రక్షిత నీటిని తీసుకువచ్చే డ్రమ్ములను వితరణగా అందించారు. విద్యార్థులకు మిఠాయిలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కళాశాల డీన్ ఎస్ఎస్‌వీఎన్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సౌకర్యాలు కల్పించడం అభినందనీయం అన్నారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు తీరిక సమయాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, ఆంగ్లం, కంప్యూటర్ విద్య శిక్షణ తరగతులను నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తులో పాఠశాలలో అవసరమయ్యే వసతులను కల్పిస్తామని విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి హామీ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంపదనిచ్చే బాధ్యత విద్యార్థులదే



మాట్లాడుతున్న కమిషనర్ జోనా

పరకాల, న్యూస్‌టుడే: భావితరాలకు స్వచ్ఛ సంపదనిచ్చే బాధ్యత విద్యార్థులపైనే ఉందని నగర పంచాయతీ కమిషనర్ జోనా అన్నారు. శనివారం పరకాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల(సక్సెస్), చైతన్య మోడల్ స్కూల్, ఎస్ఆర్ పాఠశాలలో వేర్వేరుగా విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం తన ఇల్లును ఎలాగైతే పరిశుభ్రతతో కాపాడుకోవాలని ఆశిస్తారో అదే విధంగా మన వీధి, మన పట్టణం, మన రాష్ట్రం, మన దేశం అనే నినాదాన్ని ఎత్తుకోవాలని సూచించారు. అప్పుడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్ష నెరవేరుతుందన్నారు. పరకాల సిటిజన్ బుడ్డి అనే యాప్‌ను వినియోగించుకుని సమస్యలు, సలహాలు, సూచనలను అందించాలని జోనా కోరారు. ఈ సదస్సుల్లో కౌన్సిలర్లు ఎం. సంపత్‌కుమార్, ఎ. దశరథం, నగర పంచాయతీ ఏఈ బాలకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఉత్తమ కెడెట్‌గా వివేక్

బొల్లికుంట (సంగెం), న్యూస్‌టుడే: బొల్లికుంట వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మెకానికల్ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న పి. వివేక్ తెలుగు రాష్ట్రాల ఉత్తమ ఎన్‌సీసీ కెడెట్ అవార్డు అందుకున్నట్లు శనివారం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం సికింద్రాబాద్‌లోని ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక క్యాంపులో ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ పి. మహేశ్వర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. అవార్డు పొందిన వివేక్‌ను కళాశాల యాజమాన్యం దేవేందర్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

టీజేఎస్ఎఫ్ మండల కన్వీనర్‌గా రాజ్‌కుమార్



పరకాల, న్యూస్‌టుడే: తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్(టీజేఎస్ఎఫ్) పరకాల మండల కన్వీనర్‌గా రామంచ రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు నియోజకవర్గ కన్వీనర్ మహ్మద్ అజహారుద్దీన్ శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి పాటుపడుతానన్నారు. అంతేగాక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు సేవలను అందిస్తానన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గీసుకొండ, న్యూస్‌టుడే: గీసుకొండలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం పీఆర్‌టీయూ క్యాలెండర్, డైరీని పీఆర్‌టీయూ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల ఉపేందర్‌రెడ్డి, ఎంఈవో ఉండ్రాతి సుజన్‌తేజ ఆవిష్కరించారు. ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనలు రూపొందించుకుని పదోన్నతులు రావాలని ఆయన కోరారు. మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మంగ రాజన్న, రాష్ట్ర బాధ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడిగా తోట రవీందర్



పరకాల, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ గ్రామీణ జిల్లా ఉపాధ్యక్షుడిగా పరకాలకు చెందిన తోట రవీందర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్నోజు శ్రీనివాసాచారి శనివారం ప్రకటించారు. రవీందర్ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు శ్రీనివాసాచారి తెలిపారు. రవీందర్ మాట్లాడుతూ తెదేపా బలోపేతానికి మరింత పాటుపడతానన్నారు.

రేషన్ బియ్యం అప్పగింత

శాయంపేట, న్యూస్‌టుడే: మండలంలోని ప్రగతి సింగారం శివారులో ఇటీవల పెట్రోలింగ్‌లో భాగంగా పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు శనివారం పంచనామా నిర్వహించారు. స్థానిక రేషన్ డీలర్ బాబురావుకు అప్పగించడం జరిగింది. జాయింట్ కలెక్టర్‌కు నివేదికను అప్పగిస్తామని వారు తెలిపారు. ఆర్ఐ హేమానాయక్, వీఆర్వో భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

EENADU THE WAY CLASSIFIEDS

BIRTHDAY GREETINGS



AGRIBUSINESS



సిరులు కురిపించే శ్రీగంధం, ఎర్రచందనం మొక్కలను మీ పిల్లలకు ఆస్తిగా ఇవ్వండి. అన్ని రకాల శ్రీగంధం, ఎర్రచందనం మొక్కలు అతి తక్కువ ధరకే లభించును. ✆ 9177773683

AUTOMOTIVE



VEHICLES FOR SALE

2017 NEW **ASHOK** Leyland 51 Seaters 15,25,000/-. 2011 Leyland 210 Wheel Base 51 Seater 7,95,000/-. 2012 Swaraj Mazda 32 Seaters 6,95,000/-. Finance 75% available. ✆ 95333 31111.

BUSINESS SERVICES



WANTED DEALERS/AGENTS

ప్రముఖ కం॥ "సుమన్" బ్రాండ్ Vermi Celli, మసాలాలు, మిర్చి, ధనియా పౌడర్స్, ఇంగువ మొ॥ 100 రకములు అమ్ముటకు సూపర్ టాకిస్ట్ & డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. 8519891155, Hyd

జిల్లావారిగా డోర్ టు డోర్ డెలివరి చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. తక్కువ పెట్టుబడి అధిక రాబడి సంప్ర: S.M.S టెలిషాపింగ్ ✆ 9985124526 7019874223

BUSINESS OFFER

అతితక్కువ పెట్టుబడితో ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మిషన్‌లు కలవు. ముడిసరుకు ఇస్తాం, తయారైనవి మేమే కొంటాం. కుమార్ ఎంటర్‌ప్రైజెస్, Rjy, ✆ 93933 32227, (నో ఛార్జెస్).

ఉమెన్స్ బ్యూటీపార్లర్ లీజుకు ఇవ్వబడును. సంప్రదించగలరు. ✆ 9849035108/ 7981342313.

మన జిల్లాల్లో అన్ని మండలాలలో GST సెంటర్‌లలో ఏర్పాటుకు మరియు జాబ్ కొరకు సం॥. ఇన్ఫోటెక్ కంప్యూటర్స్, 9502856188, 08462-240000.

LED Lights తయారుచేస్తూ రోజూ అధిక ఆదాయం సంపాదించండి. రా మెటీరియల్ ఫ్రీ. బైబ్యాక్ అగ్రి 2yrs. No Processing Fee ✆ 7840075254/ 7210864919

FOR SALE

Medical Equipment for sale 1) IVF Equipment Complete, 2) 6.5 A.C. Unit, 3) 50 MA X-Ray Plant with table & all Accessories for sale. As an Where in Karimnagar. Cell: 94400 62272, 94400 77955.

రన్నింగ్‌లో ఉన్న గిఫ్ట్ & టాయిస్ షాపు సేల్స్ లేదా కిరాయికి ఇవ్వబడును. హన్మకొండ చౌరస్తా, మెయిన్‌రోడ్. 9849847001.

హన్మకొండ చౌరస్తాలో సిటీ బస్టాప్ దగ్గర గ్రౌండ్ మరియు 1st ఫ్లోర్‌లో మంచి రన్నింగ్‌లో ఉన్న రెస్టారెంట్ అమ్మబడును. సం॥ 9701312255.

BUILDING & CONSTRUCTION



SEPTIC TANK CLEANING

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్: నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును, డి.ఎస్.రావు, Cont: 9849145043, 9866584455.

COMPUTER EDUCATION



ఉచిత కంప్యూటర్, టైలరింగ్ శిక్షణ PGDCA, టైలరింగ్ & కటింగ్ నేర్పబడును. UCIT Computer Education. Kishanpura, HNK. 9966343485, Wesley Public School, Kazipet: 9849944406.

EDUCATION



TUITIONS

Home Tuition చెప్పబడును. I to X , Inter, Degree, & IIT Maths, Physics, Chemistry 7799878714, 9573226881.

HOME TUTIONS

Result Oriented Home tuitions చెప్పబడును. Class 1st to 10th. Cont: 9963088662.

DISTANCE EDUCATION

Guidence for 10th, 12th, Degree, PG, MBA, MCA, B.Ed, D.Ed, B.Tech, ITI, LLB, M.Ph, PHD St. Aloysius March Exams ✆ 9160081597/ 7093266087

JOB TRAINING

నగర మహిళలకు శుభవార్త. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనర్లలో నాణ్యమైన శిక్షణ ఇవ్వబడును. ఆసక్తి గల మహిళలు సంప్ర॥ Opp: డిఐజి బంగ్లా, Ph: 8686228461, 08702977464.

FOOD & RESTAURANTS



CATERING SERVICES

స్నేహ క్యాటరింగ్ సర్వీసెస్ అన్ని రకాల వంటలు & క్యాటరింగ్ చేయబడును. అన్ని ఫంక్షన్లకు, మీటింగ్‌లకు ఆర్డరుపై టిఫిన్లు, మీల్స్ సప్లై చేయబడును. Cont: 9963214996, 9640721125.

బాల క్యాటరింగ్ సర్వీసెస్, అన్ని రకాల వంటలు మరియు క్యాటరింగ్ చేయబడును. అన్ని ఫంక్షన్‌లకు సంప్ర: N.గణేష్ & బ్రదర్స్, HNK, WGL. Cont: 9395358002, 9346850482.

FURNITURE & FURNISHING



FURNITURE FOR SALE

HNK చౌరస్తాలో రన్నింగ్ హోటల్/ మెస్ ఫర్నిచర్‌తో సహ లీజుకు/ అద్దెకు ఇవ్వబడును. లేదా ఫర్నిచర్ అమ్మబడును. సంప్ర: 9963214996, 9640721125, 9705513555.

HEALTH CARE



ఉచిత మధుమేహ శిభిరం Dec-31 వరకు FBS, PLBS, RBS ఈ పరీక్షలు ఉచితంగా చేయబడును. మిగతా పరీక్షలకు ప్రత్యేకమైన తగ్గింపు కలదు. తపాడియా డయాగ్నోస్టిక్ సెంటర్ JPN Road వరంగల్. ✆ 9246846871

HOMEOPATHY

ఎంతటి అసాధ్య వ్యాధులకైనను హోమియో చికిత్సకై సంప్ర॥ 28 సం॥ల Exp. Dr. సిహెచ్. జితేందర్, BHMS శ్రీ రాజరాజేశ్వర హోమియో క్లినిక్, Opp: న్యూ బస్టాండ్, హన్మకొండ. సెల్: 9849117394.

PILES

పైల్స్ & ఫిస్టులా, ఫిషర్ 99.9% సక్సెస్ for Ladies (ఆపరేషన్ లేకుండా) No Hospitalisation & No Complications. సంప్ర॥ డా॥ జి. హేమలత 9491819416, డా॥ జి.సంపత్, 9440428208.

HOME NEEDS




MOSQUITO SCREENS

దోమల నివారణకై అల్యూమినియం Mosquito డోర్ & విండోస్‌కు సరియైన ధరలలో బిగించబడును. & న్యూ అల్యూమినియం బాత్‌రూం డోర్స్ అమ్మబడును. Sri Raghavendra Marketing ప్రొ॥ కిషన్ 9849467379.

PEST CONTROL

చెదలు, బొద్దింకలు మరియు అన్నిరకాల పెస్ట్ సర్వీస్ (వాసనరాని) కెమికల్స్ SS HICARE PEST CONTROL (I) PVT LTD (ISO Certified) ✆ 9959955554 /9177567788.

INDUSTRY



MACHINERY FOR SALE

పేపర్ ప్లేట్స్ మిషన్స్ బఫేట్ మరియు సిట్టింగ్ ప్లేట్స్ తయారుచేసే మిషన్స్ అమ్మబడును. & సర్వీస్ 1 Yr. వారంటీ కలదు. Cont: 9985188057, 0870-2972555.

PROFESSIONAL SERVIES



ASTROLOGY

బ్రహ్మతంత్ర జ్యోతిష్యకేంద్రం: విశాఖ సమాచార దినపత్రిక ఆధ్యాత్మిక జ్యోతిష్య విషయ సంగ్రహకర్త శ్రీ సి.వి.చక్రపాణి గారు బ్రహ్మతంత్రం అను ప్రాచీన తాళపత్ర గ్రంధము ద్వారా మీ యొక్క పూర్వజన్మ జాతక చక్ర పరిశీలనచేసి పరిహారాలు వ్రాసి పంపబడును. V.P.P. పోస్టల్ సౌకర్యం కలదు. ✆ 77299 60094, 77300 52204.

VAASTU

గౌరువాస్తు ఇంజనీర్‌గా గౌరు తిరుపతిరెడ్డి గారి వద్ద శిష్యరికము పొంది 30 సం॥ల అనుభవము కల్గిన కె.జయరాములు హన్మకొండ వాస్తు సలహాలు, సవరరణలు, ప్లాన్స్‌కు సంప్ర॥ 9676982162.

PEOPLE CARE



OLD AGE HOME

మీ ఇంటివద్ద వృద్దులను చూసుకొనుటకు ఇంటిపని, వంటపని చేయుటకు ఆడవాళ్ళని మగవాళ్ళని 24 గం॥లు సర్వీస్సు ఇవ్వగలము. హైదరాబాద్. ✆ 97043 71576, 72860 26405.

REAL ESTATE



NGO'S కాలనీ Hnk లేఔట్ NF40X60= 266 గ॥ 3 బెడ్ రూం ఇల్లు పిల్లర్స్‌తో & నాన్ లేఔట్ ప్లాట్ NF 45X68= 340 గ॥ ప్లాటు అమ్మబడును. సంప్ర: 9440246807, 9441978555.

FLAT FOR SALE

Excise Clny. Adj Bhavani Nagar 2&3 B/R. Deluxe Flats for Sale. Peacefull Locality, Vitrified Tiles, Smooth Finished Walls, Teakwood Doors, UPVC Windows, Intercom Facility. No Common Walls. GWMC Approved Projects. 100% Vaastu. Work in Progress. Loans Can be arranged. Cell: 9848045527.

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నందు గేటెడ్ కమ్యూనిటీలో 1BHK 10 లక్షలు, 2BHK 14 లక్షలు, 15 లక్షలు, 18 లక్షలు ఎమినిటీస్ + ✆ 81010 10169, 81010 10168.

HNK నక్కలగుట్ట మారం Prime towers లక్ష్మి నటరాజ్ ఎన్‌క్లేవ్‌లో ఫ్లాట్ No: 404 flat అమ్మబడును. Ph: 9030956797.

HOUSE FOR SALE

Independent Duplex and Triplex houses for sale in Peerzadiguda, Uppal. ✆ 9395132999, 9110554784.

Boduppal Jyothi Nagar St No.2, 150 Yds Near Indira Nagar Busstop W/F Reast Eeshanyam Road Loan Avail. Rs. 45 L ✆ 9985017349

ఇండిపెండెంట్ నూతన గృహములు 100 చ॥గ॥ నుండి 300 చ॥గ॥ల లో నిర్మించినవి. HNK లో అమ్మకమునకు కలవు సంప్ర॥ కన్సల్టెన్సీ, 8074711158.

మహబూబాబాద్ పట్టణంలో 100 చ.గ.ల విస్తీర్ణంలో నిర్మించిన బిల్డింగ్ అమ్మకానికి కలదు. ఆర్టీసీ బస్టాండ్ రోడ్ ప్రధాన కూడలిలో 24 గం॥లు వాటర్ సౌకర్యం కలదు. సంప్ర: 7989335868, 7330724253.

భీమారం బస్టాండ్ దగ్గర ఆనంద్‌నగర్ కాలనీ-I మేన్‌రోడ్ దగ్గర కొత్తగా నిర్మించిన (G+2) భవనం అమ్మకానికి కలదు. (నో్బ్రోకర్స్). Ph: 9849386178, 8309746379.

కీర్తినగర్, హౌసింగ్ బోర్డు కాలనీ (గొర్రెకుంట) ఆనుకొని ఉన్న 320 గ॥ (G+1) అన్‌ఫినిష్డ్ బిల్డింగ్ అమ్మకానికి కలదు. బ్యాంకులోన్ సదుపాయం కలదు. Ph: 9908246910.

శామీర్‌పేట దగ్గర HMDA గేటెడ్ కమ్యూనిటీలో 2 BHK ఇండిపెండెంట్ ఇండ్ల ధరలు 24 లక్షలు & 30 లక్షలు & ఓపెన్ ప్లాట్లు 80% బ్యాంక్ లోన్‌తో సేల్‌కు కలవు. PMAY స్కీం ద్వారా దాదాపు 2 1/2 లక్షల ఋణ మాఫీ ఆఫర్ కలదు. Hyd. అశోక్ 95159 79010.

కే॥ 18 లక్షలకే Indp హౌజ్ HMDAఅప్రూవ్డ్ లే-అవుట్ 1లక్ష Payచేసి 85% బ్యాంక్‌లోన్, వరంగల్‌హైవే అవుషాపూర్, ఘట్కేసర్. స్పాట్ బుకింగ్‌పై రి॥ఫ్రీ. ✆ 7997979707.

ఇన్ఫోసిస్, రాంపల్లి, ఘట్‌కేసర్‌లలో అపార్ట్‌మెంట్ ధరకే ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మబడును. పరిమిత ఇళ్లు మాత్రమే కలవు. ✆ 9966330993, 9390330993.

HNK కొత్తూరు ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర 375 Sq.yds G+2 (2058x3) Sq.ft. N/F 40 & 15 ft. రోడ్స్ పక్కా వాస్తు అమ్మకమునకు కలదు. సంప్ర: 9885053560.

వరంగల్ శివనగర్‌లో #16-4-1010/1, 85 గజాల బిల్డింగ్ 21 లక్షలకు అమ్మబడును. ఫోర్ట్ రోడ్, సాయిబాబా గుడి దగ్గర. Ph: 9490862161, 8328182266.

LAND FOR SALE

భువనగిరి డాల్ఫిన్ హోటల్ దగ్గరగా వరంగల్ హైవే ఆనుకొని క్లియర్ టైటిల్‌తో అప్రూవుడ్ లేఅవుట్ నందు 2000 చ॥గ॥ ప్లాట్ నిర్మాణానికి రెడీగా కలదు. రెండు, 1000 చ॥గ॥ కూడా ఇవ్వబడును. ✆ 9346853399/ 9347744702

ఐనవోలు మండలంలోని పున్నేలు గ్రామం వడ్డరిగూడెంలో 30 గుంటల (పొలం సర్వే నెం 490) వాటర్‌తో అమ్మబడును. Cont: 9553647610.

134 ఎకరాల పండ్లతోట నెల్లూరు జిల్లా ఒజిల్ మండలం ఆర్మేనుపాడు గ్రామం NH 15 కు దగ్గర్లో సూర్యవనం అమ్మకం. 94401 83778, 94917 79999.

చిన్న పెండ్యాల గ్రామానికి దగ్గరలో 1 ఎకరము 16 గుంటలు క్లియర్ టైటిల్ వ్యవసాయ భూమి అమ్మబడును. No Brokers Ph: 9110773620, 9493879327.

గ్రేటర్ వరంగల్‌కి 7 కి.మీ. దూరంలో గల మా స్వంత గ్రామం & మండల కేంద్రమైన ఐనవోలులో పించెర్వు ప్రక్కన 4 ఎకరముల భూమి (1-B పట్టా గలది) అమ్మబడును. పరిశ్రమలకు, ఫామ్స్‌కు, సంస్థలకు అనుకూలం. 9704608001, 9603157890.

PLOT FOR SALE

HMDA Approved Plots Near B.B.Nagar Toll gate, Villas Firzatiguda. WGL- Hyd Highway. EMI, Bank Loan Available. Ph: 9550631437.

550 Yards Plot with Compound Wall and LRS Paid, Clear title for sale at Ganesh Nagar Colony, Deshaipet Road, WGL. Cell: 9849422542.

Highway Facing Commercial/ Residential Plots & Villas at Bhongiri. Near Collectorate Office. HMDA App'vd Township with Legendary Entrance, CC Roads & Underground Cabling Bank Loans ✆ 9030121310

BBD వారి 60నెలలు సులభ వాయిదాపద్ధతిలో యాదాద్రి DTCP అప్రూవ్డ్ ప్లాట్స్ కలవు. Govt. ఎంప్లాయిస్‌కు స్పెషల్ ఆఫర్. Ph: 9000824301.

గ్రేటర్ WGL మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి చేసిన కుడ ఆమోదించిన లేఅవుట్ ప్లాట్లుకై సంప్ర॥ 9032111600.

యాదాద్రిలో ప్రప్రధమముగా YTDA లేఅవుట్ L.P.No. 01/2016. 90 ఎక॥ HMDA నామ్స్‌ప్రకారం డెవలప్ చేయబడి 2వ తిరుపతిగా ప్రసిది చెందుతున్నది. ✆ 7095434655.

బంపర్ ఆఫర్ బుకింగ్ రూ. 35 వేలు యాదగిరి గుట్ట సమీపంలో 121 Sq Yards. కు ధర కేవలం 1,40,000 రూ. మాత్రమే. సంప్రదించండి: 7659965316.

HNK, వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్ రోడ్, పోలీస్‌కాలనీ, సాయిస్పందన స్కూల్ దగ్గర N/E కంపౌండ్, రూం H.NO. LRS కట్టిన 490 యార్డ్స్ ప్లాట్ అమ్మబడును. 9440146780.

HNK KUDA ఎన్‌క్లేవ్‌లో సెయింట్ పీటర్ స్కూల్ వెనకాల స్ట్రీట్ నెం. 11 లో ఈస్ట్ ఫేస్ 40x60= 266.6 యార్డ్స్ ప్లాట్ నెం. 137 గల ప్లాట్ అమ్మబడును. 9440146780.

యాదగిరిగుట్ట వద్ద DTCP అప్రూవ్డ్ ప్లాట్లు 50% లోను సౌకర్యంతో కలవు. గెస్ట్‌హౌస్ కట్టుకోవడానికి అనుకూలమైనది. ఉచిత సైట్ విజిట్‌కై సం॥ 9849017439.

KUDA వారి "O" సిటీలో E/F 36'x60' ల 240 చ॥గ॥ ఓపెన్ ప్లాట్ మరియు హన్మకొండలో NIT దగ్గర 2 BHK ఫ్లాట్ అమ్మకం కలదు నో బ్రోకర్స్ సం॥ 9849060665.

సమత వెంచర్, Wgl CKM కాలేజ్ నుండి 3 కి.మీ. దూరంలో సర్దార్‌పేట్ స్కూల్ ప్రక్కన 200, 400 గజాల పక్కా రిజిస్ట్రేషన్ ప్లాట్లు అమ్మబడును. సంప్ర॥ 9399913107, 9393788605.

హైదరాబాద్ పెద్దఅంబర్‌పేట్, హయత్‌నగర్, కొహెడ, జనచైతన్య, శ్రీమిత్ర, అ॥మెట్, బాటసింగారం, తుర్కయాంజాల్, శంషాబాద్‌లో ప్లాట్లు కొనబడును. ★ రవి 9347454990/ 9849454990

యాదాద్రికి అతిసమీపంలో DTCP Approved లేఅవుట్ నందు అన్ని సౌకర్యాలతో Proposed రిటైర్‌మెంట్ హోమ్స్, రిటైర్‌మెంట్ ఉద్యోగులకు సువర్ణావకాశం Ph: 6281256685/ 8464850159

పరకాల బస్టాండ్ ప్రక్కన 3వ ప్లాటు అమ్మబడును. తక్షణమే 2 అంతస్తుల ఇల్లు కట్టుటకు గల ప్లాను, పర్మిషన్ మ్యాపు గల 167 చ.గ. ప్లాటు అమ్మబడును. సంప్ర: 9948078643, 9948078627.

వరంగల్‌హైవే ఫేసింగ్ LP.No: 96/2016 గేటెడ్ లే-అవుట్‌లో బ్యాంక్‌లోన్ సదుపాయంతో ఇండ్ల స్థలాలు సంప్ర॥ 7702113618.

వరంగల్ స్టేషన్ ఘన్‌పూర్ from Plots 1210 yds per yrd 621 Rs. గజం॥ 10 గుంటల చొప్పున రిజిస్ట్రేషన్ హైవే నుండి 2-1/2 K.M. ✆ 9985653443

సమత వెంచర్ భీమారం తాళ్ళల్లో 150 గజాలు, 150 గజాల వేర్వేరు ప్లాట్లు పక్కా రిజిస్ట్రేషన్ కల్గినవి అమ్మబడును. సంప్ర: 9399913107, 9550222127.

ఖమ్మం హైవే మామునూరు క్యాంప్ ప్రక్కన, భారత్ పెట్రోల్ పంప్ వెనుకాల W/F 200 చ॥గ॥ ప్లాటు అమ్మబడును. Ph: 9959711342.

చార్‌బౌళి, సమత నర్సింగ్ హోమ్ దగ్గర 55 గజములు భూమి, పో॥ 40.2 ఫీట్లు, వె॥ 12.4 ఫీట్లు. # 14-7-138 అమ్మబడును. వరంగల్ Ph: 9396345425, 8686078265.

హన్మకొండ చంద్ర గార్డెన్స్ ప్రక్కన, St. పీటర్స్ స్కూల్ దగ్గర, తూర్పు, ఉత్తరం ఫేస్ గల 89 చ॥గ॥ ప్లాట్ అమ్మబడును, నో బ్రోకర్స్, సెల్: 9700763707, 7306671225.

ప్లాట్లు కొనబడును
హైదరాబాద్‌లో హయత్‌నగర్, కోహెడ, తొర్రూర్, బాటసింగారం, సాగర్‌పంపు, మజీద్‌పూర్, గుంతపల్లి, తుప్రాన్‌పేట్, మల్కాపూర్, జనహర్షలో ప్లాట్లు కొనబడును.
9848797945
9393523941

LEASE / RENT

నక్కలగుట్ట మీసేవ ఎదురు గల్లీలో బాలసముద్రం నందు 600 Sq.Ft. గ్రౌండ్ ఫ్లోర్, 1800 Sq.Ft. 1st ఫ్లోర్ ఆఫీస్, బ్యాంకులకు & 4th ఫ్లోర్ 2 BHK, 1 BHK, సింగిల్ రూమ్ ఫ్యామిలీ, ఆఫీస్‌లకు కిరాయికి ఇవ్వబడును, Cont: 9849071963.

HNK, వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్, మెయిన్‌రోడ్, సప్తగిరికాలనీ వద్ద N/E కార్నర్, కంపౌండ్, రూం, బోర్ గల 800 గ॥ ప్లాట్ రెంటుకు, లీజుకు ఇవ్వబడును. Ph: 9849457736.

WANTED

MNC Require Commercial Space On Rent With Good Visibility, And Ample Parking Call: 9849217724, rakesh@earthwide.in



Building Rent Available in Prime Location 12000 Sft for Colleges, Schools, Inistitutes, Banks, Offices. Vidyanagar, Ambedkar Bhavan Road, HNK . 9000901887.

Spacious Family portion with all Facilities H.No: 2-5-721, Subedari, Opp: Raman High School, Ph: 7702080519, 7288894096.

వరంగల్‌లోని మెయిన్ చౌరస్తాలో గల షట్టర్ షాపు కొరకు కిరాయికి ఇవ్వబడును. Ph No: 9247183366 / 9885102321.

WGL, HNK, KZPT ఏరియాలలో మంచి వసతులతో కలిగిన రూమ్స్ చూపించబడును. any రూమ్స్, బ్యాచిలర్-M/F ఫ్యామిలి, షట్టర్ చూపించబడును. సంప్ర॥ 8142487177, 8686007983.

విజయ టాకీస్ రోడ్ జుబేర్ బుక్‌స్టాల్ ఎదురుగా Zain కాంప్లెక్స్ 1st ఫ్లోర్ 3600 Sft కమర్షియల్ కొరకు కిరాయికి ఇవ్వబడును. Ph: 8885871178, 9110701619.

మిషన్ హాస్పిటల్ దగ్గర కొత్తూరు జెండా నందు పాశికంటి సుధాకర్ కిరాణం షాపు ప్రక్కన షట్టర్ కిరాయికి ఇవ్వబడును. సంప్ర॥ 9949808750.

Hunter Road Behind Wgl Public School. H.No: 1-7-1030, 1st Floor, 2BHK + Car Parking, House Rent for Families. Ph: 9440206415, 9618949918.

HNK బస్టాండ్ పద్మాక్షి గుడి రోడ్డులో బాలాంజనేయ స్వామి గుడి వద్ద (ఆంధ్రాబ్యాంకు ప్రక్కన) షట్టర్స్ కిరాయికి ఇవ్వబడును. 9966524911, 9849313697.

HNK కిషన్‌పుర శ్రీ రాఘవేంద్ర అపార్ట్‌మెంట్‌లో అత్యాధునిక వసతులతో కూడిన 3 BHK ఫ్లాట్ కిరాయికి ఇవ్వబడును. సంప్ర॥ 9491144463, 9000691180.

హన్మకొండ Zakriya కాంప్లెక్స్‌లో 2 షట్టర్స్ 500 SFT గలవి కమర్షియల్ షాప్‌కి కిరాయికి ఇవ్వబడును. Cont: 9866314012.

HNK # 1-7-1589, శ్రీనివాసనగర్, హనుమాన్ గుడి ఎదురుగా, 2BHK 24hr నీటి వసతి, 1st ఫ్లోర్ రూ: 7500, 2nd ఫ్లోర్ రూ: 6500 అన్ని వసతులతో కిరాయికి ఇవ్వబడును. 9395561655, 9490157175.

TO-LET
నయీంనగర్ వాగ్దేవి కాలేజి లైన్ పంజాబ్ నేషనల్ బ్యాంకు పైన 1900 Sq.ft. Individual & Total Area commercial కొరకు కిరాయికి ఇవ్వబడును.
సంప్ర: 9908567822



ఎట్టకేలకు ఉద్యోగులకు పదోన్నతులు

న్యూస్‌టుడే, కేయూ క్యాంపస్

కాకతీయ విశ్వవిద్యాలయంలో గతేడాది నుంచి ఊరిస్తున్న కేయూ బోధనేతర సిబ్బంది పదోన్నతులకు కేయూ ఉపకులపతి ఆచార్య పచ్చజెండా ఊపారు. ఉపకులపతి నుంచి పదోన్నతులకు అనుమతి లభించడంతో శని వారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య కె.పురుషోత్తం 24 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఉత్తర్వులను అందజేశారు. ఇందులో సీనియారిటీ ఆధారంగా 12 మందికి, పరీక్ష కోటా కింద మరో 12 మందికి పదోన్నతులు లభించాయి.

గతేడాది నిర్ణయం..

గతేడాది నవంబరులో కేయూలోని పలు విభాగాల్లో జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించడం కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో సీనియారిటీ కోటా కింద 50 శాతం, పరీక్ష కోటా కింద 50 శాతం మేరకు పదోన్నతులు కల్పించాలని నిబంధనలు ఉన్నాయి. ఈ నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పించడం కోసం అన్ని సిద్ధం చేశారు. ఈ పదోన్నతుల విషయంలో నెలకొన్న వివాదం ఫలితంగా ఏడాది నుంచి ప్రతిష్టంభన నెలకొంది. కేయూలో రెండు ఉద్యోగ సంఘాల మధ్య సయోధ్య లేకపోవడంతో అధికారులు పదోన్నతుల ప్రక్రియను వాయిదా వేస్తు వచ్చారు. ఈనెల 19న కూడా కేయూలోని రెండు బోధనేతర సంఘాలు విడివిడిగా ఆందోళనలు చేశాయి. అందరికీ పదోన్నతులు కల్పించాలని కొందరు, సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని మరికొందరు కేయూ వీసీ కార్యాలయంలో ఆందోళన చేశారు. మెస్‌లను బంద్ చేసి ఆందోళనకు దిగారు. దీంతో కేయూకు వారం రోజులు సెలవులు ప్రకటించి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. ఈనెల 30వ తేదీలోగా పదోన్నతులు కల్పిస్తామని అధికారులకు హామీ ఇవ్వడంతో ఉద్యోగ సంఘాలు ఆందోళన విరమించారు.

హామీ నెరవేర్చిన ఉపకులపతి..

ఈనెల 19వ తేదీన కేయూలోని బోధనేతర సిబ్బంది సంఘాలు రెండు వర్గాలుగా విడిపోయిన ఉద్యోగులు ఆందోళన చేయడంతో కేయూలో చివరికి పరీక్షలను వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ అంశంపైన కేయూ ఉపకులపతి ఆచార్య ఆర్.సాయన్న కేయూ రిజిస్ట్రార్‌తోపాటు పలువురు అధికారులతో కమిటీ వేశారు. ఈ కమిటీ ఉద్యోగ సంఘాలతో పలుమార్లు చర్చలు జరిపింది. ఈ నేపథ్యంలోనే ఈనెల 30వ తేదీలోగా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన వీసీ తన మాట ప్రకారం 30న పదోన్నతులు కల్పించారు.

సంఘాల మధ్య కుదిరిన సయోధ్య

పదోన్నతులపై అసంతృప్తి..

ఈ పదోన్నతులపై కొందరు ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం 58 మంది పరీక్షలు రాస్తే కేవలం 48 మంది ఫలితాలనే విడదల చేశారని వారు ఆరోపించారు. కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించగా ఇంకా న్యాయస్థానాల్లో కేసులు నడుస్తున్నాయి. కోర్టులను ఆశ్రయించిన వారు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. అంతేకాకుండా పరీక్షల్లో ఉత్తీర్ణులు కాకపోయినా ముగ్గురు ఎస్సీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం నిబంధనలకు విరుద్ధమని మరి కొంతమంది ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. సర్వీస్‌లో ఉండి పరీక్షకు హాజరైతే చాలని కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుల్లా శ్రీనివాస్ చెప్పారు. ఉత్తీర్ణులు కాకపోయినా పదోన్నతులకు అర్హులే అని ఆయన తెలిపారు. గతంలో ఎస్సీ, ఎస్టీలే కాదు బీసీ వారికి కూడా పదోన్నతులు కల్పించారని అన్నారు.

పదోన్నతులు పొందింది వీరే..

కేయూలో పదోన్నతులు పొందిన 24 మంది సీనియర్ అసిస్టెంట్లుగా ఉత్తర్వులు అందుకున్న వెంటనే విధుల్లో చేరారు. వారికి పాత స్థానాల్లోనే నియమించారు. పదోన్నతులు పొందిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

● రాముబన్సూకర్, డి.విశ్వనాథ్‌రెడ్డి, ఎన్.శంకర్, ఎండీ.ఫరూక్, ఎస్.పద్మావతి, ఎస్.సూర్యకుమారి, పి.రాజేశ్వర్, బి.సుమలత, పి.జోగయ్య, ఎస్.శ్రీనివాసరావు, బి.సృజన, బి.సుజాత, జి.యాకుబ్, డి.మల్లేషం, ఎన్.శ్రీకర్, బి.కృష్ణవేణి, ఎన్.కిరణ్‌కుమార్, డి.జగన్, ఎస్.మహర్షి, కె.షెర్లి, ఎం.నరసింహమూర్తి, ఎం.మాధవరాణి, టి.జ్యోతి, జి.సుమన్‌లు పదోన్నతులు పొందారు. మరుసటి రోజు ఆదివారం కావడం, సోమవారం నుంచి కొత్త ఏడాది ప్రారంభం కావడంతో పదోన్నతులు పొందిన వారందరూ వెంటనే విధుల్లో చేరారు. వారందరు వీసీ సాయన్నకు, రిజిస్ట్రార్ పురుషోత్తంకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పదోన్నతుల తర్వాత ఉద్యోగ సంఘాల నుంచి సానుకూలత రావడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

24 గంటల విద్యుత్తు సరఫరాకు సిద్ధంకండి

విద్యుత్‌భవన్‌లో ఉపముఖ్యమంత్రి శ్రీహరి సమీక్ష



విద్యుత్తు అధికారులతో సమీక్షిస్తున్న కడియం

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: జనవరి 1 నుంచి వ్యవసాయ సాగు కోసం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు సరఫరా అందించడం ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికతకు నిదర్శనమని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. శనివారం హన్మకొండలోని విద్యుత్తు భవన్‌లో ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు, డైరెక్టర్లు బీవీ.రావు, బీఎన్.రావు, చీఫ్ ఇంజినీర్లతో కలిసి నిరంతర విద్యుత్తు సరఫరా అందించేందుకు తీసుకుంటున్న కార్యాచరణ గురించి సమీక్ష చేపట్టారు. సీఎండీ గోపాల్‌రావు ఇతర ఉన్నతాధికారులను నిరంతర విద్యుత్ అమలు కోసం తీసుకుంటున్న చర్యలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు ఎప్పటికప్పుడు ప్రణాళికలను రూపొందించుకొని వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్న విద్యుత్ ఉద్యోగులను అభినందించారు. కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్‌లైన్లు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను పెంచడంతో నిరంతర విద్యుత్ సాకారమవుతుందన్నారు. రాష్ట్రంలో 23 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు జనవరి 1 నుంచి నిరంతర విద్యుత్ అందిస్తే 11 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదవుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో 33 కేవీఏ లైన్లు 627 కి.మీ, 53 సబ్‌స్టేషన్లు, 86 కెపాసిటర్ బ్యాంకులు, 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లకు బదులుగా 12 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే రూ.12 వేల కోట్లు వ్యయం చేసి విద్యుత్ ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. నిరంతర విద్యుత్ సరఫరా అందించడంతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ.600 కోట్లు భారం పడనుందని, దీనిని రాయితీ రూపంలో భరించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. భూగర్భ జలాలు అడుగంటి పోయే అవకాశం ఉన్నందున రైతులు తమ మోటార్లకు అమర్చిన ఆటో స్టార్టర్లను తొలగించుకోవాలని మంత్రి కడియం కోరారు. సమావేశంలో సీజీఎంలు పి.సంధ్యారాణి, టి.సదర్‌లాల్, బి.అశోక్‌కుమార్, ఏ.నగేష్, వి.మోహన్‌రావు, టి.మధుసూదన్, జీఎంలు గౌతంరెడ్డి, సుదర్శన్ ఎస్.ఈలు జి.శివరాం, నరేష్, కె.ఎన్.గుప్తా, మల్లిఖార్జున్, డీఈ టెక్నికల్ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



కలం 2017 కదిలించింది... సాయం అందింది!


ఈనాడు, వరంగల్, న్యూస్‌టుడే యంత్రాంగం

ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లను కదిలిస్తుందని ప్రజాకవి కాళోజీ ఎప్పుడో చెప్పారు. కలం బలం అలాంటిది. 2017లో ప్రజా సమస్యలపై 'ఈనాడు'లో వచ్చిన ఎన్నో కథనాలకు మంచి స్పందన వచ్చింది. అది వ్యక్తిగతంగానైనా, వ్యవస్థాగతంగానైనా... ఎలాగైతేనేం లక్ష్యం నెరవేరింది. అరుదైన వ్యాధితో బాధ పడే పాప దీనస్థితిపై రాస్తే మనసున్న వారు ముందుకొచ్చి మేం వైద్యం చేయిస్తామంటూ వచ్చి ఆదుకున్నారు. ఆసుపత్రిలో కాబోయే అమ్మల అవస్థలను కళ్లకు కడితే వరుసలో నిల్చొనే కష్టం తప్పింది. మన చారిత్రక సంపద రామప్ప ఆలయంపై ప్రశ్నిస్తే ఏకంగా హైకోర్టు స్పందించి కోవెల పరిరక్షణకు కేంద్ర సర్కారుకు దిశానిర్దేశం చేసింది. ఇలా ఒకటా రెండా ఎన్నెన్నో .వాటిలో కొన్నింటిని ఓసారి మననం చేసుకుందామా!

2017లో 'ఈనాడు'తో పరిష్కారమైన సమస్యలెన్నో!

హైకోర్టు ఆదేశించింది

కాకతీయులు కట్టిన అద్భుత ఆలయం రామప్ప. జయశంకర్ జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలో ఉన్న ఆ చారిత్రక గుడి ప్రహరీ వర్షాకాలంలో కూలిపోయింది. పురావస్తు శాఖ అధికారులు పట్టించుకోలేదు. కుడ్యం కూలి నెల రోజులు గడచినా అధికారులు పునర్నిర్మాణంపై అలసత్వం వహించడంతో 'రామప్ప ఆలయంపై నిర్లక్ష్యమేల' శీర్షికతో సెప్టెంబరు 29న ప్రధాన సంచికలో కథనం ప్రచురితమైంది. దీని ఆధారంగా హైకోర్టు సుమోటోగా తీసుకొని వెంటనే ప్రహరీని పునర్నిర్మించి పరిరక్షించాలని పురావస్తు శాఖను ఆదేశించింది. స్పందించిన అధికార యంత్రాంగం రూ. 1.26 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించింది.



రామప్ప ఆలయంలో కూలిన ప్రహరీ



పునర్నిర్మాణం కోసం రాళ్లకు మార్కింగ్ చేస్తున్న పురావస్తు శాఖ సిబ్బంది

కుర్చీలు వచ్చాయి

వరంగల్ సీకేఎం ఆసుపత్రికి నిత్యం వందల సంఖ్యలో గర్భిణులు వస్తుంటారు. వైద్యులను సంప్రదించడానికి ఆయాసపడుతూ వరుసలో నిల్చునేవారు. కాబోయే అమ్మల అవస్థలపై మేలో 'గర్భిణులకు నరకం' శీర్షికతో ఏప్రిల్‌లో జిల్లా సంచికలో కథనం వచ్చింది. స్పందించిన ఆసుపత్రి అధికారులు 1035 కుర్చీలను జూన్‌లో ఏర్పాటుచేశారు. దీంతో హాయిగా కూర్చునే అవకాశం దక్కింది.



వైద్య పరీక్షల కోసం వరుసలో నిల్చున్న గర్భిణులు



సీకేఎం ఆసుపత్రిలో కుర్చీల్లో కూర్చున్న గర్భిణులు

చికిత్స ప్రారంభం

భూపాలపల్లి జిల్లాలోని సింగరేణి గనుల్లో ప్రథమ చికిత్స కేంద్రాలు ఉన్నా మూతపడ్డాయి. దీనిపై ఆగస్టులో 'అథమంలో ప్రథమం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. వెంటనే సింగరేణి అధికారులు స్పందించారు. మూతపడ్డ ప్రథమ చికిత్స కేంద్రాలను తెరిచారు. అందులో వసతులు కల్పించారు.



సింగరేణి ఐదోగనిపై వినియోగంలోకి తెచ్చిన ప్రథమ చికిత్స కేంద్రం

పాపకు వైద్యం అందింది

వరంగల్ రూరల్ జిల్లా నల్లబెల్లి మండలం బుచ్చిరెడ్డి పల్లికి చెందిన యామిని ఆరేళ్ల వయసులోనే 63 కిలోలు బరువుపెరిగి ఊబకాయంతో సతమతమవుతూ కదలలేని స్థితికి చేరింది. ఈ పాప స్థితిపై ఆగస్టు 4న ప్రధాన సంచికలో 'ఆరేళ్లకే అరవై కిలోలు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై విజయవాడకు చెందిన వైద్యులు రవికాంత్ స్పందించి తమ ఆసుపత్రిలో రూ. 3 లక్షల విలువైన శస్త్రచికిత్సను ఉచితంగా చేశారు. పాప పరిస్థితి కుదుటపడింది.

● మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడుకు చెందిన దేవరబోయిన నిత్య ఊబకాయంతో బాధపడేది. రెండేళ్ల వయసులోనే 20 కిలోల బరువు పెరగడంతో వైద్యం చేయించలేక తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. ఈ పాపపై ఆగస్టు 28న 'వయసు రెండేళ్లు... బరువు 20 కిలోలు' శీర్షికతో ప్రధాన సంచికలో కథనం వచ్చింది. నల్లబెల్లికి చెందిన యామినికి చికిత్స చేసిన విజయవాడకు చెందిన ఎండోకేర్ ఆసుపత్రి వాళ్లు శ్రద్ధ తీసుకొని చికిత్స చేశారు. నాలుగు నెలల్లోనే పాప 10 కిలోల బరువు తగ్గి, సహజ స్థితికి చేరింది.



యామిని



గుంజేడుకు చెందిన నిత్య

బస్సొచ్చింది!

హన్మకొండ నగరంలోని న్యూశాయంపేటకు బస్సు సౌకర్యం లేదు. ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. 'ఎర్రబస్సు ఎరగరి న్యూశాయంపేట' శీర్షికతో నవంబరులో జిల్లా సంచికలో కథనం ప్రచురితమైంది. వెంటనే ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించారు. ప్రయాణికుల వెతలు తీరాయి.



వంతెన కల సాకారం..

జనగామ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురం పరిధిలోని లోతువర్రె తండాకు వెళ్లాలంటే ఒకప్పుడు స్థానికులు ఇబ్బంది పడేవారు. తండా మధ్యలో వాగు ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది అయ్యేది. దీనిపై పలుమార్లు కథనాలు వచ్చాయి. స్పందించిన ప్రభుత్వం పంచాయతీరాజ్ నిధులతో వంతెనను నిర్మించింది. 2017 ఫిబ్రవరిలో వంతెన తండా వాసులకు అందుబాటులోకి వచ్చింది.



రైలులో మరుగుదొడ్లు


పుష్‌పుల్ రైలులో మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఎంతో ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా డోర్నకల్ నుంచి సికింద్రాబాద్ వరకు ప్రయాణించడానికి కనీసం మూడున్నర నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది. దీంట్లో మరుగుదొడ్లు లేక మహిళలు, పిల్లలు నరకయాతన అనుభవించేవారు. ఈ పరిస్థితిపై జనవరిలో జిల్లా సంచికలో 'క్షణమొక నరకం' శీర్షికతో కథనం ఇస్తే రైల్వే శాఖ స్పందించి, పుష్‌పుల్‌లో మరుగుదొడ్లు ఏర్పాటయ్యేలా చొరవచూపింది. సెప్టెంబరు 4 నుంచి మరుగుదొడ్లను ఏర్పాటు చేసింది. వేలాది మంది ప్రయాణికులకు ఇబ్బందులు తప్పాయి.



రాచబాటలు

హన్మకొండలోని కాళోజీ చౌరస్తా నుంచి బస్టాండు వరకు రహదారిపై ఏడాది క్రితం అడుగడుగునా గుంతలు ఉండేవి. వాహనదారులు దీనిపై ప్రయాణం చేయడం అంటే నరకయాతనగా ఉండేది. ఈ సమస్యను అధిగమించడానికి జిల్లా సంచికలో జనవరిలో వరుస కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించిన బల్దియా యంత్రాంగం రహదారుల నిర్మాణ పనులను చేపట్టింది. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద నిధులు వెచ్చించి రోడ్డును బాగు చేసింది.





హాయిగా వెళ్తున్నారు..



వరంగల్ కాశీబుగ్గ సొసైటీ కాలనీకి వెళ్లే నల్లా గోతి ప్రమాదకరంగా ఉండేది. ఇందులో పడి అనేక మంది గాయాలపాలయ్యారు. ఒక స్కూలు బస్సు ఇరుక్కుపోయింది. ఎన్నోసార్లు పాఠశాల విద్యార్థులు పడి గాయాలపాలయ్యారు. దీనిపై అక్టోబరులో 'ప్రమాదకరంగా నల్లావాల్వ్ గొయ్యి' శీర్షికతో కథనం ప్రచురితమైంది. వెంటనే కార్పొరేషన్ అధికారులు స్పందించి బాగు చేయించారు.



సమస్య తీరనుంది



మూత్రశాలలు సరిపడా లేకపోవడంతో వరుసలో నిల్చున్న బాలికలు

జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడేవారు. కేవలం ఒకటే అందుబాటులో ఉండడంతో బాలికలు తీవ్ర అవస్థలు పడేవారు. ఈ సమస్యపై 'ఒకటికి వరస రెండుకు కలత' శీర్షికతో డిసెంబరు 19న ప్రచురితమైంది. వెంటనే స్పందించిన స్థానిక చిల్పూరు ఎస్ఐ కరుణాకర్ స్వచ్ఛందంగా బాలికల కోసం ప్రత్యేకంగా మూత్రశాలను నిర్మిస్తున్నారు.



నిర్మాణంలో ఉన్న మూత్ర శాలలు

పొలం గట్టు.. ఆదాయానికి మెట్టు!

అన్నదాతకు ఆర్థిక వనరులను సమకూర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తుంది. పంటల సాగుతోపాటు పొలం గట్లపై మొక్కల పెంపకం ద్వారా ఐదారేళ్లలో ఆదాయం వచ్చేవిధంగా రైతాంగాన్ని ప్రోత్సహిస్తోంది. నిర్వహణకు ఉపాధిహామీ పథకం ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేస్తుంది. ముఖ్యంగా టేకు, యూకలిప్టస్(జామాయిల్) మొక్కల పెంపకాన్ని విరివిగా ప్రోత్సహిస్తూ ప్రత్యామ్నాయ ఆర్థిక వనరుగా అన్నదాతకు తోడ్పాటునిస్తోంది.



ఆర్థిక వనరుగా మొక్కల పెంపకం

'ఉపాధి' పథకం ద్వారా ప్రోత్సాహం

న్యూస్‌టుడే, కొత్తగూడ

ప్రస్తుతం టేకు దొరకడం కష్టంగా మారింది.. ఆ జాతి చెట్లు అడవుల్లో కనుమరుగయ్యాయి. ఈ కలపకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. సిరులు కురిపించే పంటగా తయారైంది. రెండుమూడేళ్లుగా వర్షాభావ పరిస్థితులతో రైతులు సాగుచేసిన పంట దిగుబడి తగ్గి గిట్టుబాటు ధర లభించక అన్నదాతలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంఘటనలు చాలా ఉన్నాయి. కేవలం వ్యవసాయ పంటలపైనే గాకుండా ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న టేకు, జామాయిల్ మొక్కల పెంపకంపై ఆసక్తిచూపితే మంచి ఆదాయం పొందే అవకాశాలున్నాయి. పొలం గట్లపైన, ఖాళీస్థలాల్లో ఈ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే పర్యావరణ పరిరక్షణతోపాటు ఆర్థిక భరోసా లభిస్తోంది.

హరితహారంలో ఉచితంగా మొక్కల పంపిణీ

జిల్లాలో పలువురు రైతులు ఇప్పటికే టేకు మొక్కలపై దృష్టిసారించారు. ఇలాంటివారిని ఆదర్శంగా తీసుకుని మరికొందరు రెండేళ్లుగా టేకు వనాలు పెంచేందుకు శ్రీకారం చుట్టారు. హరితహారం పథకంలో ప్రభుత్వం ఈ మొక్కలను చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా అందజేస్తోంది. ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఒక్కోమొక్కకు నెలకు రూ.5 చొప్పున అందజేస్తోంది. ఇలా రెండేళ్లపాటు ఖర్చులు చెల్లిస్తారు. ఒక రైతు 500 మొక్కలు పెంచితే నెలకు రూ.2500 ఖర్చుల కింద అందజేస్తారు. రైతు నాటిన మొక్కల్లో 50కంటే ఎక్కువ మొక్కలు బతికి ఉంటేనే ఈ మొత్తం అందజేస్తారు. జామాయిల్ మొక్కలు నాటే రైతులకు ఉచితంగా మొక్కలు అందజేస్తారు. మొక్కలు నాటేందుకు తీసిన గుంతకు మొక్క నాటినందుకు రూ.4 చొప్పున చెల్లిస్తారు. నిర్వహణ ఖర్చులు చెల్లించరు.

అందుబాటులో టేకు మొక్కలు

జిల్లాలో అటవీశాఖ ఆధ్వర్యంలో 36, డ్వామా ఆధ్వర్యంలో 31 నర్సరీల్లో మొక్కలు పెంచారు. జిల్లాలో మొత్తం 1.15 కోట్ల మొక్కలు నాటే లక్ష్యంగా ప్రణాళికను అధికారులు రూపొందించారు. 55 లక్షలు టేకు, 10 లక్షలు ఈత, ఖర్జూర, 41 లక్షలు కలపనిచ్చు మొక్కలు, పండ్ల మొక్కల లక్ష్యంగా మొక్కలను పెంచారు. జిల్లాలోని నర్సరీల్లో టేకు మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

అమ్మకం సులువే..

టేకు మొక్కల ఎదుగుదల తర్వాత అమ్మడానికి ఇబ్బందులుండవు. చేతికొచ్చిన మొక్కలు నరికే ముందు స్థానిక అటవీ శాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకొని అనుమతి కోరాలి. ఆ తర్వాత రేంజీ పరిధిలోని అటవీశాఖ క్షేత్ర అధికారి సంబంధిత వనాన్ని సందర్శించి రైతు సాగుచేసుకున్నదిగా గుర్తించి నరికేందుకు అనుమతిస్తారు. చెట్లను కొనుగోలు చేసేందుకు అనేక మంది వ్యాపారులు అందుబాటులో ఉంటారు. కొనుగోలు చేసిన ఈచెట్లను అనుమతి పత్రాలతో ఎక్కడికైనా తరలించవచ్చు. జామాయిల్ చెట్లను పేపరుతయారీ కంపెనీలే గ్రామాలకు వచ్చి కొనుగోలు చేస్తున్నాయి.

రైతులకు ఆదాయం: కిష్టగౌడ్, అటవీశాఖ అధికారి



టేకు మొక్కల పెంపకంతో మంచి లాభాలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల్లో పొలంగట్లపై ఎక్కువగా టేకుమొక్కలు పెంచుతారు. సుమారు ఇరవై ఏళ్లు గడిస్తే రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. పొలంగట్లలో ఇరువురి రైతుల భూమి మధ్య పెంచితే ఈ మొక్కలు గెట్టుగా కూడా ఉపయోగపడతాయి. భూమి విలువ పెరిగినట్టు టేకు మొక్క విలువ రోజులు గడుస్తుంటే ఆదాయం ఎక్కువగా వస్తుంది.

ఆదాయం వచ్చేదిలా..

- ఒక ఎకరం భూమిలో 600 మొక్కల నుంచి 800 టేకు మొక్కల వరకు నాటుకోవచ్చు.
- నాటిన మొక్క 12 ఏళ్ల తర్వాత 20 అడుగులు ఎదుగుతుంది. అప్పుడు చెట్టులోని మధ్యలో శాగ ప్రారంభమవుతోంది.
- 15 ఏళ్ల నుంచి 20 ఏళ్ల వరకు పెంచాక ఫలితాన్ని పొందవచ్చు.
- ఒక్కో ఎకరంలో పెరిగిన 600 టేకు చెట్లకు పెట్టుబడి, ఇతర ఖర్చులు పోను రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఆదాయాన్ని పొందవచ్చు. భవిష్యత్తులో ఇంకా ఎక్కువ ధర పలికే అవకాశం ఉంటుంది.
- జామాయిల్ మొక్కలు ఎకరంలో 800 నుంచి 1000 వరకు నాటవచ్చు. ఫలితాన్ని నాలుగు నుంచి ఐదేళ్లలోపు పొందవచ్చు. కాగితపు తయారీ మిల్లులు యజమానులు కొనుగోలు చేస్తారు. ఒక్కో ఎకరంలో ప్రస్తుతం రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఆదాయం వస్తుంది. భవిష్యత్తులో ఎక్కువ డబ్బులు వచ్చే అవకాశం ఉంటుంది.

పారిశ్రామికం వైపు అడుగులు

టీఎస్ఐపాస్ ద్వారా మహిళల దరఖాస్తులు

న్యూస్‌టుడే, డోర్నకల్


హైదరాబాద్ వేదికగా గత నవంబర్ నెలలో రెండు రోజుల పాటు జరిగిన ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు మహిళా సాధికారత గూర్చి విస్తృత చర్చకు తెర లేపింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె, శ్వేత సౌధం సలహాదార ఇవాంకాతోపాటు సదస్సుకు హాజరైన వారిలో సగానికి పైగా మహిళా పారిశ్రామిక వేత్తలే ఉండటం ఇందుకు కారణం. తండ్రికే సలహాలిస్తూ నాయకురాలిగా ఎదిగిన ఇవాంకా నేటి యువ మహిళా లోకానికి ఓ స్ఫూర్తిప్రదాతగా నిలిచారనడం అతిశయోక్తి కాదు. ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకునే ప్రతిభ మన నారీలోకంలోనూ ఉంది. దానికి పదును పెట్టే ఉత్సాహం, పట్టుదల, కార్యదక్షతను సొంతం చేసుకుంటే ఉమ్మడి వరంగల్ జిల్లా కీర్తి రెప రెప లాడనుంది. మహబూబాబాద్, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో టీ-ఐపాస్ పథకం ద్వారా 53 మంది మహిళలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా అడుగులు వేశారు. రానున్న కాలంలో మరింత మంది ఈ దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షిస్తూ, వారికి ఉన్న అవకాశాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం

టీ-ఐపాసు ద్వారా అందిన దరఖాస్తులు ఇలా

జిల్లా	పరిశ్రమలు	ఉద్యోగులు	పెట్టుబడి (రూ.కోట్లలో)
జనగామ	30	1785	3209
వరంగల్ అర్బన్	114	1685	159
వరంగల్ రూరల్	59	923	94
జయశంకర్	24	351	25
మహబూబాబాద్	47	690	150

గ్రామీణ మహిళలకు అంకురం

ఒకప్పుడు గ్రామీణ మహిళలకు అవకాశాలు అందనంత ఎత్తులో ఉండి వారి ప్రతిభ మరుగున పడేది. ఇప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారికి అనేక అవకాశాలు కలిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లో నడుస్తున్న అంకుర సంస్థ గ్రామీణ మహిళలకు ఒక వరం వంటిది. విజయవంతమైన మహిళా పారిశ్రామికవేత్తలు దీన్నే అందిపుచ్చుకున్నారు. వీరిలో నుంచే కొందరి విజయగాథలను ప్రపంచ పారిశ్రామిక వేత్తల సదస్సుకు ఎంపిక చేశారు. అబలలు కాదు సబలలమని నిరూపిస్తుండటమే ఇందుకు కారణం.



మహిళా పారిశ్రామిక వేత్తలుగా కొత్త జీవితాలకు అంకురార్పణ చేసుకుంటున్నారు.

టీఎస్ ఐపాస్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పారిశ్రామిక విధానం అమలులోకి తెచ్చింది. పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తోంది. ముఖ్యంగా మహిళా పారిశ్రామిక వేత్తలకు అనేక రాయితీలు కూడా అందిస్తోంది. స్థానికంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవటానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుంది.

అవకాశాలు పుష్కలం: డాక్టర్ ప్రీతిమీన, కలెక్టర్, మహబూబాబాద్

చదువుకున్న యువతులు మహిళా పారిశ్రామిక వేత్తలుగా రాణించడానికి అవకాశాలు పుష్కలం మానుకోట జిల్లా నుంచి టీఎస్ ఐపాస్‌ని వేదికగా చేసుకుని ఎందరో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకుంటున్నారు. విద్యార్హతలను బట్టి మహిళలు అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారు పారిశ్రామిక వేత్తలుగా రాణించే మహిళలకు ప్రభుత్వపరంగా వాణిజ్య వాహనాల కొనుగోలుకు రాయితీలిస్తున్నాం. జిల్లా ఏర్పడ్డాక వివిధ రకాల పరిశ్రమల స్థాపనకు 42 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 24 మంది మహిళలు కావడం విశేషం.

మహిళలు స్థాపించే పరిశ్రమల్లో ముఖ్యమైనవి కొన్ని

● రాంపూర్‌లో రూ.25 లక్షలతో లూబ్రికంట్ ఆయిల్స్ పరిశ్రమ ● మడికొండలో రూ.1.25 కోట్లతో నాన్-ఉమెన్ బ్యాగ్ ఆఫ్‌సెట్ ప్రింటింగ్. ● మడికొండలో రూ.1.17 కోట్లతో క్యారీ బ్యాగు ప్రింటింగ్. ● ఎనుమాములలో రూ.1.55 కోట్లతో గోదాం. ● ఎనుమాములలో రూ.77 లక్షలతో కాటన్ పరిశ్రమ ● ఉప్పల్‌లో రూ.27 లక్షలతో పాల శీతలీకరణ కేంద్రం ● పగడపల్లెలో రూ.9 లక్షలతో ఫ్లై యాష్ బిక్స్ బ్లాక్ తయారి ● ముచ్చర్లలో రూ.17 లక్షలతో పార్కింగ్ టైల్స్ తయారీ. ● కోమటిపల్లిలో రూ.52 లక్షలతో ఫ్లై యాష్ బ్రిక్స్ ● ధర్మసాగర్‌లో రూ.10 లక్షలతో సిమెంటు బ్రిక్స్, ఫ్లై యాష్ బ్రిక్స్. ● ఎనుమాములలో రూ.75 లక్షలతో పేపర్ ప్లేట్స్, పేపర్ కప్స్ తయారీ ● రాంపూర్‌లో రూ.62 లక్షలతో ప్లాస్టిక్స్ గ్రాన్యూల్స్ ● న్యూశాయంపేటలో రూ.15 లక్షలతో పాపడ్ల తయారీ. ● వరంగల్ హంటర్ రోడ్డులో రూ.65 లక్షలతో గార్మెంట్స్ తయారీ. ● రాంపూర్‌లో రూ.1.65 కోట్లతో గ్రానేట్ కట్టింగ్, పాలిషింగ్ ● రాంపూర్‌లో రూ.50 లక్షలతో వ్యవసాయ పరికరాల తయారీ ● హన్మకొండలో రూ.30 లక్షలతో ఐస్ బ్లాక్స్ తయారీ. ● హన్మకొండ టీఎన్‌జీవోస్ కాలనీలో రూ.8 లక్షలతో వాటర్ ప్లాంటు. ● స్తంభంపల్లిలో రూ.1.50 కోట్లతో మేజ్ గ్రైట్స్ పరిశ్రమ ● గోపాల్‌పూర్‌లో రూ.85 లక్షలతో ప్యాక్డ్ డ్రింకింగ్ ● స్తంభంపల్లిలో రూ.61 లక్షలతో ఆయిల్ మిల్లు. ● వడ్డేపల్లిలో రూ.10 లక్షలతో కాటన్ వీవింగ్ అండ్ స్పిన్నింగ్. ● వడ్డేపల్లిలో రూ.1.71 కోట్లతో ఆర్ఎం గార్మెంట్స్ పరిశ్రమ.

హత్యకేసులో నిందితుల అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసులు

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే : హత్య కేసుకు సంబంధించిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎల్కతుర్తి సీఐ కల్వకుంట్ల సతీష్‌చందర్ రావు తెలిపారు. శనివారం నిందితుల గురించిన వివరాలను తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం....గ్రామానికి చెందిన బోజిరెడ్డి సుజాత భార్యాభర్తలు. భార్యపై అనుమానంతో బోజిరెడ్డి తరచూ ఆమెను వేధించేవాడు. విసుగు చెందిన సుజాత భర్త అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. ఇందుకు ఆమె తండ్రి సుధాకర్‌రెడ్డితోపాటు ఆమెకు పరిచయమున్న మరో ముగ్గురికి భర్తను హత్య చేసేందుకు రూ.1.3 లక్షలకు ఒప్పందం కుదుర్చింది. పథకం ప్రకారం.. సెప్టెంబరు 17న బోజిరెడ్డిని మేడారం వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించి, ఇనుప రాడ్డుతో కొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతనిని వ్యాన్‌లో పరకాల మీదుగా కమలాపూర్ మండలం వంగపల్లి వంతెన వద్దకు తీసుకొచ్చి తీవ్రంగా ఇనుప రాడ్డుతో కొట్టి చంపారు. కాగా 18న తన భర్త అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎల్కతుర్తి సీఐ సతీష్‌చందర్‌రావు విచారణ చేపట్టారు. బోజిరెడ్డిది హత్య అని తేలడంతో సుజాత, ఆమె తండ్రి సుధాకర్‌రెడ్డిని అరెస్టు చేశారు. విచారణలో నిందితులు తెలిపిన వివరాలతో హత్యకు సహకరించిన మరో ముగ్గురు నిందితులు శనివారం ఎల్కతుర్తి శివారులో వ్యాన్‌లో వెళ్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వీరిని భూపాలపల్లికి చెందిన దిడ్డి కొండయ్య, పరకాలకు చెందిన ప్రవీణ్, చిట్యాల మండలం గోపాలపూర్‌కు చెందిన కంకణాల రాజ్‌కుమార్‌లుగా గుర్తించామని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.32 వేలు, మూడు చరవాణులను స్వాధీనం చేసుకొని, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎల్కతుర్తి, కమలాపూర్ ఎస్సైలు వీఆర్ సూరి, నాగబాబు, కానిస్టేబుల్ నవీన్, మహేష్‌లను అభినందించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ విజేత ఉమ్మడి వరంగల్ జిల్లా



విజేతగా నిలిచిన ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు

డోర్నకల్, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాసు స్మారక ఆహ్వానిత ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా విజేతగా నిలిచింది. డోర్నకల్‌లో శనివారం ఫుట్‌బాల్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సురేశ్‌పాట్నీ సమావేశంలో వివరాలు వెల్లడించారు. పోటీల్లో 12 జట్లు పాల్గొనగా ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఛాంపియన్ ట్రోఫీ కైవసం చేసుకుందన్నారు. ఉత్తమ క్రీడాకారుడిగా చింటుకు ప్రత్యేక బహుమతి అందజేశారని చెప్పారు. జట్టుకు కెప్టెన్‌గా అర్జున్‌సింగ్, కోచ్‌గా సురేశ్‌పాట్నీ వ్యవహరించారు. విజేతగా నిలిచిన జట్టుకు సింగేణి అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు గెలుపొందుతామనే ధీమాను జిల్లా జట్టులోని క్రీడాకారులు వ్యక్తం చేశారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45 ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: 2018 సంవత్సరం జయప్రదం కావాలంటే..., లక్ష్మీదేవి అనుగ్రహం కోసం సంప్రదాయరీత్యా 2018ని ఎలా స్వాగతించాలి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: పాడుతా తీయగా (రిపీట్), 10-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్యకావ్యం) 11-00: జబర్దస్త్ (కామెడీ షో రిపీట్).

మధ్యాహ్నం

12-00: జబర్దస్త్ జల్సా టైం (రిపీట్) 12-30: ఢీ-10 (సుప్రీం డాన్స్ షో) (రిపీట్), 2-00: సండే సూపర్‌హిట్ సినిమా: సామాన్యుడు (జగపతిబాబు).

సాయంత్రం

04-30: పుష్పకవిమానం (ప్రఖ్యాత దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు సినీ ప్రయాణం...) కమల్‌హాసన్, రేవతి, ఊర్వశి నటించిన 'ఆడవాళ్ళకు మాత్రమే' - చిత్ర విశేషాలు, 05-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ (రిపీట్), 6-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సా టైం (రిపీట్), 07-00: స్వరాభిషేకం: సుమధుర స్వరకర్తలు అందించిన అపురూప గీతాలతో...

రాత్రి

09-00: ఈటీవీ న్యూస్, 9-30: ఇట్స్ టైమ్ టు పార్టీ 2018 (గ్రాండ్ ఈవెంట్) న్యూఇయర్ స్పెషల్ నవ్వుల నజరానా...

ఈటీవీ ప్లస్

మధ్యాహ్నం

11:00	పోవే..పోరా రిపీట్
12:00	ఎక్స్‌ప్రెస్ రాజా బ్యాండ్ బాజా
01:00	ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్ రిపీట్
02:00	పటాస్ పంచెస్ రిపీట్
03:00	కిర్రాక్ కిడ్స్ రిపీట్

సాయంత్రం

04:00	పటాస్ రిపీట్
05:00	సండే కామెడీ మూవీ.. 'శ్రీ కనక మహాలక్ష్మీ రికార్డింగ్ డాన్స్ ట్రూప్ '

రాత్రి

07:30	పటాస్ పంచెస్ రిపీట్
08:30	ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్
09:30	నా షో నా ఇష్టం రిపీట్
10:30	సినిమా చూపిస్త మావ రిపీట్
11:30	పటాస్ రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ సద్గురు సన్నిధిలో (ఉ. 6:00)
- ★ మానస (ఉ. 6:30, 7:00, 10:00, 10:30, 11:00)
- ★ సైజ్ జీరో (ఉ. 7:30)
- ★ అమృతం (ఉ. 8:00, మ. 12:00, 1:00, సా. 6:00, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ. 8:30, మ. 12:30, 1:30, సా. 6:30, రా. 08:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ. 9:00, మ. 2:00, రా. 7:00, 9:00, 10:00)
- ★ డా.ఈటీవి (ఉ. 9:30, మ. 2:30, 3:30, రా. 7:30, 9:30, 10:30)
- ★ అందరికి ఆరోగ్యం (మ. 3:00)
- ★ అమృతం చిరుధాన్యాలు స్పెషల్ (రా. 11:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: మధురానగరిలో (శ్రీకాంత్, నిరోషా) 10-00: మార్నింగ్ షో: బ్రహ్మచారి (ఏఎన్నార్) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: ముగ మహారాజు (చిరంజీవి) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: రాజ్‌కుమార్ (శోభన్‌బాబు) రాత్రి: 7-00: ఫస్ట్ షో: నర్తనశాల (ఎన్టీఆర్, సావిత్రి) 10-00: సూపర్‌మస్తీ: వండర్‌ఫుల్ ఈవెంట్.

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఆకుకూర చిరుధాన్యాల పూరీ & బుల్గుర గోధుమ బెర్రీ క్రేప్స్, **ఉ.8:30 వావ్ ఏమి రుచి** - బొహెమియన్ సాస్ & ఆనియన్ రింగ్స్, **ఉ.9.30: గోరు ముద్దలు** - సూజీ & బ్రెడ్ పిజ్జా, **ఉ.9.45: మమ్మీస్ కిచెన్** - కోకోనట్ కాజు మైసూర్ పాక్, **ఉ.11.00: బాబాయ్ హోటల్** - తెలగపిండి ఎండు రొయ్యలు కూర & రొయ్యల కారం, **ఉ.11.30: షాహీ దక్కని** - తుటక్ & తల్వా మూర్గ్, **మ.12.00, రా.8.30: సూపర్ భీమ్** - గేమ్ షో, **మ.1.00, సా.5.30: అతిథి** - మీ ఇంటింటి నేస్తం (న్యూ ఇయర్ స్పెషల్స్), **మ.1.30, రా.10.30: ఆహారవీధిలో** - ప్రముఖ రెస్టారెంట్‌లో, **మ.2.00: చోటా షెఫ్** - పొటాటో వీల్స్, **మ.2.15: పిండివంటలు, ప్రసాదాలు** - పుట్నాలపిండి పాపిడి & స్వీట్ ఊతప్పం, **మ.2.45: పదండి విందుకు** - ప్రముఖ రెస్టారెంట్‌లో, **మ.3.15: టేస్ట్ ఆఫ్ ఇండియా (పంజాబీ క్యూసైన్)** - మఖనీ ఔర్ పన్నీర్ మఖ్‌మలీ, **సా.3.30: కారాలు, పొడులు** - మెంతి గసాల కారం పొడి & మెంతి రోటి పొడి, **సా.4.30: షాహీ దక్కని** - తుటక్ & తల్వా మూర్గ్, **రా.7.30: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్)** - ఖీమ సమోసా, **రా.7.45: డైట్ మెనూ** - మష్రూమ్ ఆమ్లెట్, **రా.8.00: బ్రేక్ ఫాస్ట్ షో** - కోడిగుడ్డు శెనగల ఛాట్ & గోధుమగడ్డి బాదం పాన్‌కేక్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ⁰, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 కమర్షియల్ స్లాట్, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: కొత్త ఏడాది సరికొత్తగా..., 01-00 ఈటీవీ 360 ⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: వైద్యరంగం@2017, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30: తీర్థయాత్ర: శ్రీ మహాగణపతి దేవస్థానం, కల్పతి అగ్రహారం, పాలక్కడ్, కేరళ, 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360⁰, 09-00: మార్గదర్శి: హేమమాలిని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ (రి), 09 -00 ఘంటారావం, 09-30 కమర్షియల్ స్లాట్, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: కొత్త ఏడాది సరికొత్తగా..., 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30: తీర్థయాత్ర, శ్రీ నందీశ్వరస్వామి దేవస్థానం, రాయచూర్, కర్ణాటక, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: వైద్యరంగం@2017, 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360⁰, 09-00: మార్గదర్శి: హేమమాలిని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!.

అన్నదాతలో...

రేపు ఉదయం 6.30 గం.లకు

1. రబీ వేరుశనగలో తిక్కా ఆకుమచ్చ తెగులు నివారణ
2. నాణ్యమైన బెల్లం తయారీ-అధిక బెల్లందిగుబడికి సూచనలు
3. పాలీహౌస్‌లో చామంతి సాగుతో లాభాలు పొందుతున్న రైతు దంపతులు

ఉచిత హెల్ప్‌లైన్ నెం.1800-425-4085కు ఉ.10-11 గం.ల మధ్య ఫోన్ చేయవచ్చు.

రైతేరాజు

టొమాటోలో నులిపురుగుల నివారణ: డైకోఫాల్ 2 మి.లీ. నీటికి కలిపి మొక్కలపై పిచికారి చేసుకోవాలి. నేల ద్వారా వ్యాపించే వ్యాధి కారకాలను నియంత్రించేందుకు.. నేలను ఒక నెల ముందు 37 శాతం ఫార్మాల్డిహైడ్‌తో సూక్ష్మజీవి రహితం (స్టెరిలైజేషన్) చేయాలి. మొజాయిక్ వైరస్ బారిన పడిన మొక్కలను వెంటనే పీకి కాల్చి వేయాలి.

జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

వరినారు పెంపకంలో జాగ్రత్తలు



యాసంగి వరినారు పెంపకంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను కంపసాగర్ కేవీకే శాస్త్రవేత్త శంకర్ సూచించారు. యాసంగిలో నారుమడికి ప్రత్యేక శ్రద్ధ అవసరం. నారుమడిని 10-12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ముచేసి చదును చేసుకోవాలి. రెండు గుంటల నారుమడికి 2 క్వింటాళ్ల కోళ్ళ ఎరువు లేదా వర్మి కంపోస్ట్ వేసి కలియదున్నాలి. దీనివల్ల చలి వాతావరణంలో కూడా నారు ఎదుగుదల బాగా ఉంటుంది.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 3 గ్రా. కార్బండాజిమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. తడి విత్తనానికి దంప నారుమడి అయితే లీటర్ నీటికి 1 గ్రా. కార్బండజిమ్ కలిపిన ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి ఒక రోజు మండె కట్టుకోవాలి. ఖరీఫ్‌లో పండించిన విత్తనాలను వెంటనే యాసంగిలో సాగు చేసే పక్షంలో, నిద్రావస్థను గమనించి విత్తుకోవాలి. నిద్రావస్థను తొలగించేందుకు లీటర్ నీటికి 6.6 మి.లీ. గాఢ నత్రికామ్లం కలిపిన ద్రావణంలో విత్తనాలను నానబెట్టాలి.

ఎరువుల యాజమాన్యం: రెండు గుంటల నారుమడికి 2 కిలోల నత్రజని చొప్పున.. కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తిన 12-14 రోజులకు వేయాలి. 2 కిలోల భాస్వరం, కిలో పొటాష్‌నిచ్చే ఎరువులు దమ్ములోనే వేయాలి.

రాత్రి వేళ్లలో ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా ఉన్నప్పుడు.. నార్లు ఎర్రబడుతుంటాయి. దీనిని అధిగమించేందుకు వరి నారు మళ్ల పక్కన కర్రలు పాతి, పాలిథీన్ షీట్ లేదా ప్లాస్టిక్ సంచులతో కుట్టిన పట్టాలను రాత్రి వేళ కప్పి, ఉదయాన్నే తీసేయాలి. చలి ఎక్కువగా ఉన్నప్పుడు నారుమడిలో రాత్రి వేళ నీరు నిండుగా ఉంచి, తెల్లవారుజామున తీసేసి కొత్త నీరు పెట్టాలి. యాసంగిలో కాండంతొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి నారుదశ నుండి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నారు తీయడానికి వారం రోజుల ముందు రెండు గుంటల నారుమడికి (200 చ.మీ.) కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 800 గ్రాములు వేయాలి. ఈ చర్యల ద్వారా నారు చలి వాతావరణాన్ని తట్టుకొని, ఆరోగ్యంగా పెరిగి 25-30 రోజులలో, 3 ఆకులతో నాటు వేసే దశకు వస్తుంది. రబీలో జింక్ లోప లక్షణాలు కన్పిస్తే.. నివారణకు జింక్‌సల్ఫేట్ 2 గ్రా., లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, త్రిపురారం

వ్యవసాయ పరిజ్ఞానం- క్విజ్

1. కింది పోషక ధాతువుల్లో పంట మొక్కలు, పండ్ల వృక్షాలకు తప్పనిసరిగా వాడాల్సిన అవసరం లేని సూక్ష్మపోషకం?
ఎ) మాంగనీసు బి) బోరాన్
సి) సోడియం డి) సున్నం

2. ఖనిజాలు అనేవి ముఖ్యంగా?
ఎ) పంటల సాగుకు అవసరమైనవి
బి) పునరుత్పత్తి చేయలేనివి
సి) పరిశ్రమాభివృద్ధికి డి) ఏదీకాదు

3. భారతదేశంలో అత్యల్ప వర్షపాతం ఉన్న ప్రాంతం?
ఎ) దక్కను పీఠభూమి బి) జైసల్మేర్
సి) అనంతపురం డి) జోధ్‌పూర్

4) పొగమల్లె బెడద లేకుండా చేసేందుకు శాశ్వత నివారణ చర్య ఏది?
ఎ) వేసవి లోతు దుక్కులు చేసి 2, 3 సంవత్సరాలు పంటమార్పిడి చేయాలి
బి) లోతుదుక్కులు చేసి వంగ టొమాటోతో పంట మార్పిడి చేయాలి
సి) లోతు దుక్కులు చేయాలి
డి) పంట విరామం పాటించాలి

5. సూక్ష్మజీవులను ఉపయోగించి కాలుష్య కారకాలను నిర్మూలించే విధానాన్ని ఏమంటారు?
ఎ) బయో అక్యుమలేషన్ బి) బయోలాజికల్ కంట్రోల్ సి) బయోరెమిటేషన్
డి) బయోమ్యాగ్నిఫికేషన్

6. తెలంగాణ ప్రాంతంలో ఎక్సాలి పంటగా చెరకు నాటేందుకు అనువైన సమయం?
ఎ) ఆగస్టు నుండి సెప్టెంబరు బి) డిసెంబరు నుండి జనవరి సి) జనవరి నుండి మార్చి
డి) జూన్ మొదటి వారం నుండి జులై ఆఖరు

7. నువ్వు పంటకు అనువైన సమయం ఏది?
ఎ) వర్షాకాలం బి) మాఘీ పంటకాలం
సి) చలికాలం డి) వేసవికాలం

8. కర్బూజ సాగుకు నేల ఉదజని సూచిక ఎంతుండాలి?
ఎ) 5.5 కంటే తక్కువ బి) 6.0 నుండి 7.0 వరకు మిక్కిలి అనుకూలం సి) 8.5 కంటే ఎక్కువ
డి) 4.0 నుండి 5.0 వరకు మిక్కిలి అనుకూలం

9. అగాకర జాతి మొక్కల ప్రత్యుత్పత్తి ఎలా?
ఎ) విత్తనం ద్వారా బి) 5 కణుపులున్న కొమ్మల ద్వారా సి) దుంపల ద్వారా
డి) వీలును బట్టి అన్ని విధానాలలో

సమాధానాలు

1) సి 2) బి 3) బి 4) ఎ 5) సి
6) బి 7) డి 8) బి 9) డి

కూర్పు: గొంటుముక్కల రామయ్య

ఛాంపియన్లం మేమే..!

- సీనియర్లలో వాగ్దేవి డిగ్రీ, పీజీ కాలేజీ విజయం
- జూనియర్లలో ప్రభుత్వ ఒకేషనల్ కాలేజీ
- రన్నరప్‌గా నిలిచిన ఎల్‌బీ కళాశాల జట్లు
- ఉత్సాహంగా ముగిసిన స్ప్రైట్ ఈసీసీ కప్-2017



సీనియర్ల విజేత వాగ్దేవి డిగ్రీ, పీజీ కాలేజీ జట్టు



జూనియర్ల విజేత ప్రభుత్వ ఒకేషనల్ కాలేజీ జట్టు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: యువ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో 11 రోజుల పాటు నారాయణ విద్యాసంస్థల సహకారంతో నిర్వహించిన స్ప్రైట్ ఈసీసీ కప్-2017 జిల్లా స్థాయి పోటీలు శనివారంతో ముగిశాయి. వివిధ కళాశాలల నుంచి హాజరైన సీనియర్, జూనియర్ కళాశాలల జట్లు నువ్వా నేనా అనేలా మైదానంలో శ్రమించారు. విజయాన్ని అందుకోవడానికి యువ క్రీడాకారులు పోటీపడ్డారు. శనివారం జరిగిన సెమీస్‌లో నిట్, ఎల్‌బీ, వాగ్దేవి, కేయూ వ్యాయామ విద్యా కళాశాలల జట్లు బరిలోకి దిగాయి. నిట్‌పై ఎల్‌బీ, కేయూ వ్యాయామ విద్యా కాలేజీపై వాగ్దేవి డిగ్రీ కాలేజీ జట్లు విజయాలు సాధించి ఫైనల్స్‌కు దూసుకుపోయాయి. ఫైనల్‌లో ఎల్‌బీ డిగ్రీ కాలేజీపై వాగ్దేవి 24 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. జూనియర్ల ఫైనల్స్‌లో ఎల్‌బీ జట్టుపై ప్రభుత్వ ఒకేషనల్ జట్టు 5 పరుగుల ఆధిక్యంతో విజయదుందుబి మోగించింది.

వాగ్దేవి ఘన విజయం

ఫైనల్ బెర్త్ కోసం హోరాహోరీగా సాగిన సెమీస్ మ్యాచ్‌లో కేయూ వ్యాయామ విద్యా జట్టుపై వాగ్దేవి డిగ్రీ కాలేజీ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కేయూ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేసింది. జట్టులో పవన్ 33, శ్రీకాంత్ 18 పరుగులు చేశారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన వాగ్దేవి జట్టు 9 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసింది. జట్టులో నవరసన్ 31, సుకాంత్ 20 పరుగులు చేశారు. వాగ్దేవి బౌలర్లు అఖిల్ 2, దీపక్ ఒక వికెట్ తీశారు.





రనౌట్‌లో విఫలమైన నిట్ బౌలర్



అంపైర్లకు నగదు పురస్కారం అందిస్తున్న జేసీ దయానంద్

ఎల్‌బీ జయకేతనం

మరో సెమీస్ పోరులో నిట్ వరంగల్‌పై ఎల్‌బీ డిగ్రీ కాలేజీ 5 వికెట్ల తేడాతో జయకేతనం ఎగుర వేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నిట్ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసింది. జట్టులో సోనుఠాకూర్ 43 పరుగులతో రాణించాడు. ఛేదనలో బ్యాటింగ్‌కు దిగిన ఎల్‌బీ జట్టు 9.5 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 72 పరుగులతో విజయాన్ని అందుకుంది. జట్టులో అజ్మీత్ 25, హేమంత్ 17 పరుగులు చేశారు. ఎల్‌బీ బౌలర్లు ప్రమోద్, మురళీ చెరో వికెట్ తీశారు.

జూనియర్ల ఫైనల్

ఉత్కంఠ పోరులో ప్రభుత్వ ఒకేషనల్ కాలేజీ గెలుపు

హోరాహోరీగా సాగిన జూనియర్ల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో ఎల్‌బీ జూనియర్ కాలేజీ జట్టుపై ప్రభుత్వ ఒకేషనల్ జట్టు 5 పరుగుల ఆధిక్యంతో విజయఢంకా మోగించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఒకేషనల్ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. జట్టులో ఓపెనర్ అజయ్ దూకుడుగా ఆడి 28 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సుతో 46 పరుగులు జోడించాడు. హుషారైన షాట్లతో ఆకట్టుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎల్‌బీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 74 పరుగుల వద్దే కూలబడింది. ఒకేషనల్ జట్టు బౌలర్లు గణేష్, సోహెల్ చెరో 2 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకంగా మారారు.

సీనియర్ల ఫైనల్

వాగ్దేవి విజయకేతనం

నువ్వా నేనా అన్నట్లుగా సాగిన ఎల్‌బీ, వాగ్దేవి డిగ్రీ కాలేజీ జట్ల మధ్య మ్యాచ్ ఆసక్తిని రేకెత్తించింది. ఎల్‌బీ జట్టుపై వాగ్దేవి డిగ్రీ కాలేజీ జట్టు 24 పరుగుల ఆధిక్యంతో జిల్లా స్థాయి ఛాంపియన్‌గా అవతరించింది. తొలుత బ్యాటింగ్ చేసిన వాగ్దేవి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసింది. జట్టులో సాయిచరణ్ 26 బంతుల్లో 3 ఫోర్లతో 32 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఎల్‌బీ కళాశాల జట్టు బ్యాటింగ్ తడబడుతూ సాగింది. నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 58 పరుగుల వద్దే ఆ జట్టు కుప్పకూలింది. వాగ్దేవి బౌలర్లు నవరసన్, వెంకటేష్ చెరో 2 వికెట్లు, దీపక్ ఒక వికెట్ పడగొట్టారు.

ముగింపు వేడుకలు..

స్ప్రైట్ ఈసీసీ కప్-2017 జిల్లాస్థాయి ముగింపు వేడుకలను సాయంత్రం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ క్రీడా మైదానంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వరంగల్ అర్బన్ జిల్లా జాయింట్ కలెక్టర్ దయానంద్, గౌరవ అతిథులుగా సుధాకర్ పైప్స్ ప్రతినిధి మధుమోహన్, ఈనాడు వరంగల్ యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్ హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ క్రీడా కుసుమాలు గ్రామీణ ప్రాంతాల నుంచే వస్తున్నారని చెప్పారు. క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి 'ఈనాడు' అందిస్తున్న అద్భుతమైన అవకాశాలు, ప్రోత్సాహాల్ని అందిపుచ్చుకుని రాణించాలని సూచించారు. జనవరి-2018 నుంచి ప్రభుత్వం తరుపున క్రీడా ప్రణాళికతో సంవత్సరం పొడవునా క్రీడలు నిర్వహిస్తామన్నారు. 'ఈనాడు' వరంగల్ యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ యువతను అత్యుత్తమ క్రీడాకారులుగా తయారుచేయడమే 'ఈనాడు' సంస్థల ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సీజన్‌లో తొలిసారిగా మహిళా క్రికెట్ పోటీలను ప్రాంతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి ఉదయభానురావు, క్రికెట్ శిక్షకులు అఫ్జల్, మథర్, వివిధ కళాశాలల పీడీలు, ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

వీరే అంపైర్లు..

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో 11 రోజుల పాటు ఉత్సాహంగా కొనసాగిన క్రీడా పోటీల్లో అంపైర్లు, స్కోరర్లు తమ విధులను విజయవంతంగా నిర్వహించారు. అంపైర్లుగా బండారి ప్రభాకర్, మట్టెడ కుమార్, జిల్లా వెంకటేశ్వర్లు, బొద్దుల అజయ్ ఎస్‌వీ రమణరావు సేవలందించారు.

స్కోరర్లుగా సుష్మిత్, ప్రశాంత్, అభినవ్ వ్యవహరించారు.



సెమీస్‌లో గెలుపొందిన ఎల్‌బీ డిగ్రీ కాలేజీ జట్టు సభ్యులు

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

జయముఖిలో ముగిసిన టెక్నోజిట్స్-2017

మగ్దుంపురం (చెన్నారావుపేట), న్యూస్‌టుడే: చెన్నారావుపేట మండల పరిధిలోని జయముఖి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైన టెక్నోజిట్స్-2017 రెండో రోజు శనివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు విద్యార్థులు ఎంతో ప్రతిభావంతంగా ప్రదర్శనలతో చూపరులను ఆకట్టుకున్నారు. రెండో రోజు శనివారం సాంకేతిక ప్రదర్శనతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యాలు, ప్రోకబడ్డీ, ఫ్లాష్‌మాబ్ నృత్యాలతో అలరించారు. ఆరోగ్య మహాభాగ్యం అనే నినాదంతో నిర్వహించిన ప్రోకబడ్డీ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. జట్లుగా విడిపోయి కళాశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఎంతో క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొన్నారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా కొనసాగిన కబడ్డీ పోటీల్లో కళాశాలలో రెండు రోజులు నిర్వహించిన టెక్నోజిట్స్-17 ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు, విద్యార్థినులతో కలిసి ఏకరూప దుస్తుల్లో ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్ నృత్యం సైతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీటితో పాటుగా ఫన్ గేమ్స్, బెలూన్‌బ్లాస్టింగ్, రాక్‌ఫ్లోర్, నవ్వుల ప్రశ్నలు, జిట్స్‌రేడియో, లక్కీకాయిన్, బ్రేక్ దిగ్లాస్, గల్లీ క్రికెట్, బైక్ రేస్, ఫన్‌హోం, గోల్‌మాల్, తదితర కార్యక్రమాలు ఎంతో ఉత్సాహాన్ని పంచాయి. రెండు రోజుల పాటు వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు న్యాయనిర్ణేతల ఎంపిక మేరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు.



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న టీవీఆర్ఎన్‌రెడ్డి



ఫ్లాష్‌మాబ్ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అవకాశాలు వినియోగించుకోవాలి: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికే ప్రతి ఏడాది టెక్నోజిట్స్ పేరుతో సాంకేతిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జయముఖి కళాశాల ఏఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన టెక్నోజిట్స్-17 కార్యక్రమం ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థి జీవితంలో ఏదైనా సాధించాలంటే ఇదే సరైన సమయమని డైరెక్టర్ ఆచార్య రంగయ్య అన్నారు. విద్యార్థి దశలో అనుకున్నది అనుకున్నట్లు ప్రణాళికతో సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లోక్‌నాథరావు, వివిద శాఖల అధిపతులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

హాయ్... నేస్తాలూ... బాగున్నారా... ప్చ్... 2017 ఇట్టే గడిచిపోయింది. హాయిగా ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపేశాం. సంవత్సరమంతా బోలెడు సంఘటనలు జరిగాయి. అందులో కొన్ని మనల్ని సంతోషపెడితే.. కొన్ని ఏడిపించేశాయి... మరికొన్ని మన ముఖాల్లో నవ్వులు పూయించి అలరించాయి. ఆశ్చర్యపరిచి... ఆటాడించి, మాయ చేసి... ఊరించి ఊరడించాయి ఇంకొన్ని. సరదాగా వీటికి అవార్డులు ప్రకటించేద్దామా... కొత్త ఏడాదిలో అడుగుపెట్టే ముందు... ఒక్కసారి మరొక్కసారి... ఆ ముచ్చట్లు గుర్తుకు చేసుకుందామా!

హాయ్! బుజ్జీ!!

ఎన్నెన్నో గుర్తులు!



హాలీవుడ్ హీరో...

మెరిశాడు!

ఆడుతూ పాడుతూ ఆడుకునే వయసులోనే మన నేస్తం హాలీవుడ్‌లో హీరో అయిపోయాడు. ఈ ఏడాది మెరిసిన చిన్నారిగా నిలిచాడు. ఎందుకంటే తను ఇంగ్లిష్ సినిమాలో పెద్ద పాత్రనే దక్కించుకున్నాడు. అవునూ! ఈ అబ్బాయి పేరు రోనీ ఆకురాతి. వీళ్ల సొంతూరు పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం. అయితే వీళ్ల అమ్మా నాన్నలతో కలిసి అమెరికాలోని ఇల్లినాయిస్‌లో ఉంటాడు. నటన మీద తనకున్న ఆసక్తిని గ్రహించిన వాళ్ల అమ్మ రోనీని యాక్టింగ్ స్కూల్లో చేర్చారు. అక్కడే తను నటన పాఠాలు నేర్చుకున్నాడు. చివరికి 'గ్రోయింగ్ అప్ స్మిత్' సినిమాలో హీరోగా నటించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. అదీ అంత తేలికగా ఏం రాలేదు. ఆ పాత్ర కోసం వెయ్యి మందికి పైగా పిల్లలు పోటీపడ్డారు. అందరికంటే రోనీ హావభావాలు దర్శకుడికి బాగా నచ్చడంతో చిత్రంలో నటించే అవకాశం వచ్చింది.

జీవి కొంచెం... ఆయువు ఘనం!



ఆశ్చర్యపరిచింది!

శాస్త్రవేత్తలు ఎప్పుడూ పరిశోధనలు చేసి కొత్త కొత్త సంగతులు బయటపెడుతుంటారుగా. అలా ఈ ఏడాది ఓ ఆసక్తికరమైన విషయం తెలుసుకున్నారు. అదేంటంటే... సముద్రపు లోతుల్లో ఉండే ట్యూబ్ వార్మ్ అనే జీవుల్లో ఒకటైన 'ఎస్కర్రియా లామినటా' గురించి. దేహమంతా గొట్టల్లా ఉండే ఈ జీవి ఏకంగా 300 ఏళ్ల కన్నా ఎక్కువే జీవిస్తుందట. అందుకే ఇప్పుడున్న జీవరాశులన్నింటిలో అత్యధికంగా బతికే ప్రాణి ఇదే కావచ్చని అనుకుంటున్నారు పరిశోధకులు. ఎక్కువగా గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్రం లోపల ఉండే ఈ జీవి ఆకారం చిన్నది, దానికి తోడు లోతుల్లో ఉండటం వల్ల ఇప్పటి వరకు దీని గురించి తెలియలేదట. ఏది ఏమైనా భలే జీవి కదూ!

కొత్త కొత్త చాక్లెట్!



ఊరించింది!

చాక్లెట్... ఈ పేరు వింటేనే నోరూరిపోతుంది. అయితే ఇప్పటి వరకు వీటిల్లో డార్క్, మిల్క్, వైట్ చాక్లెట్లే మనకు తెలుసు. కానీ ఈ ఏడాదిలో కొత్త రంగు కొత్త రుచితో ఓ చాక్లెట్ వచ్చి వాటి పక్కన చేరిపోయింది. పేరు రూబీ చాక్లెట్. ఎరుపు గులాబీ రంగులు కల గలిపి ఉంటుంది. ఇప్పటికే తినే ఉంటారుగా. 'అదేంటీ? చిన్న చిన్న చాక్లెట్ బిళ్లలు చాలా రంగుల్లోనే ఉంటాయే మరి దీని ప్రత్యేకత ఏంటో' అనే సందేహం వచ్చిందా? అసలు విషయం ఏమంటే.. వాటన్నింటిలో కృత్రిమ రంగులు కలుపుతారు. కానీ డార్క్, మిల్క్, వైట్, రూబీ చాక్లెట్ రంగులు మాత్రం సహజసిద్ధమైనవి. ఎలాంటి రంగులు కలపకుండా తయారుచేసినవన్నమాట. రూబీ కోకో బీన్స్‌తో తయారుచేశారీ రూబీ చాక్లెట్‌ని. తెలుపు రంగు చాక్లెట్ బార్ మార్కెట్లోకి వచ్చాక అంటే దాదాపు 80 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా చాక్లెట్లలో కొత్తరంగు వచ్చింది ఈ ఏడాదిలోనే.





ఆటాడించింది!

గిరగిరా తిప్పేసింది!

ఈ ఏడాదిలో పిల్లల దగ్గర్నుంచి పెద్దల వరకు ఎవరి చేతిలో చూసినా ఆ వస్తువే ఎక్కువగా కనిపించింది. అందరితో తెగ ఆడేసుకుంది.. ఆటాడించింది. అదేనండీ... ఫిడ్జెట్ స్పిన్నర్. మీరూ కొనే ఉంటారుగా! 2017 మార్కెట్లోకి వచ్చిన బొమ్మలన్నింటిలో మొదటిస్థానం దీనిదే. ఆన్‌లైన్ వెబ్‌సైట్లలోనూ ఎక్కువగా కొనుగోలైంది ఇదే. ఈ బొమ్మతో ఎలా ఆడాలో చూపిస్తూ చేసిన వీడియోలను కోట్ల మంది వీక్షించారు. చేతిలో పట్టేంత పరిమాణంలో మూడు రెక్కలతో ఉండే ఈ చిన్న బొమ్మ పరికరం బేరింగుల సాయంతో బొంగరంలా తిరిగేస్తుంది. ఆట విడుపుకే కాకుండా ఈ బొమ్మ ఒత్తిడిని దూరం చేస్తుందని పేరు తెచ్చుకుంది. ఈ ఏడాదిలో ఆకట్టుకున్న ఈ స్పిన్నర్‌ని ఎప్పుడో 1993లోనే కనిపెట్టారు.



అలరించింది!

ఆకు కాదిది జీవి..

మాయ చేసింది!

ఈ ఏడాది శాస్త్రవేత్తలు గుర్తించిన ఓ రకం కీటకం అందరినీ మాయ చేసింది. ఎందుకంటే అదిఅచ్చం ఆకులాగే ఉంటుంది. ఈ జీవి కాట్యాడిడ్ పురుగుల జాతిలో కొత్తది. దాని శరీరం, కాళ్లు.. శరీరభాగాలన్నీ చిగురుటాకుల్లాగే ఉంటాయి. కనుమాయ చేసేలా ఉన్న ఇది శాస్త్రవేత్తల కళ్ల నుంచీ ఇప్పటి వరకూ తప్పించుకుంది. చివరికి ఈ ఏడాదిలో మాత్రం దొరికిపోయింది. మలేసియాలో బోర్నియోలో ఈ వింత పురుగును గుర్తించారు. ఆకుల అల ముల మధ్యలో ఉన్న దీన్ని పరిశీలనగా చూస్తే తప్ప ఇది జీవన్న విషయం ఎవ్వరికీ తెలియదు. వీటిల్లో ఆడకీటకాలు ఇలా గులాబీరంగులో నిగనిగలాడుతూ ఉంటాయి. మగవి ఆకుపచ్చ రంగులో ఆకులాగే ఉంటాయి.



పే...ద్ద ఫెర్రిస్ వీల్!



కిక్కిచ్చింది!

మనకు రైడ్లంటే భలే సరదా. వాటిల్లో ఎక్కాలన్నా... వాటి కబుర్లు వినాలన్నా మనకెంతో ఇష్టం మరి. అందుకే ప్రపంచంలో వింతైన భారీ రైడ్లు ఏర్పాటు చేస్తే ఆ సంగతులు వెంటనే చెప్పేసుకుంటాం. అలా ఈ ఏడాదిలో కొత్తగా వచ్చింది ఓ ఫెర్రిస్ వీల్. చైనాలోని వీఫాంగ్ నగరంలో ఏర్పాటు చేశారు దీన్ని. పెద్ద చక్రంలా ఉండి గుండ్రంగా రయ్యి రయ్యిమని తిప్పేసే ఫెర్రిస్ వీల్ తెలుసుగా. వాటిల్లోనే భిన్నమైందిది. ఆ ప్రత్యేకత ఏమిటంటే... చక్రం మధ్యలో చువ్వలు లేని ఏకైక ఫెర్రిస్ వీల్. పైగా ప్రపంచంలోని ఎత్తయిన వీల్స్‌లో ఒకటైన 'లండన్ ఐ' కన్నా ఇదే పెద్దది. 1,771 అడుగుల ఎత్తులో ఉన్న బైలాంగ్ రివర్ బ్రిడ్జ్‌పై కట్టిన ఈ జెయింట్ వీల్ ఎత్తు ఏకంగా 476 అడుగులు. మొత్తం 36 గదులతో భారీ ఉంగరంలా అందర్నీ ఆకర్షించింది. గిరగిరా తిరిగేస్తూ ఎక్కిన వారికి గుండె జారిపోయినట్టు గమ్మత్తయిన అనుభూతినిస్తోంది. తెగ ఆకట్టుకుంది.

ఎమోజీల సందడి..

ఈ ఏడాది వచ్చిన, పిల్లలకు ఎక్కువగా నచ్చిన.. యానిమేషన్ సినిమా 'ది ఎమోజీ'. ఫోను, మెసేజింగ్ యాప్‌ల్లో మనం ఎక్కువగా ఎమోజీల్ని వాడేస్తుంటాం. వాటికే నోరుంటే అవి మాట్లాడేస్తే ఎలాగుంటుంది? అదే ఈ సినిమాలో చూడొచ్చు. దీనిలో హీరో ఎమోజీ జీన్. తోటి ఎమోజీలన్నీ ఒక్కొక్క హావభావాన్నే పలికిస్తే తాను మాత్రం చాలా రకాల హావ భావాల్ని పలికిస్తుంది. అయితే అదే తన గొప్పదనం అని గుర్తించకుండా పక్కవాటిలా మారాలనుకుంటుంది. అందుకు కోడ్ కనిపెట్టడం, చివరికి తనలా ఉండటమే ప్రత్యేకత అని తెలుసుకోవడం కథ. అయితే ఎమోజీ బొమ్మలు మాట్లాడుకోవడం, వాటి హావభావాలు, వేషధారణ... చూస్తుంటే అన్నీ భలే గమ్మత్తుగా అనిపిస్తాయి. అందుకే ప్రపంచ దేశాలన్నీ ఈ సినిమాని ఆసక్తిగా చూశాయి. సోనీ పిక్చర్స్ తీసిన ఈ సినిమాలో వేషధారణలు తమాషాగా ఉన్నాయి. అలాంటివి ధరించి కొంత మంది వీధుల్లో ఒక్కచోట చేరారు. గిన్నిస్ రికార్డు కొట్టారు.

ఎంత పనిచేసింది!



భయపెట్టింది!

ఈ ఏడాది కంప్యూటర్లు, ఫోన్లలో పిల్లల్ని భయభ్రాంతులకు గురిచేసిన గేమ్ బ్లూవేల్. బ్లూవేల్ ఛాలెంజ్ పేరుతో ఇది ఆటగాళ్లను ఆత్మహత్య చేసుకునేటట్లు ప్రేరేపించి వారి జీవితాల్ని బలితీసుకుంటుంది. నిజానికి ఈ బ్లూవేల్ డౌన్‌లోడ్ చేసుకుని ఆడే ఆట కాదు. సాఫ్ట్‌వేర్ కూడా కానే కాదు. ఇంటర్నెట్‌కు ఆకర్షితులైన పిల్లలకు ప్రత్యేక స్నేహితులుగా పరిచయం చేసుకుని రహస్యంగా ఆన్‌లైన్ ఛాలెంజ్‌లు ఇస్తుంది. బ్లేడుతో చేతిపై చిత్రాలు గీసుకోవడం లాంటి హింసతో కూడిన టాస్క్‌లతో ప్రాణాలు తీసేస్తుంది. ఈ ఏడాదే వచ్చిన ఈ ఆట కొంత మంది ప్రాణం తీసి వారి ఇంట్లో వారికి తీరని వేదనను మిగిల్చింది. తల్లిదండ్రుల్ని ఎక్కువ కలవర పెట్టిన ఈ గేమ్ ఈ ఏడాది మనల్ని చాలానే భయపెట్టేసింది. ఈ ఆటను నిషేధించే స్థాయికి తీసుకెళ్లింది.

పెరిగిపోయిన కస్టమర్ ఛార్జీల బకాయిలు

వెయ్యి విద్యుత్తు కనెక్షన్లకు సరఫరా నిలిపివేత



పరకాల, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తుండగా అందుకోసం చెల్లించే కస్టమర్ ఛార్జీలు భారీగా పెరిగిపోయాయి. పరకాల ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ పరిధిలో సుమారు రూ. 3 కోట్ల వరకు వసూలు కావల్సి ఉంది. వచ్చే నెలలోపు వాటిని రాబట్టాల్సి ఉండగా అధికారులు బకాయిల వసూళ్లకు చాలా మందికి విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. మరోవైపు రబీలో వరి నారుమడులను సిద్ధం చేసుకోగా కరెంట్ నిలిపివేయడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమయంలో బకాయిల వసూళ్లు అధికారులకు సవాలుగా మారింది.

పరకాల ఏడీఈ పరిధిలో పరకాల పట్టణం, గ్రామీణం, శాయంపేట, మొగుళ్లపల్లి మండలాలున్నాయి. ఆయా మండలాల్లో కలిపితే వ్యవసాయరంగ బావులు, బోర్లకు కలిపి మొత్తం 12 వేలకు పైగా విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వ్యవసాయ రంగానికి ఉచిత కరెంట్ సరఫరా చేస్తుండగా ఆదివారం అర్ధరాత్రి నుంచి 24 గంటలపాటు ఇవ్వనున్నారు. ఈ క్రమంలో రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఉచితంగా కరెంట్ ఇస్తుండగా కస్టమర్ ఛార్జీ కింద ఒక్కో రైతు నెలకు రూ. 30 చొప్పున ఏడాదికి రూ.360 చెల్లించాలి. మూడు విద్యుత్తు కనెక్షన్లు కలిగి ఉన్న, ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారంతా గతంలో ఉచిత విద్యుత్తు సరఫరాకు అనర్హులు. వారిని కూడా ఉచిత కరెంట్ పరిధిలోకి తీసుకొచ్చారు. వాస్తవంగా ఉచిత సరఫరాకు అనర్హులైన వారి నుంచి ప్రతి రెండు నెలలకోసారి బిల్లులు వసూలు చేసేవారు. మిగిలిన వారికి గతంలో ప్రతి ఆరు నెలలకోసారి ఆ కస్టమర్ ఛార్జీలను వసూలు చేసేవారు. ఇక నుంచి ప్రతి ఏడాదికోసారి ఛార్జీలను వసూలు చేయనున్నారు. అందుకు అనుగుణంగా రైతులకు నోటీసులను జారీ చేస్తున్నారు. మొత్తంగా రెండు నుంచి మూడేళ్ల వరకు కస్టమర్ ఛార్జీల బకాయిలు పెరిగిపోయాయి. అవి రూ. 3 కోట్ల వరకు పెరగడంతో వసూలు చేయడం ఎన్‌పీడీసీఎల్ అధికారులకు తలనొప్పిగా మారింది.

రైతుల నుంచి వ్యతిరేకత

పేరుకపోయిన కస్టమర్ ఛార్జీల వసూళ్ల కోసం అధికారులు వ్యవసాయ రంగానికి పలుచోట్ల విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. ఈ నెల నుంచే ఆ ప్రక్రియను ప్రారంభించగా ఇప్పటివరకు మూడు మండలాల్లో వెయ్యి కనెక్షన్లకు సరఫరా లేకుండా చేశారు. కానీ బకాయిదారులవి కాకుండా గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వారీగా సరఫరా నిలిపివేస్తుండటం పట్ల రైతులు మండిపడుతున్నారు. ఇటీవల మల్లక్కపేట, కామారెడ్డిపల్లి గ్రామాల్లో సరఫరా నిలిపివేయడంతో రబీలో వేసిన వరి నారుమడులు ఎండిపోతున్నాయని రైతులు పరకాలకు వచ్చి ఆందోళన చేశారు. కేవలం బకాయిదారులకు మాత్రమే కరెంట్ సరఫరా తీసివేయాలని, కస్టమర్ ఛార్జీలను చెల్లించిన తమకు విద్యుత్తు సరఫరా ఎందుకు నిలిపివేస్తారని ప్రశ్నిస్తున్నారు. నారుమడి ఎండిపోయినట్లయితే తీవ్రంగా నష్టపోతామని, విద్యుత్తు సరఫరాను నిలిపివేయవద్దని డిమాండ్ చేస్తున్నారు. మూడు మండలాల్లో కలిపి వెయ్యి కనెక్షన్లకు విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో రైతుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వస్తుంది. కనీసం గడువు ఇవ్వకుండా హఠాత్తుగా ట్రాన్స్‌ఫార్మర్లను బంద్ చేస్తున్నారని, విద్యుత్తు లేక నారుమడులు ఎండిపోతున్నట్లు వాపోతున్నారు. నారుమడులు, ఇతర పంటలు ఎండిపోకుండా కేవలం బకాయిదారులకు మాత్రమే విద్యుత్తు సరఫరా నిలిపివేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పరకాల ఏడీఈ పరిధిలోని వ్యవసాయ విద్యుత్తు సర్వీసులు, చెల్లించాల్సిన కస్టమర్ ఛార్జీలు

మండలం	సర్వీసులు	బకాయిలు(రూ.ల్లో)
పరకాల పట్టణం	1,746	50,56,629
పరకాల గ్రామీణం	3,166	85,75,714
శాయంపేట	2,691	52,99,747
మొగుళ్లపల్లి	4,548	1,08,61,117
మొత్తం	12,151	2,97,93,207

కస్టమర్ ఛార్జీలను చెల్లించాలి: రవికుమార్, ఏఈ, పరకాల

కస్టమర్ ఛార్జీలను రైతులు చెల్లించకపోవడంతో బకాయిలు భారీ ఎత్తున పేరుకుపోయిన మాట వాస్తవమే. వసూళ్ల కోసం పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల వారీగా విద్యుత్తు సరఫరా నిలిపివేశాం. ఇక నుంచి ఛార్జీలను చెల్లించని రైతులకు మాత్రమే విద్యుత్తు సరఫరా నిలిపివేస్తాం. మోటార్లకు సంబంధించిన సామగ్రిని కూడా పట్టుకొస్తాం. పరిస్థితిని అర్థం చేసుకుని రైతులు బకాయిలు చెల్లించి తమకు సహకరించాలి.

24 గంటలు నిరంతరాయంగా విద్యుత్తు అందిస్తాం

డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి



దోమతెరలు పంపిణీ చేస్తున్న కడియం, ఎంపీ, పెద్ది

ఎల్లాయిగూడెం(చెన్నారావుపేట), న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 1వ తేదీ నుంచి ప్రతి గ్రామానికి 24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ పంపిణీ చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. భారతదేశంలో మొట్టమొదటి సారిగా రైతులతో పాటు అందరి అవసరాలకు నిరంతరాయంగా విద్యుత్తు పంపిణీ చేసి నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టడానికి కేసీఆర్ అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. పౌరసరఫరాల సంస్థ రాష్ట్ర ఛైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి నర్సంపేట నియోజకవర్గంలో వినూత్నంగా చేపట్టిన పల్లెప్రగతి రెండో విడత కార్యక్రమం శనివారం ఎల్లాయిగూడెం గ్రామంలో కడియం శ్రీహరి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ప్రజల సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేసిన హరితహారం కార్యక్రమంలో రెండేళ్లు నర్సంపేట నియోజకవర్గం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపిన పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషికి మెచ్చిన సీఎం కేసీఆర్ రూ.20 కోట్ల నిధులు ప్రత్యేక నిధి నుంచి ప్రకటించారన్నారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో మరో రూ. 25 కోట్లు నిధులు ముఖ్యమంత్రి నిధి నుంచి నర్సంపేట అభివృద్ధికి మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి పల్లెప్రగతి కార్యక్రమం ద్వారా ప్రజల ముందుకు రావడం జరిగిందన్నారు. 2018 మే నాటికి అన్ని గ్రామాల్లో పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. గోదావరి నీళ్లు పాకాల వాగులోకి తీసుకురావడమే లక్ష్యంగా రూ.340 కోట్లు మంజూరు చేయడం జరిగిందని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఎల్లాయిగూడెం గ్రామ అభివృద్ధి కోసం గ్రామంతో పాటు 18 తండాలను కలుపుతూ బీటి రోడ్డు నిర్మాణం, గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, మురుగుకాలువల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీఇచ్చారు. చెన్నారావుపేట మండల పరిధిలోని చాలా గ్రామాలు తనకు 1980 నుంచి తెలుసన్నారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఎల్లాయిగూడెం గ్రామం ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కంది కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బుర్రితిరుపతి, మాజీ ఎంపీపీ వీరారెడ్డి, నాయకులు సర్పంచి బోడ విజయ, విజయరామరాజు వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సభకు హాజరైన మహిళలు

కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభం

ఈనాడు కథనానికి స్పందన

ఖానాపురం,న్యూస్‌టుడే: పాకాల పంట కాలువలు అధ్వాన్నంగా ఉండటంతో ఖరీఫ్‌లో జాలుబంధం, పస్నూరు కాలువల కింద పంటలు ఎండిపోయాయి. అధికారులు యాసంగికి తైబందీ ఖరారు చేసిన నేపథ్యంలో కొత్తూరు శివారు దుంపిళ్లగడ్డ, తదితర కాలువల కింద నీరు కాలువలు పూడికతో అధ్వానంగా ఉన్నాయి. ఈనెల 13న 'శిథిలావస్థలో పంట కాలువలు.. మరమ్మత్తులు నోచుకోక రైతుల అవస్థలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఐబీ డీఈఈ సుదర్శన్‌రావు శనివారం కొత్తూరు శివారులోని దుంపిళ్ల పాయ పంటల కాలువలను జేసీబీతో పూడిక తీయించే పనులు ప్రారంభించారు. యాసంగి సాగు నీటి విడుదలకు ముందే తైబందీ సాగు కాలువలకు మరమ్మతులు చేస్తామన్నారు. రైతులు అదనంగా తైబందీలో లేనిచోట నాట్లు వేసే ప్రయత్నాలను విరమించుకొని తైబందీ రైతులకు సహకరించాలన్నారు. అదనపు ఆయకట్టులో నాట్లు వేస్తే కేసులు పెడతామన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రుతి, వర్క్ ఇన్స్‌పెక్టర్ మనోహరస్వామి, ఆర్ఎస్ఎస్ బాధ్యులు కృష్ణ, పూర్ణచందర్‌రావు, రత్నాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



పూడిక తీత పనులను పరిశీలిస్తున్న ఐబీ డీఈఈ సుదర్శన్‌రావు

అయుత ధర్మదీక్ష కరపత్రాల ఆవిష్కరణ

రూరల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకాన్ని రద్దు చేయాలనే డిమాండ్ మేరకు జనవరి 7న గజ్వేల్ వేదికగా అయుత ధర్మ దీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్‌సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ గ్రామీణ జిల్లా కమిటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం నక్కలగుట్టలోని గ్రామీణ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో గోడపత్రికలు ఆవిష్కరించినట్లు ఆయన ప్రకటనలో తెలిపారు. పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ఇచ్చాయన్నారు. కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, లక్ష్మణ్‌రావు, సారయ్య, బాలకుమార్, రామారావు, తదితరులు పాల్గొన్నట్లు ప్రకటనలో తెలిపారు.

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం



కబడ్డీ ఆడుతున్న మహిళలు

నర్సంపేట, న్యూస్‌టుడే: శారీరక దారుఢ్యానికి, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని నగర పంచాయతీ ఛైర్మన్ వెంకటనారాయణ అన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా హెల్ప్‌స్వచ్ఛంద ఆధ్వర్యంలో పట్టణంలోని నెహ్రూనగర్(17వ)వార్డు లో శనివారం నిర్వహించిన మహిళా క్రీడోత్సవాల్లో వారు పాల్గొని మాట్లాడారు. నెహ్రూనగర్‌లో నెలకొన్న సమస్యలను తప్పకుండా పరిష్కరించి పట్టణంలోనే ఉత్తమ వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం మహిళా క్రీడా పోటీలను వెంకటనారాయణ ప్రారంభించారు. ఈసందర్భంగా మహిళలకు కబడ్డీ, పరుగు పందెం, తాడులాగుట, టెన్నికాయిట్, కుర్చీలాట, షాట్‌పుట్ వంటి క్రీడా పోటీలను జరిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఖాజాబీ, వసంత, శ్రీదేవిలతో పాటు సంతోషిమాత ఎస్ఎల్ఎఫ్, శ్రీలక్ష్మీ పరస్పర సహాయ సహకార సంఘం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కబడ్డీ, పరుగు పందెం, తాడులాగుట, షాట్‌పుట్, కుర్చీలాట, టెన్నికాయిట్ పోటీల్లో పొదుపు సంఘాల మహిళలు విజయం సాధించేందుకు ఒకరి కంటే ఒకరు పోటీపడ్డారు.

అవగాహనతో వ్యవసాయం చేస్తేనే లాభాలు



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త ఉమారెడ్డి

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: రైతులు మారుతున్న పరిస్థితులకనుగుణంగా అవగాహన పెంచుకొని వ్యవసాయం చేస్తేనే లాభాలు సాధ్యమని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఉమారెడ్డి అన్నారు. నాబార్డు ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో శ్రీరామ రైతు క్లబ్ ఆధ్వర్యంలో రైతులకు ఏర్పాటు చేసిన రైతు శిక్షణ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అవగాహన లేమితో ఇష్టారాజ్యంగా పురుగు మందులు, రసాయనాలు వినియోగించడంతో భూమి పూర్తిగా నిస్సారమైందన్నారు. ప్రాథమిక చర్యల ద్వారానే పంటదిగుబడి పెరిగి, పెట్టుబడి తగ్గుతుందని ఏడీఏ శ్రీనివాసరావు సూచించారు. కార్యక్రమానికి నాబార్డు సీఈఓ వెంకన్న అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఏడీఏ తోట శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు జున్నూతుల రాంరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రాధారపు సాంబరెడ్డి, ఏఓ హరిప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు పర్శకుమారస్వామి, సంతోష్, దొంతి సతీష్, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది, పశుసంవర్ధకశాఖ ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. చెన్నారావుపేట మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో నాబార్డు ఆధ్వర్యంలో బాలజి రైతు క్లబ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అమ్మిరెడ్డి శంకరయ్య, ప్రతినిధులు దేవేందర్, కర్ణాకర్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చని ప్రభుత్వం'



నూతన కమిటీ సభ్యులతో శ్రీనివాస్

నెక్కొండ, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా అప్రజాస్వామిక విధానాన్ని కొనసాగిస్తూ పాలన చేపడుతుందని, ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కిందని, ఉద్యమ ఆకాంక్షను నెరవేర్చడానికే ఐకాస ఏర్పడిందని రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ప్రజలు ఆశించిన తెలంగాణ కోసం ఐకాస నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. అనంతరం పనికర, దీక్షకుంట గ్రామాల్లో నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వరంగల్ రూరల్ జిల్లా కోఆర్డినేటర్ జావిద్, నర్సంపేట డివిజన్ కన్వీనర్ బొట్ల పవన్, మండల కన్వీనర్లు గోపాల్ నాయక్, వెంకన్న వివిధ గ్రామాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభ

2017 క్రీడలు



15 జులై

వింబుల్డన్ మహిళల సింగిల్స్ విజేతగా గార్బైన్ ముగురుజ (స్పెయిన్) నిలిచింది. రన్నరప్ వీనస్ విలియమ్స్ (అమెరికా).



29 అక్టోబరు

ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ సిరీస్ బ్యాడ్మింటన్ టైటిల్‌ను ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ నెగ్గాడు. తద్వారా ఒక ఏడాదిలో 4 సూపర్ సిరీస్ టైటిళ్లు సాధించిన ఏకైక భారత షట్లర్‌గా శ్రీకాంత్ రికార్డు సృష్టించాడు.

జనవరి

8: చెన్నై ఓపెన్ టెన్నిస్ టోర్నీ సింగిల్స్ టైటిల్‌ను రాబర్టో బౌటిస్టా అగట్ (స్పెయిన్) గెలుచుకున్నాడు.

22: భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ మలేసియా మాస్టర్స్ గ్రాండ్ ప్రి గోల్డ్ టైటిల్ నెగ్గింది. ఫైనల్లో చోచువాంగ్ (థాయ్‌లాండ్)ను ఓడించింది.

28: ఆస్ట్రేలియన్ ఓపెన్ - 2017 మహిళల సింగిల్స్ విజేతగా సెరెనా విలియమ్స్ (అమెరికా) నిలిచింది. ఫైనల్లో అక్క వీనస్ విలియమ్స్‌పై నెగ్గింది.

✪ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) నెగ్గాడు. ఫైనల్లో రఫెల్ నాదల్ (స్పెయిన్)ను ఓడించాడు.

ఫిబ్రవరి

7: జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను సౌరభ్‌వర్మ నెగ్గాడు. మహిళల సింగిల్స్ టైటిల్‌ను రితూపర్ణ దాస్ చేజిక్కించుకుంది.

12: భారత అంధుల క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచింది. బెంగళూరులో జరిగిన ఫైనల్‌లో పాకిస్థాన్‌పై నెగ్గింది.

మార్చి

7: మొబైల్ తయారీ సంస్థ ఒప్పో అయిదేళ్ల కాలానికి రూ. 1079 కోట్లు చెల్లించి టీమిండియా స్పాన్సర్‌షిప్ సొంతం చేసుకుంది.

ఏప్రిల్

2: ఇండియా ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విజేతగా పీవీ సింధు నిలిచింది. రన్నరప్ కరోలినా మరిన్ (స్పెయిన్).

23: మాంటెకార్లో మాస్టర్స్ సిరీస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రఫెల్ నాదల్ (స్పెయిన్) నెగ్గాడు. ఈ టోర్నీ విజేతగా నిలవడం నాదల్‌కు ఇది పదోసారి కావడం విశేషం. దీంతో క్లే కోర్టులపై అత్యధికంగా 50 సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు.

30: భారత స్క్వాష్ క్రీడాకారిణి జోష్న చిన్నప్ప ఆసియా స్క్వాష్ టైటిల్ గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా నిలిచింది. చెన్నైలో జరిగిన ఫైనల్లో భారత్‌కే చెందిన దీపిక పల్లికల్‌పై నెగ్గింది.

మే

6: అజ్లాన్‌షా హాకీ టోర్నీ విజేతగా బ్రిటన్ నిలిచింది. మలేసియాలోని ఇఫోలో జరిగిన టోర్నీలో ఆస్ట్రేలియా రన్నరప్‌గా, భారత్ మూడో స్థానంలో నిలిచాయి.

పాలీ ఉమ్రిగర్ అవార్డు విజేత...?

21: ఐపీఎల్ -2017 (సీజన్ 10) విజేతగా ముంబయి ఇండియన్స్ నిలిచింది. హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్లో రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్‌పై విజయం సాధించింది. మూడు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన తొలి జట్టుగా ముంబయి నిలిచింది.

28: దక్షిణ కొరియా జట్టు సుదిర్మన్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా నిలిచింది. ఫైనల్లో చైనాపై నెగ్గింది.

జూన్

4: తెలుగు తేజం భమిడిపాటి సాయి ప్రణీత్ థాయ్‌లాండ్ ఓపెన్ గ్రాండ్ ప్రి గోల్డ్ బ్యాడ్మింటన్ టైటిల్ నెగ్గాడు. సాయి కెరియర్‌లో ఇదే తొలి ప్రి గోల్డ్ టైటిల్.

10: ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ విజేతగా జెలెనా వోస్టాపెంకో (లాత్వియా) నిలిచింది. రన్నరప్ సిమోనా హలెప్ (రొమేనియా).

✪ పురుషుల సింగిల్స్ విజేతగా రఫెల్ నాదల్ (స్పెయిన్) నిలిచాడు. రన్నరప్‌గా వావ్రింకా (స్విట్జర్లాండ్) నిలిచాడు.

18: ఇండోనేషియా ఓపెన్ సూపర్‌సిరీస్ ప్రీమియర్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్ నిలిచాడు. రన్నరప్ కజుమస సకాయ్ (జపాన్).

10 ఫిబ్రవరి

హైదరాబాద్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ద్విశతకం (204) నమోదు చేశాడు. తద్వారా వరుసగా 4 టెస్ట్ సిరీస్‌ల్లో డబుల్ సెంచరీలు సాధించిన ఏకైక బ్యాట్స్‌మన్‌గా రికార్డు సృష్టించాడు.



1 మార్చి

2015-16 సీజన్‌కు బీసీసీఐ వార్షిక అవార్డులను ప్రకటించింది. పాలీ ఉమ్రిగర్ అవార్డును విరాట్ కోహ్లికి ప్రకటించారు. 2011-12, 2014-15 లో కూడా ఈ అవార్డు గెలుచుకున్న కోహ్లి, మూడుసార్లు దీనికి ఎంపికైన తొలి భారత క్రికెటర్‌గా నిలిచాడు.

జులై

9: భువనేశ్వర్‌లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో భారత్ 29 (12 + 5 + 12) పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది.

15: వింబుల్డన్ పురుషుల సింగిల్స్ విజేతగా రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) నిలిచాడు. లండన్‌లో జరిగిన ఫైనల్లో మారిన్ సిలిచ్ (క్రొయేషియా)పై నెగ్గాడు.

23: మహిళల క్రికెట్ ప్రపంచకప్ విజేతగా ఇంగ్లండ్ నిలిచింది. లండన్‌లోని లార్డ్స్‌లో జరిగిన ఫైనల్లో 9 పరుగుల తేడాతో భారత్‌పై నెగ్గింది. భారత్ జట్టు కెప్టెన్‌గా మిథాలీ రాజ్ వ్యవహరించారు.

24: యూఎస్ ఓపెన్ గ్రాండ్ ప్రి గోల్డ్ టోర్నీ పురుషుల సింగిల్స్ టైటిల్ విజేతగా భారత్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ నిలిచాడు. రన్నరప్ - భారత క్రీడాకారుడు పారుపల్లి కశ్యప్.

ఆగస్టు

6: లండన్‌లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల పరుగులో అమెరికా అథ్లెట్ జస్టిన్ గాట్లిన్ స్వర్ణం నెగ్గాడు. ఉసేన్ బోల్ట్ (జమైకా) తన చివరి రేసులో కాంస్యానికే పరిమితమయ్యాడు.

17: బల్గేరియా ఓపెన్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను భారత్‌కు చెందిన లక్ష్యసేన్ నెగ్గాడు.

27: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఒకుహర (జపాన్) నెగ్గింది. రన్నరప్‌గా పీవీ సింధు నిలిచింది. పురుషుల సింగిల్స్ టైటిల్‌ను విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) నెగ్గాడు.

సెప్టెంబరు

5: వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో పాల్గొన్న తొలి భారతీయురాలిగా హరియాణాకు చెందిన కవితాదేవి చరిత్ర సృష్టించింది.

7: కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాగాల వెంకట రాహుల్, రాగాల వరుణ్ స్వర్ణాలు నెగ్గారు.

10: యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను స్లోన్‌స్టీవెన్స్ (అమెరికా) గెలిచింది. ఫైనల్లో మాడిసన్ కీస్‌పై నెగ్గింది.

✪ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రఫెల్ నాదల్ (స్పెయిన్) నెగ్గాడు. రన్నరప్ - కెవిన్ ఆండర్సన్ (దక్షిణాఫ్రికా).

17: కొరియా ఓపెన్ సూపర్ సిరీస్ విజేతగా పీవీ సింధు నిలిచింది. సియోల్‌లో జరిగిన ఫైనల్లో ఒకుహర (జపాన్)పై నెగ్గింది.

అక్టోబరు

22: ఆసియాకప్ హాకీ టోర్నీ విజేతగా భారత్ నిలిచింది. ఢాకాలో జరిగిన ఫైనల్లో 2-1 తో మలేసియాపై నెగ్గింది.

✪ డెన్మార్క్ ఓపెన్ సూపర్ సిరీస్ విజేతగా కిదాంబి శ్రీకాంత్ నిలిచాడు. రన్నరప్ లీ హ్యున్ (దక్షిణ కొరియా).

28: భారత్ తొలిసారిగా ఆతిథ్యమిచ్చిన ఫిఫా అండర్ -17 ప్రపంచకప్ విజేతగా ఇంగ్లండ్ నిలిచింది. కోల్‌కతాలో జరిగిన ఫైనలో 5-2 గోల్స్‌తో స్పెయిన్‌ను ఓడించింది.

30: బ్రిటన్ రేసర్ లూయిస్ హామిల్టన్ ఫార్ములావన్ ప్రపంచ ఛాంపియన్ షిప్ టైటిల్ విజేతగా నిలిచాడు.

నవంబరు

5: మహిళల ఆసియాకప్ హాకీ టోర్నీ విజేతగా భారత్ నిలిచింది. జపాన్‌లోని కకామిగహరలో జరిగిన ఫైనల్లో చైనాపై నెగ్గింది.

8: జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో హెచ్‌ఎస్ ప్రణయ్, సైనా నెహ్వాల్ విజేతలుగా నిలిచారు.

27: భారత స్టార్ పంకజ్ అడ్వాణీ ఐబీఎస్ఎఫ్ ప్రపంచ స్నూకర్ టైటిల్ విజేతగా నిలిచాడు. పంకజ్ కెరియర్‌లో ఇది 18 వ ప్రపంచ టైటిల్.

డిసెంబరు

8: ప్రతిష్ఠాత్మక గోల్డెన్ బాల్ అవార్డును పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రోనాల్డోకు పారిస్‌లో ప్రదానం చేశారు. రొనాల్డో ఈ అవార్డు గెలుచుకోవడం ఇది అయిదోసారి.

27: దక్షిణాఫ్రికాలోని పోర్ట్ ఎలిజబెత్‌లో ఐసీసీ ప్రయోగాత్మకంగా నిర్వహించిన మొట్టమొదటి నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 120 పరుగుల తేడాతో జింబాబ్వేను ఓడించింది.

28: సౌదీ అరేబియాలోని రియాద్‌లో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను విశ్వనాథన్ ఆనంద్ గెలుచుకున్నాడు.

2017 పర్యటనలు

జనవరి

7: ఏడు రోజుల పర్యటన నిమిత్తం పోర్చుగల్ ప్రధానమంత్రి ఆంటోనియో కోస్టా దిల్లీ చేరుకున్నారు. ప్రధాని మోదీతో సమావేశమయ్యారు.

11: భారత పర్యటనలో భాగంగా కెన్యా అధ్యక్షుడు ఉహురు కెన్యాట్టా రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రధాని మోదీలతో దిల్లీలో సమావేశమయ్యారు.

ఫిబ్రవరి

21: అమెరికా నుంచి వచ్చిన 26 మంది శాసనకర్తల బృందం ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమైంది. అమెరికాలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ బృందం రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

✪ భారత పర్యటనలో భాగంగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

మార్చి

6: ఉపరాష్ట్రపతి మహ్మద్ హమీద్ అన్సారీ రెండు రోజుల పాటు జకార్తాలో పర్యటించారు. మొట్టమొదటి ఐఓఆర్ఏ (ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్) నాయకత్వ సదస్సులో పాల్గొన్నారు.

7: ఉగాండా ప్రధానమంత్రి రుహాకనా రుగుండా అయిదు రోజులపాటు భారత్‌లో పర్యటించారు.

ఏప్రిల్

8: బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

10: భారత్‌లో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా ప్రధాని మాల్కమ్ టర్న్‌బుల్ మోదీతో సమావేశమయ్యారు.

28: సైప్రస్ అధ్యక్షుడు నికోస్ అనస్తాషియెస్ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

మే

11: ప్రధాని మోదీ రెండు రోజులపాటు శ్రీలంకలో పర్యటించారు. కొలంబోలో నిర్వహించిన అంతర్జాతీయ వేసక్ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

31: ప్రధాని మోదీ స్పెయిన్ పర్యటనలో భాగంగా అధ్యక్షుడు మారియానో రజోయ్‌తో సమావేశమయ్యారు. ఏడు ఒప్పందాలపై సంతకాలు చేశారు.

జూన్

1: మోదీ రష్యా పర్యటనలో భాగంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో సమావేశమయ్యారు. నాగ్‌పుర్-సికింద్రాబాద్ మధ్య అత్యంత వేగవంతమైన రైలు సర్వీసు ఏర్పాటుకు ఈ సందర్భంగా ఒప్పందం కుదిరింది.

3: ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో పారిస్‌లోని అధ్యక్ష భవనం ఎలీసీ ప్యాలెస్‌లో సమావేశమయ్యారు.

9: కజకిస్థాన్ రాజధాని ఆస్తానాలో జరిగిన షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యారు.

24: ప్రధాని మోదీ పోర్చుగల్ పర్యటనలో భాగంగా పోర్చుగల్ ప్రధాని ఆంటోనియా కోస్తాతో సమావేశమయ్యారు.

27: మూడు రోజుల అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ వాషింగ్టన్‌లోని శ్వేతసౌధంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. సీమాంతర ఉగ్రవాదంపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు.

✪ అమెరికా పర్యటన తర్వాత మోదీ నెదర్లాండ్స్ చేరుకుని, ప్రధాని మార్క్ రూత్‌తో సమావేశమయ్యారు.

జులై

5: ప్రధాని మోదీ మూడురోజుల ఇజ్రాయెల్ పర్యటనలో భాగంగా ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో జెరూసలేంలో చర్చలు జరిపారు. అధ్యక్షుడు రూవెన్ రివ్లిన్‌తోనూ సమావేశమయ్యారు. ఇజ్రాయెల్ సందర్శించిన తొలి భారత ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించారు.

7: జర్మనీలోని హాంబర్గ్‌లో జరిగిన జీ-20 శిఖరాగ్ర సదస్సులో మోదీ పాల్గొని ప్రసంగించారు.

ఆగస్టు

24: నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవుబా భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు. ఎనిమిది ఒప్పందాలు కుదిరాయి.

31: స్విట్జర్లాండ్ అధ్యక్షురాలు డోరిస్ లూథర్డ్ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

సెప్టెంబరు

4: చైనాలోని షామన్‌లో జరిగిన బ్రిక్స్ కూటమి శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు.

12: బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో సమావేశమయ్యారు.

14: రెండు రోజుల భారత పర్యటనలో భాగంగా జపాన్ ప్రధాని షింజో అబే ప్రధాని మోదీతో గాంధీనగర్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

అక్టోబరు

4: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నాలుగు రోజుల తొలి విదేశీ పర్యటనలో భాగంగా అధ్యక్షుడు ఒమర్‌గులేహ్‌తో జిబూతీలో సమావేశమయ్యారు.

24: అఫ్గనిస్థాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌లతో విడివిడిగా సమావేశమయ్యారు.

30: ఇటలీ ప్రధానమంత్రి పవోలో జెంటిలోని భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

నవంబరు

1: భారత పర్యటనలో భాగంగా భూటాన్ రాజు జిగ్మేఖేసర్ నాంగ్యల్ వాంగ్‌చుక్ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో దిల్లీలో సమావేశమయ్యారు.

13: మనీలాలో 'ఆసియాన్' వాణిజ్యవేదిక సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు.

14: మనీలాలో నిర్వహించిన 15 వ ఆసియాన్-భారత్ సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు.

డిసెంబరు

13: కామన్‌వెల్త్ సెక్రటరీ జనరల్ పెట్రీషియా స్కాట్‌ల్యాండ్ నాలుగు రోజులపాటు భారత్‌లో పర్యటించారు.

23: రష్యా ఉపప్రధాని దిమిత్రీ రొగోజిన్ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

రచయిత – సీహెచ్ కృష్ణప్రసాద్

1 ఏప్రిల్

భారత్‌లో ఆరు రోజుల పర్యటనకు వచ్చిన మలేసియా ప్రధానమంత్రి నజీబ్ అబ్దుల్ రజాక్ ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.



30 మే

ప్రధాని మోదీ నాలుగు దేశాల పర్యటనలో భాగంగా జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్‌తో బెర్లిన్‌లో సమావేశమయ్యారు. 12 ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు చేశారు.



6 సెప్టెంబరు

ప్రధాని నరేంద్ర మోదీ ద్వైపాక్షిక పర్యటన నిమిత్తం మొదటిసారిగా మయన్మార్ చేరుకున్నారు. ప్రభుత్వ సలహాదారు ఆంగ్‌సాన్ సూచీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.



5 అక్టోబరు

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇథియోపియా పర్యటన సందర్భంగా అధ్యక్షుడు మాలాతు తెషోమేతో రాజధాని అడీస్ అబాబాలో చర్చలు జరిపారు.



Beesula Rajaiah, Mahadevpur

Q: Respected sir, please explain the meanings of the following words in Telugu with examples.

1. Perception 2. Perpetuate 3. Crave for
4. Take leave of 5. Supervision 6. Astonishment
7. Case of

A: 1) దేన్నైనా మనం అర్థం చేసుకునే తీరు. Eg: My perception of his nature is different from the others' perception of his nature.

2. Do something bad. Eg: He perpetuated the murder.

3. పరితపించి పోవడం. Eg: Having lost his mother in his early age, he is craving for a mother's love.

4. వీడ్కోలు పలకడం. Eg: He took leave of his father before going to America.

5. పర్యవేక్షణ. Eg: Under his supervision the work was done well.

6. విపరీతమైన ఆశ్చర్యం. Eg: I was filled with astonishment when I heard that I won a lakh rupees in the lottery.


7. The correct expression is 'in case of' = ఆ పరిస్థితిలో
Eg: In case of serious illness go to a doctor.

ప్రతిభ

స్పోకెన్ ఇంగ్లిష్ పాత సంచికల కోసం చూడండి.. www.eenadupratibha.net

Wish strongly for something...

VOCABULARY



1. Expedite = Speed up. (వేగవంతం చేయడం)

Eg: The manager wanted the setting up of another branch of the company expedited.

✪ Expedite X Slow down (తాత్సారం చేయడం).

Eg: The progress of the work on the bridge has slowed down.

2. Interrupt = To cause a break (అంతరాయం కలిగించడం).

Eg: To announce something, he interrupted the programme.

✪ Interrupt X Continue (కొనసాగించడం).

Eg: They continued the programme without any interruption.

3. Sedentary = Not moving / seated at a place / stationary (ఒకేచోట కూర్చుని చేసే పని)

Eg: A clerk's job is a sedentary job (because they are seated most of the time and do not move).

✪ Sedentary X mobile (moving) (కదిలే).

Eg: A police constable's job is mobile.

4. Transparent = a) Allowing light to pass through so that objects on the other side can be seen (పారదర్శకమైన).

Eg: Glass is transparent X opaque (కాంతిని అడ్డుకునే)

b) Easy to understand (సులభంగా అర్థం చేసుకునే).

Eg: His ideas are very transparent

✪ Transparent X dark / difficult to understand (అర్థం కాని).

5. Adequate = Enough (చాలినంత)

Eg: He has adequate money to buy a house.

✪ Adequate X Inadequate / meagre (తక్కువైన).

Eg: His earnings are so meagre that he cannot buy a house.



Writer
- M. Suresan

మీ ప్రశ్నలు పంపాల్సిన చిరునామా...

స్పోకెన్ ఇంగ్లిష్, ప్రతిభ విభాగం,
ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిల్మ్ సిటీ,
అనాజ్‌పూర్, రంగారెడ్డి జిల్లా.

Email your questions to:
pratibhadesk@eenadu.net

Chinna Gowd

Q: Sir, please define the following words in Telugu with some examples.

1. Conjugation of tenses
2. Voice (active& passive)
3. Transcoding information
4. Vowel 5.Consonant 6. Dipthongs
7. Semi-vowels 8. Spotting errors
9. Paranyms 10. Aspect.

A: 1) Conjugation of tenses means forming the present tense, the past tense and the future tense of a verb, along with the subdivisions - the simple, continuous, the perfect and the perfect continuous tenses of a verb. (ఒక verb కు Tenses ఏర్పరచడాన్ని conjugation అంటారు. ప్రస్తుతం, ఎప్పుడూ, అలవాటు ప్రకారం చేసేది present tense. గతంలో ఉండటం, జరిగిన వాటిని past tense అంటాం. భవిష్యత్‌లో జరిగేదాన్ని future tense అంటాం.

2. In the active voice, we say, somebody does something, and in the passive voice, we say something is done by somebody (Active voice అంటే ఒకరు ఒక పని చేశారు అని చెప్పడం. Passive voice అంటే ఒకరి చేత ఒక పని చేయబడింది అని చెప్పడం).

Eg: Active Voice: Ramana says something.
Passive voice: Something is said by Ramana.

Only verbs with objects have passive voice, except in the case of imperative sentences like, orders, requests, etc. (ఆజ్ఞలు, విన్నపాలు లాంటి వాక్యాలకు తప్ప, object లేని verbs కు passive voice ఉండదు.)

3. Transcoding information is adapting information to the digital version. This is technical, and however much it may be explained here, it is difficult to understand. (డిజిటల్ పద్ధతిలో సమాచారాన్ని మార్చడాన్ని Transcoding అంటారు. ఇది పూర్తిగా సాంకేతికం.)

4. Vowel sounds are sounds which we utter

SPOKEN ENGLISH
ఆంగ్లభాషణ 972

with our mouths open, vowel sounds అంటే తెలుగులో అచ్చులు. and the tongue or the lips not touching the other parts of the mouth. Vowels are not letters but the sounds of speech made by the organs of the mouth. (అచ్చులు అంటే అక్షరాలు కావు. నోటితో ఉచ్చరించే శబ్దాలు. In English the sounds represented by a, e, i, o, and u are vowel sounds. ఆంగ్లంలో a, e, i, o, u లు తెలిపే శబ్దాలను vowels అంటారు).

5. Consonant sounds are those which are made by the contact of one organ of the mouth with another organ of the mouth. Except the sounds represented by a, e, i, o and u are consonants. Consonants అంటే హల్లులు. ఆంగ్లంలో a, e, i, o, u లతో లేని శబ్దాలను consonants అంటాం.

6. Diphthongs are sounds formed by a combination of two vowels in a single syllable, in which the sound begins as one vowel, and moves towards another. Eg: Coin, loud, side. In coin, the sound begins with o and moves towards i. So here, the combination of the sounds of 'o' and 'i' is a diphthong.

7. A semivowel is a sound that is between a vowel and a consonant. Eg: H and Y.

8. Spotting errors means finding out the mistakes in a sentence.

9. Paranyms are euphemisms, that is, expressing an unpleasant matter in a pleasant manner. Eg: He is not such a fool as to be cheated by anybody.

10. Aspect is the positioning of something - it has other meanings too.



Kaja Syamala

Q: Please let me know the following in English

ఈ రోజుల్లో వచ్చే సినిమా హీరో, హీరోయిన్స్‌ను చూడలేకపోతున్నాం. చూడటానికి ఎవరూ బాగుండటం లేదు - ఈ వాక్యాన్ని ఇంగ్లిష్‌లో ఏమనాలి?

A: We find it difficult to see / we cannot see the heroes and heroines of today, as none of them is good looking.

Raju Surla

Q: Dear sir, please explain the following words in Telugu with examples.

1. Convulsed with 2. Convicted of
3. Convinced of 4. Distinguish from
5. Die for

A: 1. బాగా వణికిపోవడం, మన అదుపు లేకుండా

Eg: Because of a high fever, he was convulsing.

2. Punished (శిక్షపడటం). **Eg:** The judge convicted him to six months in jail.

3. This is the same as No 2.

4. Make a difference (వ్యత్యాసం చూపడం).

Eg: The teacher distinguished him from the others in the class because he was very clever.

5. Wish strongly for something.

Eg: Having lost his parents he is dying for parental love.

Grammar & Usage



In the last lesson we have seen the uses of was/were, the past doing word (Eg: saw, went, took, loved, linked, etc.) Now we are going to see the past perfect forms and the past perfect continuous forms.

Examples of the past perfect continuous tense:
a) Had been, b) had + PP (past participle / V3).

'Had been' talks of an earlier of two past states of being (గతంలో రెండు ఉండటాలు ఉన్నప్పుడు, ముందర ఉన్నదానికి had been వాడతాం.)

He had been an MLA, before he was a minister. (అతడు మంత్రిగా ఉండే ముందు MLA గా ఉన్నాడు. అంటే ఇప్పుడు మంత్రిగా కూడా లేడు).

He had been in Vijayawada and then he was in Mumbai (మొదట విజయవాడలో ఉన్నాడు. తర్వాత ముంబయిలో ఉన్నాడు - ఇప్పుడు ముంబయిలో కూడా లేడు)

'Had been' అనేది 'be' form కదా, అంటే అది ఉండటాన్ని తెలుపుతుంది. ఇప్పుడు had + PP (V3) గురించి తెలుసుకుందాం. ఉదా: had seen, had gone, had done, etc. This verb talks about an action earlier than another past action. అంటే గతంలో రెండు చర్యల్లో ముందు జరిగిన చర్యకు had + PP (V3) వాడతాం.

Eg: a) He told me yesterday that he had seen the movie. (నిన్న నాతో చెప్పాడు తాను ఆ సినిమా (అంతకు ముందే) చూశానని - గమనించండి: ఇక్కడ గతంలో జరిగిన రెండు చర్యల్లో ముందు జరిగిన చర్యకు had + PP (V3) వాడతాం.

b) The train had left before I entered the station (నేను స్టేషన్లోకి ప్రవేశించకముందే రైలు వెళ్లిపోయింది) - ఇక్కడ కూడా, రెండు గతంలో జరిగిన పనులు ఉన్నాయి. ముందు జరిగింది రైలు వెళ్లిపోవడం, తర్వాత నేను ప్రవేశించడం. ఇదీ had + PP (V3) ఉపయోగం. తర్వాతి verb, had been + ing: ఇది గతంలో ముందు ప్రారంభమై, రెండో పని జరిగేవరకు కొనసాగిన పనిని తెలుపుతుంది.

Eg: She had been working here until she got transferred (ఆమె బదిలీ అయ్యేవరకు ఇక్కడే పని చేస్తూ ఉండేది). ఇక్కడ ఆమె పని చేయడం, ఆమె బదిలీ అయ్యేవరకు కొనసాగింది. అందుకని ఒక పని ముందర ప్రారంభమై, రెండో పని జరిగే వరకు కొనసాగిన పనిని had been + ing form లో తెలుపుతాం. ఇవన్నీ కూడా past tense forms. మరి కొన్ని వివరాలు వచ్చేవారం.

మార్పు కోసం ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక

జనవరి 25న ఏర్పాటు

ఎర్రజెండా ద్వారానే ప్రజలకు న్యాయం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఘనంగా ప్రారంభమైన సీపీఎం అర్బన్ జిల్లా మహాసభలు

శివనగర్, న్యూస్‌టుడే: పరిపాలనలో మార్పు కోసం, తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం, అణగారిన ప్రజల బతుకుల బాగు కోసం రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. ప్రత్యామ్నాయ వేదికను 2018 జనవరి 25న ప్రకటించనున్నట్లు వివరించారు. వరంగల్ అర్బన్ జిల్లా పార్టీ మహాసభలు హన్మకొండలోని కల్యాణి ఫంక్షన్ హాల్ కొప్పుల ఎల్లయ్య ప్రాంగణంలో శనివారం ప్రారంభం కాగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన తమ్మినేని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి మూడేళ్లయినా.. స్వరాష్ట్రం కోసం ఉద్యమించిన ప్రజల కలలు సాకారం కాలేదన్నారు. నిరుద్యోగిత తగ్గలేదని, రైతులు బాగుపడలేదన్నారు. రాష్ట్రం ఏర్పడకముందున్న పరిస్థితులే ఇంకా ఉన్నాయన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు ద్వారా ప్రజల కంటే సీఎం కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని ఆరోపించారు. పరిపాలన సాగించే రాజకీయ పార్టీలు, వ్యక్తులు మారుతున్నారే తప్ప పాలనా విధానాలు మారడం లేదన్నారు. ప్రజల బతుకులను మార్చే విధానాలున్న పార్టీకి అధికారం ఇవ్వాలని కోరారు. ఆ దిశగా సీపీఎం ఆలోచిస్తోందని చెప్పారు. ప్రజలకు సామాజిక న్యాయం కావాలన్నారు. సీఎం కేసీఆర్ గొర్రెలు, చేపలను ఇస్తున్నారని, అది కేవలం సామాజిక సాయమే అవుతుంది కానీ సామాజిక న్యాయం కాదన్నారు. సామాజిక న్యాయం కోసం రాజకీయాధికారంలో అన్ని కులాలకు సమాన అవకాశాలుండేలా ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక కోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చెప్పినట్లు ఆత్మ గౌరవంతో బతికేలా చేయడానికి సామాజిక న్యాయం సాధించేడమే లక్ష్యంగా సీపీఎం పనిచేస్తోందన్నారు. ఈ విషయంలో ఇప్పటికే ఎర్ర జెండా పార్టీలన్నీ ఒక అవగాహనకు వచ్చాయని, 31 సంస్థలు ఏకతాటిపైకి చేరాయని వెల్లడించారు. జనవరి 25న ప్రత్యామ్నాయ వేదికను ప్రకటిస్తామన్నారు. ఈ వేదిక ద్వారా రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తామన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయ వేదికకు ప్రజలు సహకరించాలని తమ్మినేని పిలుపునిచ్చారు.

మతోన్మాద రాజకీయాలు..

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డాక్టర్ కె.హేమలత మాట్లాడుతూ దేశంలో మతోన్మాద రాజకీయాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గోరక్షణ పేరిట భాజపా ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో హింసను ప్రేరేపిస్తోందన్నారు. దేశాన్ని మరింత చీల్చాలని భాజపా చూస్తోందని ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.వెంకట్ మాట్లాడుతూ దేశంలో పెద్ద నోట్ల రద్దు భారీ కుంభకోణమన్నారు. నోట్ల రద్దు ద్వారా దేశంలోని పారిశ్రామికవేత్తలకు కేంద్ర ప్రభుత్వం సహకరించిందన్నారు. జీఎస్టీని ప్రవేశపెట్టడం ద్వారా అన్ని ధరలు పెరిగాయని, ప్రజలకంటే వ్యాపారులే లాభపడ్డారన్నారు. సీపీఎం వరంగల్ రూరల్ జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు తెరాస ఇచ్చిన ఏ హామీని అమలు చేయడం లేదన్నారు. ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందని, అలాంటి చర్యలను తట్టుకొని సీపీఎం మరింత ముందుకు సాగుతుందన్నారు. సభల ప్రారంభానికి ముందు పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు వైట్ల జనార్దన్ ఆవిష్కరించారు. సీపీఎం అర్బన్ జిల్లా కార్యదర్శి సారంపెల్లి వాసుదేవరెడ్డి ప్రారంభ సభకు అధ్యక్షత వహించి స్వాగతోపాన్యాసం చేశారు. మహాసభలలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.ప్రభాకర్‌రెడ్డి, నలిగంటి రత్నమాల, టి.ఉప్పలయ్య, రాగుల రమేశ్, సీనియర్ నాయకుడు కె.వెంకటయ్య, జిల్లా కమిటీ సభ్యులు మొట్టుక కుమారస్వామి, వాంకుడోతు వీరన్న, గొడుగు వెంకట్, నాగేశ్వర్‌రావు, సింగారపు బాబు, మహబూబ్‌పాషా అర్బన్ జిల్లాలోని 11 మండలాల నుంచి పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు.



సంఘీభావం తెలుపుతున్న తమ్మినేని వీరభద్రం, హేమలత తదితరులు

నగరంలో భారీ ప్రదర్శన

సీపీఎం అర్బన్ జిల్లా 19వ మహాసభల ప్రారంభానికి ముందు సీపీఎం ఎర్రదండు నగరంలో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. హన్మకొండ చౌరస్తా నుంచి మొదలైన ఈ ప్రదర్శనను సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకట్ జెండాఊపి ప్రారంభించారు. ఎర్రని చొక్కాలు ధరించిన వాలంటీర్లు సీపీఎం భారీ జెండాలను చేతబూని కదం తొక్కారు. డప్పు వాయిద్యాలతో ప్రదర్శన నగర వాసులను ఆకట్టుకుంది. బాలికల కోలాటాల ప్రదర్శన ఆద్యంతం మహా ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీపీఎం నేతలు ఎరుపురంగు చొక్కాలు ధరించి ప్రదర్శనలో ముందునడవగా, మహిళా నేతలు, కార్యకర్తలు ఎరుపుచీరలతో ప్రదర్శనకు అరుణవర్ణాన్ని ఆపాదించారు.


దప్పువాయిద్యాలతో కళాకారుల ఉత్సాహం


ఎరుపురంగు చీరలు ధరించి జెండాలతో వస్తున్న మహిళా నేతలు


మహాసభలకు హాజరైన పార్టీ ప్రతినిధులు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నువ్వొస్తానంటే.. నేరానిస్తానా..?

నగరంలో స్వైర విహారం చేస్తూ.. ఇళ్లలోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్న మర్కటాలకు అడ్డుకట్ట వేయడానికి ఓ గృహస్థుడు వేసిన ఐడియా అదిరింది... ఇంటి పరిసరాల్లోకి వస్తున్న వానరాలను కట్టడి చేయడానికి ఇంటి ముందు చెట్టుపై కొండముచ్చు చిత్రంతో ఫ్లెక్సీని కట్టారు. నువ్వొస్తానంటే నేరానిస్తానా.. అన్నట్లుగా భీకరంగా ఉన్న కొండెంగ చిత్రాన్ని చూసి కోతులు బెంబేలెత్తున్నాయని, వాటి బెడద క్రమేపీ తగ్గినట్లు భవన యజమాని తెలిపారు. వరంగల్ అర్బన్ జిల్లా బాలసముద్రంలోని ఓ ఇంటి ముందు కొండెంగ ఫ్లెక్సీ చిత్రం ఇది.

చిత్రం: ఆవుల సంపత్





బ్రాహ్మణులకు ఆరోగ్యకార్డులు

సంక్షేమ పరిషత్ ద్వారా రూ.1.18 కోట్లు

బ్రాహ్మణ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ

రామన్నపేట, న్యూస్‌టుడే: పేద బ్రాహ్మణుల ఆరోగ్య పరిరక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ ద్వారా ఆరోగ్య కార్డులు పంపిణీ చేస్తున్నట్లు గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. దీనికోసం రూ.1.18 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. శనివారం వరంగల్‌లోని పోతన భవనంలో నిర్వహించిన వరంగల్ బ్రాహ్మణ సేవా సమితి ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు చెందినవారు, వరంగల్ గ్రామీణ జిల్లాకు చెందిన 59 మందికి ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపేంద్రశర్మ మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యతనిస్తున్నారని చెప్పారు. పేద బ్రాహ్మణుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమల్లోకి తెచ్చారని వివరించారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన పేద బ్రాహ్మణులు, శ్రీవైష్ణవులు, వైదిక బ్రాహ్మణులు, ఆరాధులు, నియోగులకు చెందినవారు బ్రహ్మణ ఆరోగ్య కార్డుల పథకాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతి సభ్యుడు రూ.1000 చొప్పున చెల్లిస్తే, రూ.2 లక్షల విలువైన కార్డులను జారీ చేస్తామన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల మంది బ్రాహ్మణులున్నారని వారి సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులంతా వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 39వ డివిజన్‌కు చెందిన విజయ్‌కుమార్‌కు వ్యాపారం నిమిత్తం రూ.10 లక్షలు, విదేశీ విద్య కోసం కేతిరాజు హరితకు రూ.20 లక్షలు, పూసాల వెంకటరమణకు రూ.5 లక్షల రుణం మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిషత్ నేతలు వల్లూరి పవన్‌కుమార్, జీవీఎస్ శ్రీనివాసాచారి, జయప్రసాద్, బాబాజీ, వద్దిరాజు ప్రభాకర్‌రావు, రాజ్‌కుమార్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఉపేంద్రశర్మ

నర్సంపేట

తెరపై ఈనాడు

నర్సంపేట, న్యూస్‌టుడే: రామ్‌రాజ్ **2 కంట్రీస్**
జయశ్రీ **MCA (మిడిల్ క్లాస్ అబ్బాయి)**
అరవింద **హలో**

సంక్షిప్త సమాచారం

నర్సంపేట, న్యూస్‌టుడే ● విదేశీ విష సంస్కృతి మత్తులో పడి యువత, విద్యార్థులు పెడదారి పట్టొద్దని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోల్తి రవి తెలిపారు. నర్సంపేటలో శనివారం జరిగిన ఆసంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ విదేశీ సంస్కృతిలో భాగమైన డిసెంబరు 31, జనవరి1వ తేదీల్లో వేడుకలను యువత, విద్యార్థులు బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

● జనవరి 6, 7వ తేదీల్లో వరంగల్ అర్బన్ జిల్లాలోని కాకతీయ విశ్వ విద్యాలయంలో జరిగే తమ సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి పార్థసారథి ఒక ప్రకటనలో తెలిపారు. నర్సంపేటలో శనివారం జరిగిన ఆసంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు.

● దంత సమస్యలను ఏమాత్రం అలక్ష్యం చేస్తే అనేక వ్యాధులొచ్చే ప్రమాదం ఉందని, ఏమైనా సమస్యలు రాగానే వెంటనే దంత వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలని లయన్స్ క్లబ్ నర్సంపేట అధ్యక్షుడు దంత వైద్యుడు భరత్‌రెడ్డి తెలిపారు. లయన్స్‌క్లబ్ నర్సంపేట శాఖ ఆధ్వర్యంలో ఒక ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

● రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థల వసూలు చేస్తున్న రుసుంపై ప్రభుత్వం నియమించిన ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ చేసిన ప్రతిపాదనలు తక్షణమే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీధర్ డిమాండ్ చేశారు. నర్సంపేటలోని ఆ సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం నాయకులు సతీశ్, ప్రవీణ్, రాజేందర్, శ్రీకాంత్, కేశవ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దత్తత గ్రామంలో

అరకొర వసతులు..!

☛ మౌలిక సదుపాయాలు కల్పించాలంటున్న పెద్దకొర్పోలు గ్రామస్థులు

జనాభా 3138 | పురుషులు 1581 | స్త్రీలు 1557 | ఆవాస తండాలు 2

పెద్దకొర్పోలు(నెక్కొండ), న్యూస్‌టుడే

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు... గ్రామ స్వరాజ్య స్థాపనకు నిరంతరం కృషి చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆచరణలో చూపడ లేదు. ఐతే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామజ్యోతి పథకం ప్రవేశపెట్టింది. అనుకున్న స్థాయిలో పథకం అమలు కావడం లేదన్న విమర్శలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నా, మౌలిక సదుపాయాల విషయంలో గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. గ్రామాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యం నెరవేరడం లేదు. గ్రామజ్యోతి పథకంలో భాగంగా నెక్కొండ మండలంలోని పెద్ద కొర్పోలు గ్రామాన్ని ఎమ్మెల్యే మాధవరెడ్డి దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. గ్రామంలో పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామంలో తాగునీటి వసతి, అంతర్గత రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు వంటి కనీస వసతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వట్టెవాగు నుంచి గ్రామంలోని చెరువులోకి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని పంపిణీ చేస్తామన్న వాగ్దానం నెరవేర లేదు. గ్రామంలో పలు అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా మౌలిక సదుపాయాల కల్పనలో గ్రామం పూర్తిగా వెనుకంజలో ఉందని గ్రామస్థులు చెబుతున్నారు.

గ్రామంలో చేసిన అభివృద్ధి పనులు

● రూ.5 లక్షల వ్యయంతో ముదిరాజ్ కమ్యునిటీ హాలు నిర్మాణం ● రూ.5 లక్షల వ్యయంతో యాదవ కమ్యునిటీ హాలు నిర్మాణం ● రూ.3లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు. ● రూ1.50లక్షల వ్యయంతో రేకుల తండాకు ఫార్మేషన్ రోడ్డు వేశారు.

సత్వరం చేయాల్సినవి

● గ్రామంలో సైడు కాలువల నిర్మాణం చేపట్టాలి. సీసీ రోడ్లు నిర్మించాలి. ● రేకుల తండాకు సీసీ రోడ్డు వేయాలి. ● చిన్నకొర్పోలుకు సరైన రోడ్డు నిర్మాణం చేపట్టాలి. ● శ్మశాన వాటికకు వెళ్లేందుకు రోడ్డు నిర్మించాలి.● చిన్నకొర్పోలు గ్రామానికి వెళ్లడానికి వంతెన నిర్మాణం చేపట్టాలి. ● వెంకట్ తండాకు రోడ్డు మార్గం కల్పించాలి ● ఉప ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ● ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలి. ● వీధి దీపాలను ఏర్పాటు చేయాలి.● తండాలకు బీటీ రోడ్లు వేయాలి.


పెద్దకొర్పోలులో నిర్మించిన కమ్యూనిటీ భవనం

వంతెన నిర్మాణం జరిగేదెన్నడో: బిర్రు ప్రభాకర్



రెండు దశాబ్దాల కాలంగా పెద్దకొర్పోలు, చిన్నకొర్పోలు గ్రామాల మధ్య వంతెన నిర్మాణం చేపట్టాలని రెండు గ్రామాల ప్రజలు కోరుకుంటున్నా అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. గ్రామంలో సైడు కాలువల నిర్మాణం లేక పారిశుద్ధ్య లోపం కనిపిస్తోంది. మురుగు నీళ్లు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలి. వీధి లైట్లు లేక రాత్రి సమయాల్లో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నర్సంపేటకు నేరుగా బస్సు సౌకర్యం కల్పించాలి. పాఠశాల, కళాశాలల సమయానికి బస్సులు అందుబాటులో లేవు. మహబూబాబాద్ నుంచి వచ్చే బస్సుల వేళల్లో మార్పులు చేయాలి.

అంతర్గత పరిశుభ్రతపై దృష్టిసారించాలి: పడాల రాజ్‌కుమార్



గ్రామం నుంచి రేకుల తండాకు సరైన రోడ్డు సదుపాయం లేదు. రేకుల తండాకు నీటి వసతి లేక తండా వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తండాలో సీసీ రోడ్లు లేవు. వెంకట్ తండాకు కూడా సరైన రోడ్డు మార్గం కల్పించాలి. గ్రామంలో ప్రాథమిక వైద్య ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. తండాల్లో ఆపద వస్తే 108 వాహనాలు రావడానికి ఇబ్బందిగా ఉంది. అనారోగ్యం పాలైన వారిని పెద్దకొర్పోలు గ్రామానికి తీసుకొచ్చి అక్కడి నుంచి వాహనాల్లో ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.


కాలువలు లేక రోడ్డుపై నిలిచిన మురుగు నీరు


వంతెన నిర్మాణం చేపట్టాల్సిన వాగు ఇదే..

మాజీ ప్రజాప్రతినిధుల సమస్యలు పరిష్కరించాలి


ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతి పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

నర్సంపేట, న్యూస్‌టుడే: ఐదేళ్లుగా గ్రామాల ప్రగతికి, ప్రజల అభ్యున్నతికి వివిధ రకాలుగా సేవలందించి నష్టపోయిన స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులకు నెలకు రూ.12 వేల పింఛన్ సదుపాయాన్ని కల్పించి ఆదుకోవాలని స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధుల ఫోరం నర్సంపేట డివిజన్ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆసంఘం డివిజన్ కన్వీనర్ నామాల సత్యనారాయణ, అన్ని మండలాల కన్వీనర్లు, మాజీ సర్పంచులు శనివారం ప్రదర్శనగా ఆర్డీవో కార్యాలయం చేరుకొని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఆరోగ్య కార్డులు, ఉచిత బస్సు, రైలు పాస్‌లతో పాటు ఎస్సీ, ఎస్టీ మాజీ ప్రజాప్రతినిధులకు మూడెకరాల భూమి, మృతి చెందిన కుటుంబానికి రూ.5లక్షల పరిహారం చెల్లించాలన్నారు.

'గిరిజనుల ఐక్యతను ఓర్వలేక విమర్శలు'

పాపయ్యపేట(చెన్నారావుపేట), న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల ఐక్యతను చూసి ఓర్వలేక వివిధ పార్టీలకు చెందిన నాయకులు తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి కుట్రలు చేస్తున్నారని మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా ఎల్లాయిగూడెం, పాపయ్యపేట గ్రామాల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మొదట ఎల్లాయిగూడెం గ్రామంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి ఉదయం నుంచే అన్ని తండాలు, గ్రామంలోని అన్ని వీధులలో ఇంటికి తిరిగి ప్రజలతో మమేకయ్యారు .. వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరితో కలిసి గ్రామంలో యాదవనగర్ నుంచి మొదలుకొని ప్రభుత్వ పాఠశాల దాకా ర్యాలీ నిర్వహించారు. పాపయ్యపేట గ్రామంలో లక్ష్మీపురం గ్రామ బొడ్రాయి నుంచి మొదలుకొని పాపయ్యపేట గ్రామ కూడలి దాకా కొనసాగింది. తెలంగాణలో 21 తెగలకు చెందిన గిరిజనులు ఐక్యంగా ఉన్నారని ఎంపీ సీతారాంనాయక్ తెలిపారు.

పాపయ్యపేట అభివృద్ధికి రూ.40 లక్షలు

పాపయ్యపేట గ్రామ అభివృద్ధి కోసం రూ.40 లక్షలు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి మంజూరు చేయించనున్నట్లు పౌరసరఫరాల సంస్థ రాష్ట్ర ఛైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, మహిళ సంఘం భవనం నిర్మించుకునేందుకు ఉపయోగించుకోవాలన్నారు. మిషన్‌కాకతీయ పథకంలో పాపయ్యపేట గ్రామంలోని ఊరచెరువుతో పాటు ఎల్లాయిగూడెంలోని నాలుగు చెరువులకు రూ. 1.20 కోట్ల నిధులు ఖర్చుచేశామన్నారు. పాపయ్యపేటలో 300 మందికి, ఎల్లాయిగూడెంలో 440 మందికి పింఛన్లు అందిస్తున్నామని, రెండు గ్రామాల్లో 14 నీళ్ల ట్యాంకుల నిర్మాణంతో పాటు దాదాపు 10 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణం చేపట్టడానికి మిషన్ భగీరథ పథకంలో నిధులు మంజూరు చేశారని వివరించారు. పాపయ్యపేట గ్రామంలో 110, ఎల్లాయిగూడెంలో 110 మంది యాదవులకు గొర్రెలు పంపిణీ చేయడానికి రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. గ్రామానికి 5 వంతున ఎస్సీలకు, 6 వంతున ఎస్టీలకు కుటీర పరిశ్రమలకు నిధులు మంజూరు చేస్తామని వివరించారు. కాంగ్రెస్, తెదేపాకు రాజీనామా చేసి తెరాసలో చేరిన వారికి కండువాకప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఇంద్రసేనారెడ్డి, మాదాసి కుమారస్వామి, నాయకులు మోటూరి రవి, గాదె భద్రయ్య, శ్రీనివాస్, వివిధ గ్రామాల నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ సీతారాంనాయక్

మానవ హక్కుల దిక్సూచి కన్నాభిరాన్

నర్సంపేట, న్యూస్‌టుడే: మానవ హక్కుల పరిరక్షణ కోసం అను నిత్యం పరితపించిన ఉద్యమనేత, హక్కుల దిక్సూచి కన్నాభిరాన్ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ప్రణయ్‌దీప్ అన్నారు. కన్నాభిరాన్ వర్ధంతిని నర్సంపేటలోని రామకృష్ణ జూనియర్ కళాశాలలో శనివారం జరిపారు. ఈ సందర్భంగా కన్నాభిరాన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నక్సలైట్ ఉద్యమం ప్రారంభం నుంచి నాలుగు ప్రధాన కుట్ర కేసులతో పాటు 1974 నుంచి 1996 దాకా పదిహేనేళ్లు కేసులన్నింటిని పటాపంచలు చేసిన ఉద్యమనేత అన్నారు. మానవ హక్కుల కోసం ఆయన చేసిన సేవలను, అందించిన తోడ్పాటు మరువలేనిదన్నారు. ఆయన స్ఫూర్తితో హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు శ్రీధర్, పార్థసారథి, సందీప్, నరేశ్, అజయ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.


కన్నాభిరాన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తు న్న ప్రజాసంఘాల నాయకులు

నర్సంపేట

బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ

బుధరావుపేట(ఖానాపురం), న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబాలకు చెందిన పలువురు మృతి చెందగా వారి కుటుంబాలకు తెరాస నాయకులు శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, సర్పంచులు సుభాన్‌బీ, బాబూరావులు ఒక్కో కుకుటుంబానికి వంద కిలోల బియ్యాన్ని శనివారం అందజేశారు. బుధరావుపేటకు చెందిన హేమ్ల కుటుంబానికి, రంగాపురంలో బుచ్చయ్య కుటుంబసభ్యులకు బియ్యం ఇచ్చారు.

వజ్రాయుధం కన్నా పదునైనది ఓటు..!

నేటితో ముగియనున్న గడువు

అర్హులు నమోదు చేసుకోవాలంటున్న అధికారులు

బుధరావుపేట(ఖానాపురం), న్యూస్‌టుడే: భారత పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన వజ్రాయుధం కన్నా పదునైన ఆయుధం ఓటు అని, ఓటరుగా నమోదు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు మర్కల రజని అన్నారు. 'ఈనాడు-ఈటీవీ తెలంగాణ' ఆధ్వర్యంలో ఓటరు నమోదపై స్థానిక రుద్రమదేవి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 19 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అంతేకాకుండా యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని ఓటరుగా నమోదు చేసుకోవడం జీవితంతో ఒక ముఖ్య ఘట్టమని దాన్ని సద్వియోగం చేసుకోవడం బాధ్యత గా పేర్కొన్నారు. నవ భారత నిర్మాణం యువత చేతుల్లోనే ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఆధార్, ఇంటి నెంబరు, వయసు ధృవపత్రాలు తీసుకొని ఫాం-6 నింపి ఆర్డీవోకు అందజేయాలన్నారు. లేకుంటే అర్హులైన వారంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ వివరాలు బూత్‌లెవల్ అధికారి, సహాయ ఎన్నికల అధికారైన తహసీల్దారుకు చేరతాయి. వివరాలు పరిశీలించిన ఓటరుగా నమోదు చేస్తారన్నారు. సదస్సులో 18 ఏళ్లు నిండిన 24 మంది విద్యార్థినుతు దరఖాస్తు పత్రాలు నింపి తహసీల్దారు రజని అన్నారు. అర్థశాస్త్రం అధ్యాపకుడు నగేష్ ఓటు విలువ, ఎందుకు ఓటేయాలి, ఓటుతో కలిగే ప్రయోజనాలను, విధానాలను, ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న ఓట్ల పద్ధతి, సరళిపై వివరించారు. సమావేశంలో మరో ప్రిన్సిపల్ శ్రీధర్‌కుమార్ పలు ఉదాహరణలతో ఓటు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఓటరుగా నమోదు చేసుకున్న విద్యార్థినుల అభిప్రాయాలున ఇలా ఉన్నాయి.



సదస్సుకు హాజరైన విద్యార్థినులు



విద్యార్థినికి ఓటరు నమోదు పత్రాలు అందచేస్తున్న తహసీల్దారు

జీవితాంతం గుర్తుంటుంది.: టి.సంధ్య



18 ఏళ్ల వయసు నిండిన పలువురికి ఓటు ప్రాధాన్యం తెలియలేదు. ఈరోజు నిర్వహించిన సదస్సులో నమోదు చేసుకోవడం జీవితాంతం గుర్తుంటుంది. మా గ్రామంలో పలువురికి అవగాహన కల్పిస్తాను. ఒక్క ఓటుతో ఇంత ప్రయోజనం ఉందా అనే విషయం తహసీల్దారు, అధ్యాపకులు తెలిపారు. జీవితాంతం ఈ విషయం గుర్తుంటుంది. మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి ఓటు వేస్తా.

ఓటు విలువ తెలిసింది : డి.రవళి



ప్రజ్వాస్వ్యంలో ఓటుకు ఉన్న విలువ ఏంటో తెలిసింది. ఇన్నాళ్లు నమోదు చేసుకోవాలనే అంశం ఎవరూ చెప్పలేదు. ఓటు హక్కు ద్వారా వచ్చే ఎన్నికల్లో మంచి వ్యక్తిని ఎన్నుకుంటాం. తల్లిదండ్రులకు నచ్చచెబుతా. ఒక్క ఓటు అభివృద్ధికి దోహదం చేస్తుందన్న విషయం అధికారులు వివరంగా చెప్పారు. నేటితో గడువు ముగియనుండటంతో తెలిసినవారితో ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తాను.

ఓటుతోనే అభివృద్ధి సాధ్యం: బి.మౌనిక



ఓటుతో మంచి పాలకులను ఎన్నుకుంటే గ్రామాల అభివృద్ధి సాధ్యం. సదస్సులో నేర్చుకున్న అంశాన్ని ఇతరులకు చెబుతాను. ఇంత వరకు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎవరూ చెప్పలేదు. ఈ రోజు జరిగిన సదస్సులో తెలుసుకొని నమోదు చేసుకున్నా. ప్రలోభాలకు దూరంగా ఉండి ఓటు వేస్తాను.

అర్హులు నమోదు చేసుకోవాలి: బి.అనిత



సమాజంలో పేరుకుపోయిన కొంత కుళ్లను ఓటు అనే ఆయుధంతో నిర్మూలించవచ్చు. మంచి నాయకులను పీఠం ఎక్కించాలంటే ప్రలోభాలకు తలొగ్గొద్దు. యువత తలచుకుంటే మార్పు సాధ్యమే. ఓటరుగా నమోదు చేసుకోవడం చిన్నప్పుడు బడిలో అడ్మిషన్ తీసుకున్నంత ఆనందంగా ఉంది. నాతో పాటు పలువురు ఓటరుగా నమోదు చేసుకున్నారు.

ఆ మాటలే స్ఫూర్తి: వి.అనూష, బీఏ



ఓటు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం లాంటిది. ఎక్కువ మంది నాయకులు హామీలిస్తున్నారే తప్ప గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదు. మంచి పాలకులను ఎన్నుకోవాలంటే ఓటు కీలకం. ఇక నుంచి జీవితాంతం తప్పకుండా ఓటు వేస్తా. ఓటరుగా నమోదు కావడం చాలా ఆనందంగా ఉంది. నావంతుగా గ్రామంలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరిని ఓటరుగా నమోదు చేయించుకునేలా వారికి సహకరిస్తాను.

ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించుకోవాలి

నల్లబెల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లోని ప్రతి ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకొని ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుద్దామని ఎంపీడీవో బాబు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జనవరి 25వ తేదీ లోగా ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించాలన్నారు. నల్లబెల్లి మండలంలోని అర్శనపల్లి, లెంకాలపల్లి, ముచ్చింపుల, కొండాపురం గ్రామంలో సిబ్బందితో కలిసి శనివారం పర్యటించి ఆయన గ్రామస్థులతో మాట్లాడారు.

నర్సంపేట, న్యూస్‌టుడే: ప్రతి ఇంట్లో తప్పనిసరిగా మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ఎంపీడీఓ రమాదేవి ప్రజలకు సూచించారు. నర్సంపేట మండలం చంద్రయ్యపల్లె గ్రామంలో ఎస్‌బీఎం పథకంలో భాగంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లను ఎంపీడీఓ రమాదేవి ఆ గ్రామ సర్పంచి సాంబక్కతో కలిసి శనివారం పరిశీలించారు.

దేశాయిపల్లి(దుగ్గొండి), న్యూస్‌టుడే: మహిళల ఆత్మగౌరవం ఇంటింటా మరుగుదొడ్డి నిర్మించుకొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఎంపీడీవో పల్లవి అన్నారు. మండలంలోని దేశాయిపల్లి, తొగర్రాయి గ్రామాలలో స్వచ్ఛ భారత్ మిషన్‌లో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించిన సందర్భంగా ఎంపీడీవో పల్లవి మాట్లాడారు. మరుగుదొడ్డి నిర్మాణం వల్ల పరిసరాలు పరిశుభ్రంగా మారుతాయన్నారు..

డీఆర్వోకు వినతి

బుధరావుపేట(ఖానాపురం), న్యూస్‌టుడే: గత కొన్నేళ్లుగా భూములు సాగు చేస్తూ జీవనం గడుపుతున్నామని బుధరావుపేటకు చెందిన రైతులు శనివారం ఆర్‌ఎస్‌ఎస్ మండల కన్వీనర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో డీఆర్వో హరిసింగ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నెంబర్ 3, దాని అనుబంధ సర్వే నెంబర్లలో 1008 ఎకరాల భూమిని 287 మంది రైతులు సాగు చేసుకుంటున్నారని భూప్రక్షాళన సర్వేలో తమకు పట్టాహక్కులు కల్పించాలని రైతులు శ్రీనివాస్‌రెడ్డి, అప్పయ్య, లింగయ్య తదితరులు ఆ వినతిపత్రంలో కోరినట్లు పేర్కొన్నారు.

కాలమానిని ఆవిష్కరణ

నెక్కొండ, న్యూస్‌టుడే: తెలంగాణలో విద్యాభివృద్ధి ద్వారానే ముఖ్యమంత్రి కేసీఆర్ స్వాప్నిక బంగారు తెలంగాణ సాధ్యమని ఎంపీపీ అజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండల వనరుల కేంద్రంలో పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టే విధంగా ఉత్తర్వులు ఇప్పించడానికి కృషి చేస్తానన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడారు.

నిరక్షరాస్యత రూపుమాపాలి

నల్లబెల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో గల సాక్షర భారత్ కార్యాలయాన్ని జిల్లా ఉపసంచాలకులు దేవ్‌సింగ్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ వయోజనులందరిని అక్షరాస్యులుగా చేయాలని, గ్రామాల్లో అక్షరాస్యతను వంద శాతం చేయడంలో వీసీవోలు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సాక్షరభారత్ పీవో కరణ్‌సింగ్, పర్యవేక్షకులు నర్సయ్య, ఇన్‌ఛార్జి ఎంసీవో సాంబయ్య, వీసీవోలు చక్రపాణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

తొగర్రాయి(దుగ్గొండి), న్యూస్‌టుడే: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ప్రాజెక్టు సరోవర్ సంస్థ అధ్యక్షుడు సాయికిరణ్ అన్నారు. మండలంలోని తొగర్రాయి ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేసిన సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరాచారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సాయి కిరణ్ మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్ , పరీక్షా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచి మహేందర్ సంస్థ సభ్యులు శ్రావణ్, మధు, రాజు, బాలవికాస సంస్థ ప్రతినిధి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు



నర్సంపేటలో విద్యార్థుల ప్రదర్శన

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేటలోని కేజీజేసీ విద్యార్థులు శనివారం సాయంత్రం 2017 ఏడాది వీడ్కోలు వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ 2017 ఏడాది ఎన్నో మధుర స్మృతులను మిగిల్చిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏవో వీరారెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు పలువురు పాల్గొన్నారు.

బొల్లికొండ(నెక్కొండ), న్యూస్‌టుడే: మండలంలోని బొల్లికొండ గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీపాల్‌రెడ్డి కేకు కోశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు రాజేశ్వర్‌రావు విద్యార్థులందరికీ నూతన సంవత్సర కానుకగా పెన్నులు బహూకరించారు.

- మండల కేంద్రంలోని ప్రైవేటు కళాశాలల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వివిధ తరగతి గదుల్లో విద్యార్థులు కేకులు కోసి సంబురాలు జరుపుకొన్నారు. సమావేశంలో కళాశాలల చైర్మన్ వెంకన్న మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో పక్కా ప్రణాళికతో చదివి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

నెక్కొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలకు జీవం పోయడమే టీయూటీఎఫ్ లక్ష్యమని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వికాస్ డిగ్రీ కళాశాలలో జరిగిన రూరల్ జిల్లా ప్రతినిధుల సమవేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణ సాధనలో భాగంగా సకల జనుల సమ్మెలో పాల్గొని తెలంగాణ సాధించేందుకు కృషి చేశామని గుర్తు చేశారు. డిజిటల్ క్లాసులు, విద్యార్థులకు సన్నబియ్యం, గురుకులాల ఏర్పాటు వంటి నూతన కార్యక్రమాలతో విద్యావ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. పదోన్నతులు లేకపోవడంతో పర్యవేక్షణ అధికారుల ఖాళీలు ఉండటంతో విద్యావ్యవస్థలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించిందన్నారు. సీపీఎస్ రద్దు కోసం జనవరి 7న గజ్వేల్‌లో జరిగే ఆయుత ధర్మ దీక్షలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని అన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర బాధ్యులు లచ్చిరాం, నూతనకంటి బాబు, రూరల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రవణ్‌కుమార్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వామిరెడ్డి

పాలకుర్తి

తెరపై ఈనాడు

తొర్రూరు టౌన్, న్యూస్‌టుడే: రామకృష్ణ కళామందిర్: **MCA మిడిల్ క్లాస్ అబ్బాయి**
అశ్విని కళామందిర్: **ఒక్క క్షణం,** వెంకటేశ్వర కళామందిర్: **2 కంట్రీస్**
పాలకుర్తి: తిరుమల పిక్చర్ ప్యాలెస్: **MCA మిడిల్ క్లాస్ అబ్బాయి**

గ్యాస్ సమాచారం

తొర్రూరు టౌన్, న్యూస్‌టుడే: తొర్రూరులోని తిరుమల భారత్‌గ్యాస్ ఏజెన్సీలో డిసెంబర్ 27వ తేదివరకు బుక్‌చేసుకున్న వారికి ఏజెన్సి పరిధిలోని తొర్రూరు, నెల్లికుదురు, మరిపెడ, కేసముద్రం, పాలకుర్తి మండలాల వినియోగదారులకు ఆదివారం సిలిండర్‌లను సరఫరా చేస్తామని గ్యాస్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

కంది పంటకు ఎండు తెగులు

రైతుకు కంటినిండా దిగులు

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి మండలంలోని గ్రామాల్లో కంది పంటకు చీడపీడలు సోకడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం రాయితీపై అందజేసిన విత్తనాలు, ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేసిన విత్తనాలను వేస్తే పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోతోందని అన్నదాతలు వాపోతున్నారు.



పాలకుర్తి శివారులో కాయలు లేని కంది చేను

ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలో ప్రభుత్వం రాయితీపై కంది విత్తనాలను పంపిణీ చేసింది. తెలంగాణ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రైతులకు నాలుగు కిలోల విత్తనాల సంచిని రూ.305 ధరకు అందజేసింది. ధర తక్కువగా ఉండడంతో చాలా మంది రైతులు కొనుగోలు చేశారు. పాలకుర్తి సబ్‌డివిజన్ పరిధిలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల, గుండాల మండలాల్లో సుమారు 1600 హెక్టార్లలో కంది పంట సాగు చేశారు. పంట ఎదుగుదల, కాపు, పూత బాగా ఉండడంతో రైతులు సంతోషించారు. దిగుబడిపై ఆశలు పెంచుకున్నారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో ఎండుముఖం పట్టింది. పాలకుర్తి మండలంలో 600 హెక్టార్లలో కంది పంట వేయగా చాలా చోట్ల నాసిరకం విత్తనాలు, ఎండు తెగుళ్లతో దిగుబడి గణనీయంగా తగ్గనుందని రైతులు, అధికారులు భావిస్తున్నారు.



తొర్రూరు శివారులో ఎండిపోయిన కందిపంట

నాలుగెకరాల్లో సాగు చేశా

సమ్మయ్య, రైతు, పాలకుర్తి.



ఈసారి రాయితీపై పొందిన విత్తనాలతో నాలుగెకరాల్లో కంది పంట సాగు చేశాను. పంట కాపు, పూత చూసి సంబరపడ్డాను. దిగుబడి చేతికొచ్చే సమయంలో పంట చాలా వరకు ఎండిపోయింది. ఇప్పుడేం చేయాలో తెలియడం లేదు. రాయితీ విత్తనాలతో ఖర్చు తగ్గుతుందనుకుంటే నష్టం వచ్చే ప్రమాదం ఉంది.

ఇతర రైతుల పంటలు బాగున్నాయి

మల్లయ్య, రైతు, పాలకుర్తి.



ఇతర రైతులు సాగు చేసిన పంటలు బాగున్నాయి. వారు రాయితీ విత్తనాలు కాకుండా వేరే విత్తనాలు కొనుగోలు చేసి విత్తుకున్నారు. ఖర్చు తగ్గుతుందని భావించి రాయితీ విత్తనాలు కొని నష్టపోయాను. నా తమ్ముడి పంట కూడా చాలా వరకు ఎండిపోయింది. ఏటా ఇలా ఎదో ఒక రూపంలో నష్టం వస్తోంది.

ఎండు తెగులు వల్లే..

రమాదేవి, మండల వ్యవసాయాధికారిణి, పాలకుర్తి.

పాలకుర్తి మండలంలో కందిపంటలు ఎండిపోవడం విత్తనాల లోపం వల్ల కాదు. ఎండు తెగులు సోకడంతో పంటలు ఎండిపోతున్నాయి. తెగులు సోకిన వెంటనే నివారణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొంది. పంట దిగుబడి వచ్చే సమయంలో ఇలా ఎండిపోతే ఎవరికైనా ఇబ్బందిగానే ఉంటుంది. విత్తన లోపం వల్ల అయితే అసలు విత్తనం మొలకెత్తదు, పూత, కాత కూడా రాదు. ఎండు తెగులు వల్లే ఇలా జరిగిందని భావిస్తున్నాం.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

తొర్రూరు టౌన్, న్యూస్‌టుడే: తొర్రూరులో శనివారం ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి కేక్ కోశారు. సంఘం రాష్ట్రకమిటీ సభ్యుడు రజాక్ మాట్లాడారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై సంఘం ఆధ్వర్యంలో నిరంతర పోరాటం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శివప్రసాద్, సాయి, గణేష్, ఉపేందర్, మహేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సీతారాంపురం(దేవరుప్పులరూరల్), న్యూస్‌టుడే: సీతారాంపురంలో శనివారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారరం.. భువనగిరికి చెందిన పలువురు వ్యక్తులు సీతారాంపురంలో 20 క్వింటాళ్ల బియ్యాన్ని కొనుగోలు చేసి వాహనంలో తరలిస్తుండగా గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకోవడంతో నిందితులు బియ్యం వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయారు. పోలీసులు వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులకు అందజేస్తామని ఎస్సై గడ్డం నరేందర్‌రెడ్డి తెలిపారు.

సమావేశాలను విజయవంతం చేయాలి



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తొర్రూరు టౌన్, న్యూస్‌టుడే: జనవరి 6, 7వ తేదీల్లో కాకతీయ విశ్వవిద్యాలయంలో జరగనున్న ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు బందు మహేందర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం సమావేశాలకు సంబంధించిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నేడు విశ్వవిద్యాలయాలు పలు పార్టీలకు వేదికలుగా మరిపోయాయన్నారు. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల బిల్లును రాష్ట్ర ప్రభుత్వం వెనక్కితీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు విక్రంరెడ్డి, ఓంకార్, శ్రీకాంత్, హరీష్, సందీప్, రాజవర్ధన్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతకు దోహదం

జనగామ రూరల్, న్యూస్‌టుడే: విద్యార్థులు పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేందుకు కేసీఆర్ కిట్ల పంపిణీ దోహదపడుతుందని వరంగల్ రీజనల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ బి.ఆంజనేయులు, పి.సత్యం అన్నారు. జనగామ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. కిట్టులో 11 రకాల వస్తువులైన టూత్‌పేస్టు, బ్రష్, కొబ్బరినూనె, సబ్బులు, షాంపులు, దువ్వెన, రిబ్బన్, పౌడర్, బొట్టుబిల్లలు ఉంటాయని తెలిపారు.

ఆర్థిక సాయం

నక్కవానిగూడెం(బచ్చన్నపేట), న్యూస్‌టుడే: నక్కవానిగూడేనికి చెందిన బొట్టు నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి సామాజిక సేవ కార్యకర్త ముక్కెర తిరుపతిరెడ్డి ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేల అందజేశారు. సర్పంచి కంద్రాజు కొండయ్య, సర్పంచి ఫోరం అధ్యక్షుడు బేజాడి సిద్దులు, దొంతుల ఉమామహేశ్, బొట్టు సుధాకర్ పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి

పోలెపల్లి(తొర్రూరు), న్యూస్‌టుడే: మండలంలోని పోలెపల్లి నుంచి చంద్రుతండా, తాన్యాతండాలకు వెళ్లే రహదారిపై అడుగడుగునా గుంతలు పడడంతో అధ్వానంగా మారింది. దీంతో పోలెపల్లి, చంద్రుతండాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. వర్షం కురిసినప్పుడు రహదారి బురదమయంగా మారుతోంది. పోలెపల్లి నుంచి తాన్యాతండా, చంద్రుతండా వరకు తారు రోడ్డు నిర్మించాలని తండావాసులు కోరుతున్నారు. పోలెపల్లి నుంచి గిరిజన తండాలకు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని తొర్రూరు పీఆర్ ఏఈ యుగేంధర్ పేర్కొన్నారు.



పోలెపల్లి- చంద్రుతండా రోడ్డు

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

తొర్రూరు టౌన్, న్యూస్‌టుడే: జనవరి 2 నుంచి 9 వరకు దిల్లీలో జరగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ టెన్నిస్, టగ్ఆఫ్‌వార్ పోటీలకు ఎంపికైనన క్రీడాకారులకు దాతల సహకారంతో శనివారం క్రీడాదుస్తులను అందజేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాజారత్నం, సీఐ చేరాలు హాజరయ్యారు. 110 మంది క్రీడాకారులకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటయ్య, కురవి దేవస్థానం ఛైర్మన్ రాజునాయక్, మాజీ ఛైర్మన్ దామోదర్ రెడ్డి, శాట్ అధ్యక్షుడు తీగల కృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న డీఎస్పీ రాజారత్నం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

రాయపర్తి, న్యూస్‌టుడే: వరంగల్‌లోని ఓ ఆటో షోరూమ్‌లో పని చేస్తున్న రాయపర్తికి చెందిన ఖాలీదు ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. ఈ క్రమంలో శనివారం షోరూమ్ సిబ్బంది మృతుడి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఆటో షోరూమ్ మేనేజర్ దొమ్మాటి సుభాష్ మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆర్థిక సాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ మామిడాల కిశోర్‌కుమార్, వర్క్స్ మేనేజర్ ఎండీ మున్వర్ పాల్గొన్నారు.

'తెరాసవి ప్రజా వ్యతిరేక విధానాలు'

నర్మెట్ట, న్యూస్‌టుడే: తెరాస ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఎస్సీ సెల్ తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం తెదేపా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బొట్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెరాస ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందడం లేదన్నారు. వచ్చే నెలలో ఇంటింటికి తెదేపా కార్యక్రమం చేపట్టి పార్టీని బలోపేతం కృషి చేస్తామన్నారు. జనవరి 3న మండల స్థాయి కమిటీలను ఎన్నుకుంటామని తెలిపారు. బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొలిగె మల్లయ్య, జనగామ అధ్యక్షుడు వజ్జ పరశురాములు, నాయకులు గోపగోని అశోక్, పిన్నింటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి

కాంగ్రెస్‌లో చేరిక

కోతులబాద(పాలకుర్తి), న్యూస్‌టుడే: కోతులబాదకు చెందిన సుమారు 20 మంది యువకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి జంగా రాఘవరెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భార్గవ్, మాజీ ఎంపీపీ గడ్డం యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయంలో అక్రమాలకు అడ్డుకట్ట

రేపటి నుంచి నూతన విధానం అమలు

తొర్రూరు టౌన్, న్యూస్‌టుడే: ఎరువుల విక్రయాల్లో అక్రమాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం జనవరి 1 నుంచి నూతన విధానాన్ని అమలు చేయనుంది. పీఓఎస్ యంత్రాలకు ఆధార్‌తో అనుసంధానం చేయనున్నారు. ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలో ఈ విధానం అమలవుతోంది. ఇకపై రైతులు ఎరువులను కొనుగోలు చేయాలంటే ఆధార్ కార్డును తమ వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఈ మేరకు అధికారులు ఇప్పటికే ఎరువుల దుకాణాల డీలర్లకు పీవోఎస్ యంత్రాలను అందజేసి వాటిపై శిక్షణ కూడా ఇచ్చారు. ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే కాకుండా కంపెనీలు ఇష్టానుసారంగా రాయితీలు పొందకుండా నివారించేందుకు చర్యలు చేపట్టింది. తొర్రూరు మండలంలో 23 ఎరువుల విక్రయ దుకాణాలు ఉన్నాయి. ఇప్పటికే అధికారులు 18 దుకాణాలకు పీవోఎస్ యంత్రాలను అందజేశారు. మండలంలో 6500 మంది రైతులు ఉన్నారు. యాసంగిలో 25వేల ఎకరాల విస్తీర్ణంలో పంటలను సాగు చేయనున్నారు. మండలంలోని రైతులు.. 20 వేల టన్నుల యూరియా, 750 టన్నుల డీఏపీ, 750 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 500 టన్నుల పొటాష్, 250 టన్నుల సింగల్ పాస్పేట్ ఎరువులను వినియోగిస్తున్నారు.



అమలు ఇలా..

ప్రభుత్వం అమలు చేయనున్న నూతన విధానంతో జనవరి ఒకటో తేదీ నుంచి ఎరువులను కొనుగోలు చేసే రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకాన్ని తమ వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది. డీలర్ల వద్ద ఉన్న పీవోఎస్ యంత్రాల్లో రైతుల సర్వేనంబర్, ఆధార్ సంఖ్యలతో కూడిన వివరాలను నమోదు చేస్తారు. దీంతో ఆ రైతుకు ఎన్ని ఎకరాల భూమి ఉంది, ఎంత పరిమాణంలో ఎరువులు అవసరమో తెలుస్తుంది. వారి అవసరాల మేరకు ఎరువులను అందజేసి ఆ వివరాలను అంతర్జాలంలో నమోదు చేస్తారు. రాయితీ ధరలపై ఎరువులను అందజేస్తారు. అనంతరం ప్రభుత్వం రాయితీ మొత్తాన్ని నేరుగా ఎరువుల కంపెనీల డీలర్ల ఖాతాలో జమ చేస్తుంది. దీంతో రైతులు కొనుగోలు చేసే ప్రతి ఎరువుల బస్తాకు లెక్క ఉంటుంది. దీంతో అక్రమాలను నివారించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.



పీవోఎస్ యంత్రంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఛత్రునాయక్

డీలర్లకు శిక్షణ ఇచ్చాం

బానోతు వెంకన్న, మండల వ్యవసాయాధికారి.



పీవోఎస్ యంత్రాలపై ఇప్పటికే మూడు సార్లు డీలర్లకు శిక్షణ ఇచ్చాం. మొదట కలెక్టరేట్‌లో, తర్వాత ఏడీఏ కార్యాలయం, అనంతరం మండల స్థాయిలో మనగ్రోమోర్‌లో శిక్షణ ఇచ్చాం. పీఓఎస్ యంత్రాలతో ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. జనవరి 1 నుంచి కచ్చితంగా పీవోఎస్ యంత్రాల ద్వారానే ఎరువులను విక్రయించాలని డీలర్లకు ఆదేశాలు జారీచేశాం. నిబంధనలను అతిక్రమిస్తే దుకాణాల అనుమతులను రద్దు చేస్తాం.

భవన నిర్మాణ పనులు చేపట్టాలి

చెన్నూరు(పాలకుర్తి), న్యూస్‌టుడే: నూతన పంచాయతీ భవన నిర్మాణపనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. నిధులు మంజూరై 8 నెలలు గడిచినా ఇంతవరకు పనులు చేపట్టలేదన్నారు. దీనిపై సర్పంచి రవిని వివరణ కోరగా త్వరలోనే భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. స్థల సేకరణలో సమస్య వల్లే జాప్యం జరిగిందన్నారు.

చురుగ్గా మరుగుదొడ్ల నిర్మాణం

కొడకండ్ల,న్యూస్‌టుడే: నూరుశాతం మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు మండలంలో చురుగ్గా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ఎంపీడీవో కవికుమార్ పర్యవేక్షణలో ఉపాధిహామీ, ఐకేపీ, మండల పరిషత్ సిబ్బంది గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేశారు. వివిధ గ్రామాల్లో 460 మరుగుదొడ్ల నిర్మాణానికి కావాల్సిన సామగ్రిని తరలించారు. తేలికపాటి ఇటుకలతో పనులు చేపట్టినట్లు ఎంపీడీవో వివరించారు. అందరి సహకారంతో నూరుశాతం లక్ష్యాన్ని సాధిస్తామని ఏపీవో కుమారస్వామి తెలిపారు. ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సహకరించి నిర్మాణాలను పూర్తిచేయాలని అధికారులు కోరుతున్నారు.

కరపత్రం ఆవిష్కరణ

జనగామ రూరల్, న్యూస్‌టుడే: సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని జనవరి 6న మహిళా సాధికారతపై విద్యా సదస్సును స్థానిక కామాక్షి వేడుకల మందిరంలో నిర్వహిస్తున్నట్లు బీసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎలికట్టే యాదగిరి తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో జేసీ వనజాదేవి చేతుల మీదుగా 'సమాజంలో సగభాగం-సాధికారితలో ఎక్కడా' అనే కరపత్రాన్ని శనివారం విడుదల చేశారు. ఈ సదస్సులో జిల్లా వ్యాప్తంగా బీసీ మహిళా ఉపాధ్యాయినీలను సన్మానిస్తున్నట్లు తెలిపారు. ఆవిష్కరణలో ప్రధాన కార్యదర్శి మామిండ్ల అంజయ్య, జిల్లా కార్యదర్శులు కొండ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సుభాష్, బత్తిని శ్రీనివాస్, గోపగాని విజయ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

డీసీపీ మల్లారెడ్డి

జనగామ రూరల్, న్యూస్‌టుడే: మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తప్పవని జనగామ డీసీపీ మల్లారెడ్డి వెల్లడించారు. జనగామ ఏసీపీ కార్యాలయంలో శనివారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత సంవత్సరం ముగింపు, నూతన సంవత్సర ప్రారంభ వేడుకల సందర్భంగా నేడు రాత్రి 10 గంటల నుంచి ఉదయం వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో నాలుగు చోట్ల, ప్రతి మండల కేంద్రంలో ముమ్మర తనిఖీలుంటాయన్నారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావివ్వరాదని సూచించారు. ఏసీపీ బాపురెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు పరమేశ్, రాజేష్‌నాయక్, గోవర్ధన్, భరత్‌కుమార్ ఉన్నారు.

విద్యార్థులకు ఎల్టా మెటీరియల్ ఉపయోగకరం

జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య

జనగామ రూరల్, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు ఎల్టా(ఇంగ్లీషు లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో రూపొందించిన మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య అన్నారు. ఎల్టా ఆధ్వర్యంలో 'ఐపాస్ బుక్, ప్రాక్టీస్ పేపర్లను డీఈవో కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం యాదయ్య మాట్లాడుతూ విద్యార్థుల కోసం చక్కటి మెటీరియల్‌ను రూపొందించిన ఎల్టా బృందాన్ని అభినందించారు. ఎల్టా అధ్యక్షుడు వి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులతో అభ్యసన చేయించి మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి సామ్యూల్ ఆనంద్, కె.రాంచంద్రారెడ్డి, బి.రాంధన్, ఎల్టా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆడపిల్లలే ఇంటికి వెలుగు

రాయపర్తి, న్యూస్‌టుడే: ఆడపిల్లలే ఇంటికి వెలుగని, భ్రూణ హత్యలను ఖండించి ఆడపిల్లలను రక్షించాలని సామాజిక సేవా కార్యకర్త బంకా మాణిక్యరావు అన్నారు. రాయపర్తిలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలికలను బాలురతో సమానంగా చూడాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి, కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు యాకూబీ, వైట్ల త్రివేణి, వడగం మంజుల తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యరావు

విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ

తొర్రూరు టౌన్, న్యూస్‌టుడే: స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఆరోతరగతి విద్యార్థినులకు శనివారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ కర్నె సోమయ్య, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఎంఈవో బుచ్చయ్య పాల్గొని మాట్లాడారు. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులను కేటాయిస్తోందన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులు, గురువులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిణి బి.శైలజ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు దప్పట్లను అందజేస్తున్న దృశ్యం

లంబాడీల నిరసన ప్రదర్శన

మొరిపిరాల(రాయపర్తి),న్యూస్‌టుడే: లంబాడీలపై ఆదివాసీలు చేస్తున్న దాడులు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని గిరిజన శక్తి ఉస్మానియా విశ్వవిద్యాలయం అధ్యక్షుడు భూక్య రాజారాంనాయక్ అన్నారు. లంబాడీలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం మొరిపిరాల శివారు పన్యానాయక్‌తండాకు చెందిన లంబాడీలు ప్రదర్శన నిర్వహించారు. రాజారాంనాయక్ మాట్లాడుతూ దాడులపై ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. సోనుబాయ్, ఇతర నాయకులను అరెస్ట్ చేయడం విచారకరం అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే గిరిజన శక్తి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. తండావాసులు భూక్య క్రాంతి, బాలునాయక్, బాధావత్ వీరన్న, భూక్య యాకూ, మణు, వసంత, సమ్మి, కైకా తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన చేస్తున్న తండా వాసులు

'మందకృష్ణను విమర్శించటం తగదు'

కొడకండ్ల,న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్ మెప్పుకోసం ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణను విమర్శించడం తగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర పాలిట్‌బ్యూరో సభ్యుడు సోమారపు వెంకన్న, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడెల్లి సోమశేఖర్ అన్నారు. వారు శనివారం కొడకండ్లలో విలేకరులతో మాట్లాడుతూ కడియం శ్రీహరికి ఉపాధి లభించగానే తోటి మాదిగలకు అన్యాయం చేయటం సబబు కాదన్నారు. దళితుల పక్షాన ఉంటే వెంటనే ముఖ్యమంత్రిని ఒప్పించి అఖిలపక్షాన్ని దిల్లీకి పంపించి పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు వల్లూరి మధు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తిలో కోలాటంలో శిక్షణ పొందిన ఎస్సీ కాలనీ మహిళలకు శనివారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. సర్పంచి అంజమ్మ, బహుజనగళ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎడవెల్లి కృష్ణ, కళాబృందం అధ్యక్షురాలు రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

భూపాలపల్లి: ఊర్వశి- MCA మిడిల్ క్లాస్ అబ్బాయ్
ఆనంద్ - 2 కంట్రీస్
గణపురం: లక్ష్మీశ్రీనివాస - MCA మిడిల్ క్లాస్ అబ్బాయ్

కొప్పులలో కొలువుదీరిన సమస్యలు



పంచాయతీ కార్యాలయం

ఈనాడు పల్లె నిద్ర

గ్రామం **కొప్పుల**
మండలం **శాయంపేట**

పూర్తిస్థాయిలో నిర్మాణానికి నోచుకోని అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు

చలివాగు ప్రాజెక్టుపై వారధి కట్టేవారు కరవు

కొప్పుల శాయంపేట), న్యూస్‌టుడే: రాజకీయంగా సంచలనాలకు కేంద్ర బిందువైన శాయంపేట మండలం కొప్పులలో సమస్యలు కొలువుదీరాయి. చలివాగు ప్రాజెక్టును నమ్ముకుని రైతులు పంటలను పండిస్తున్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడే కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధాన కాలనీలో తప్ప మిగతా ప్రాంతాల్లో సైడ్ డ్రైనేజీలు కరవయ్యాయి. అలాగే గ్రామానికి చేరుకునే ప్రధాన సీసీ రోడ్డు కంకర తేలి రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల మూసివేతకు సిద్ధంగా ఉంది. ఉపాధ్యాయులు, పాలకుల పట్టింపులేనితనంతో ఉన్నత పాఠశాల విద్యార్థుల సంఖ్య పూర్తిగా పడిపోయే పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో నెలకొన్న సమస్యలపై 'ఈనాడు' పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపట్టగా గ్రామస్థులు సమస్యలను తెలియజేశారు.

జనాభా	6 వేలు
ఓటర్లు	3300
వ్యవసాయ భూములు	2600 ఎకరాలు
చేతి పంపులు	23
పనిచేయనివి	4
చెరువులు	1
కుంటలు	5
అంగన్‌వాడీ కేంద్రాలు	5
మంజూరైన మరుగుదొడ్లు	215, - పూర్తి అయినవి: 147
గ్రంథాలయం	లేదు
ఆధ్యాత్మికత	శివాలయం, హనుమాన్ దేవాలయం

అభివృద్ధి పనులకు నిధుల కొరత

కొప్పులలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణాలకు నిధుల కొరత మూలంగా పనులు చేపట్టడం లేదు. సుమారుగా రూ. 2 కోట్ల నిధులు కేటాయిస్తే పనులు జరిగే అవకాశాలున్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. అలాగే కొప్పుల నుంచి ముళ్లతాళ్ల మీదుగా పరకాలకు సుమారుగా 7 కి.మీల రోడ్డు నిర్మాణం చేపడితే రాకపోకలు పెరిగే అవకాశాలు ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. అలాగే గంగిరేణిగూడెం నుంచి అబ్బాపురం మీదుగా జాకారం వరకు రోడ్డు నిర్మాణం జరిగితే ఇటు ములుగు, నర్సంపేటకు రాకపోకలు సులభంగా మారతాయని పేర్కొంటున్నారు. గీత కార్మికులు, రైతుల కోసం కొప్పుల నుంచి గంగిరేణిగూడెం వరకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.

మూసివేతకు సిద్ధంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల

గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మూసివేతకు సిద్ధంగా తయారైంది. కేవలం పదో తరగతి మాత్రమే కొనసాగుతున్న క్రమంలో ఐదుగురు విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. ఉపాధ్యాయులు మాత్రం 9 మంది ఉన్నారు. ప్రైవేట్ పాఠశాలకు అధికసంఖ్యలో విద్యార్థులు వెళ్తున్న క్రమంలో ప్రభుత్వ పాఠశాల పరిస్థితి దయనీయంగా తయారైంది. పాలకులు పట్టించుకుంటే తప్పా వచ్చే విద్యా సంవత్సరం పాఠశాల కొనసాగే పరిస్థితి లేదు.

చలివాగు వారధిపై నిర్లక్ష్యం

కొప్పుల శివారులో చలివాగు ప్రాజెక్టుపై వారధి నిర్మాణంపై నిర్లక్ష్యం నిండుకుంది. ప్రతి ఏడాది మత్తడి నీళ్లు రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న క్రమంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి దృష్టికి స్థానిక ప్రజాప్రతినిధులు తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ప్రతిపాదనలు పంపించినప్పటికీ నిధుల మంజూరులో జాప్యం జరుగుతుందని స్థానిక నేతలు పేర్కొంటున్నారు. గతంలో చలివాగు మత్తడి ఉద్ధృతికి ఒకరు మృత్యువాత పడ్డారు. ఇప్పటికైనా స్పీకర్ చొరవ తీసుకుని వారధి నిర్మాణంపై దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



తారురోడ్డుగా మార్చాల్సిన రహదారి



మూసివేత దిశలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల



చలివాగు లోలెవల్ వంతెన

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

చిట్యాల, న్యూస్‌టుడే: 2018 జనవరి 6,7 తేదీల్లో రెండు రాష్ట్రాల ఎమ్మార్పీఎస్ రాజకీయ శిక్షణ తరగతులు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర కార్యదర్శి దొడ్డి కిష్టయ్య తెలిపారు. ఈ రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆయన కోరారు. శనివారం మండల కేంద్రంలో బొట్ల మొగిలి అధ్యక్షతన మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా దొడ్డి కిష్టయ్య హాజరయ్యారు. తరగతులకు మాదిగ నాయకులు, కార్యకర్తలు, అధికసంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల నాయకులు ఎల్కటి రాజయ్య, కొయ్యడ రమేష్, బండారి రాజు, మంత్రిరాజబాబు, రవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవాబుపేట (చిట్యాల) న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను శనివారం తెరాస జిల్లా నాయకులు గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. నవాబుపేటకు చెందిన చిదిరాల వీరలక్ష్మి, మండల కేంద్రానికి చెందిన గుండ నరసింహరాములు, ముచినిపర్తికి చెందిన గుండెపురెడ్డి రాజిరెడ్డిల కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. జిల్లా, మండల నాయకులు రాజయ్య, తిరుపతిరెడ్డి, సుధాకర్ ఉన్నారు.

చింతలపల్లి (మొగుళ్లపల్లి), న్యూస్‌టుడే: మండలంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను తెరాస రాష్ట్ర నాయకుడు గండ్ర సత్యనారాయణరావు శనివారం పరామర్శించారు. మండలంలోని చింతలపల్లికి చెందిన మంద రాములు, లడె లింగయ్య, మేదరమెట్ల శివారు అంకుశాపురానికి చెందిన సమ్మయ్య పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు పిన్నింటి వెంకట్రావ్ పాల్గొన్నారు.

టేకుమట్ల, న్యూస్‌టుడే: మండలంలోని వెంకట్రావ్‌పల్లికి చెందిన వీఆర్‌ఏ పెండ్యాల రాయమల్లు, బూర్నపల్లికి చెందిన రేణుకుంట్ల రాజయ్య, టేకుమట్లకు చెందిన గోపిశెట్టి కనకమ్మలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా శనివారం తెరాస జిల్లా నాయకులు గండ్ర సత్యనారాయణ రావు, తెరాస మండల నేత పులి తిరుపతిరెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు.

పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యం

శాయంపేట, న్యూస్‌టుడే: పేద ప్రజల అభ్యున్నతే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు గిద్దెమారి సురేష్ అన్నారు. శాయంపేట మండల కేంద్రంలో పండిత్ ధీన్ దయాళ్ గ్రామజ్యోతి కింద మంజూరైన విద్యుత్తు మీటర్లను ఎన్పీడీసీఎల్ సిబ్బందితో బిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంట్లో విద్యుత్తు సౌకర్యం ఉండాలన్న ఉద్దేశంతో కేవలం రూ. 125 లకు మీటర్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. మండలంలో 500 మంది దరఖాస్తు చేసుకోగా వారికి మీటర్లు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ పాస్ యంత్రాలతోనే విక్రయించాలి

శాయంపేట, న్యూస్‌టుడే: జనవరి 1వ తేదీ నుంచి ఎరువుల దుకాణాల యాజమానులు ఈ పాస్ యంత్రాలతోనే విక్రయాలు జరపాలని ఏవో మాధవి కోరారు. మండలంలోని డీలర్లందరికీ ఈ పాస్ యంత్రాలను అందజేయడంతో పాటు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రైతులు ఎరువుల కోసం వచ్చే క్రమంలో తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకుని రావాలని, లేని పక్షంలో ఎరువులను ఇవ్వడం జరగదని తెలిపారు. రైతులందరూ సహకరించాలని ఆమె పేర్కొన్నారు.

పోరాట యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

భూపాలపల్లి టౌన్, న్యూస్‌టుడే: ఉద్యోగాల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించే పోరాట యాత్ర పోస్టర్‌ను శనివారం భూపాలపల్లిలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి క్యాతరాజు సతీశ్ ఆవిష్కరించారు. జనవరి 1న మహబూబాబాద్, 2న వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్ జిల్లాలో జరిగే ఉద్యోగాల సాధన పోరాట యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, జిల్లా కార్యదర్శులు ప్రవీణ్‌తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

రేగొండ, న్యూస్‌టుడే: రేగొండలోని నారాయణపురం, రావులపల్లి గ్రామాల్లోని పేదలందరికీ రెండు పడక గదుల పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో గ్రామస్థులు శనివారం తహసీల్దార్ మల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. గ్రామీణ పేదల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరివెల్లి రాజయ్య ఆధ్వర్యంలో గ్రామస్థులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్యాలయంలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. సంఘం జిల్లా, మండల నేతలు భద్రయ్య, మల్లేశ్, రాజు మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి

శాయంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ జాగృతి యువత వరంగల్ రూరల్ జిల్లా క్యాలెండర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాగృతి నాయకులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు. జాగృతి యవత రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్, మండల కన్వీనర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి

గ్యాస్ సమాచారం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: సింగరేణి సూపర్ బజారులో ఈ నెల 28 తేదీ లోపు నమోదు చేసుకున్న వారికి ఆదివారం సిలిండర్లు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేవా గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 29వ తేదీలోపు నమోదు చేసుకున్న వారికి కూడా ఇవ్వనున్నట్లు నిర్వాహకుడు తెలిపారు.

ఈనాడు పరిష్కార వేదిక

కాలువలు శుభ్రం



చిట్యాల, న్యూస్‌టుడే: మండల కేంద్రం శివారు చింతలపల్లిలో ఇటీవల నిర్మించిన మురికి నీటి కాలువల్లో చెత్తా చెదారం పేరుకు పోయి మురికి నీరు బయటకు వెళ్లకుండా నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోందని ఆ పల్లెవాసులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. చింతలపల్లి వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను సర్పంచి పుల్లూరి రమాదేవి దృష్టికి తీసుకెళ్లి పరిస్థితిని వివరించగా వెంటనే స్పందించిన సర్పంచి శనివారం పంచాయితీ సిబ్బందితో పేరుకుపోయిన మురికిని తొలగించారు. దీంతో తమ సమస్య తీరిందని ఆ కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తీరిన మంచినీటి సమస్య

టేకుమట్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో మంచినీటికి సంబంధించిన పైపులైన్ పగిలింది. దీంతో నీరు వృథాగా పోతూ.. కలుషితమవుతున్నాయని స్థానికులు 'ఈనాడు' దృష్టికి తీసుకొచ్చారు. వారు పడుతున్న సమస్యలను 'న్యూస్‌టుడే' స్థానిక సర్పంచి పెరుమాండ్ల లింగయ్యకు వివరించింది. స్పందించిన సర్పంచి శనివారం పంచాయతీ సిబ్బందిని పిలిచి పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. దీంతో మంచినీటి సమస్య పరిష్కారం అయ్యింది.



చేతి పంపునకు మరమ్మతులు



టేకుమట్ల, న్యూస్‌టుడే: వెల్లంపల్లిలోని మాలవాడకు చెందిన చేతి పంపు పది రోజులుగా పనిచేయడం లేదు. దీంతో మంచి నీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'ఈనాడు' దృష్టికి తీసుకొచ్చారు. వారు పడుతున్న ఇబ్బందులను 'న్యూస్‌టుడే' స్థానిక సర్పంచి ఒరంగంటి సధాకర్‌కు వివరించింది. స్పందించిన ఆయన శనివారం బోరింగ్ మెకానిక్ సుధాకర్‌ను పిలిచి చేతి పంపునకు మరమ్మతులు చేయించారు. 'ఈనాడు' చొరవతో మంచినీటి సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ బియ్యం అప్పగింత

శాయంపేట, న్యూస్‌టుడే: మండలంలోని ప్రగతి సింగారం శివారులో ఇటీవల పెట్రోలింగ్‌లో భాగంగా పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు శనివారం పంచనామా నిర్వహించారు. స్థానిక రేషన్ డీలరు బాబురావుకు అప్పగించడం జరిగింది. జాయింట్ కలెక్టర్‌కు నివేదికను అప్పగిస్తామని వారు తెలిపారు. ఆర్ఐ హేమానాయక్, వీఆర్వో భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ కమిటీ కార్యదర్శిగా అశోక్



భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి పట్టణ తెరాస అర్బన్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కాశీంపల్లి గ్రామానికి చెందిన తాటి అశోక్‌ను నియమించినట్లు అర్బన్ కమిటీ అధ్యక్షుడు సాంబమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. తెరాస పార్టీలో గత నాలుగు ఏళ్లుగా పనిచేస్తూ, పార్టీ అభివృద్ధి ఎంతో కృషి చేసినందుకే అశోక్‌ను స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అనుమతితోనే ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సత్యనారాయణ



భూపాలపల్లి, న్యూస్‌టుడే: పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా భూపాలపల్లికి చెందిన భీమనాథుని సత్యనారాయణను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశాలీలు ఐక్యతకు ఉద్యోగుల సంక్షేమానికి కొద్ది ఏళ్లుగా సత్యనారాయణ కృషి చేస్తున్నందుకే ఆయనను రాష్ట్ర కమిటీలో తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పద్మశాలి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తామన్నారు.

వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

జడలపేట (చిట్యాల) న్యూస్‌టుడే: 31 డిసెంబరు వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై యాసీర్ అర్ఫత్ కోరారు. శనివారం మండలంలోని జడటపేటలో స్థానిక యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడపడం చేయకూడదన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

దివ్యాంగులకు ఉపాధి కల్పించడంలో విఫలం

శాయంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పూర్తిగా విఫలం చెందిందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి. మున్నా అన్నారు. శాయంపేట మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు వివాహ ప్రోత్సహకంగా రూ. 50 వేల నుంచి లక్ష రూపాయాలకు పెంచడం హర్షనీయమని తెలిపారు. దివ్యాంగులను సకలాంగులు వివాహం చేసుకుంటే వారిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడం జరిగిందని, రాష్ట్రంలో 10 వేల మంది పెళ్లిలు చేసుకోవడం జరిగిందని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు దామెర లెనిన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్నా

ఘనంగా సుదర్శన హోమం

శాయంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరిస్వామి దేవాలయంలో శనివారం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఆరుట్ల శ్రీకాంతాచార్యులు నవగ్రహ పూజలు, సుదర్శన, జయాది హోమాలు నిర్వహించడం జరిగింది. అయ్యప్పస్వామిని దర్శించుకోవడానికి శబరిమలై వెళ్లే స్వాములు హోమంలో పాల్గొన్నారు. ఆలయ ఛైర్మన్ సామల భిక్షపతి, స్వాములు పసునూటి భిక్షపతి, దిడ్డి రమేష్, సామల రవీందర్ పాల్గొన్నారు.

మూడు బస్సుల సీజ్



బస్సుల అనుమతులను పరిశీలిస్తున్న దృశ్యం

శాయంపేట, న్యూస్‌టుడే: మండలంలోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన మూడు బస్సులను సీజ్ చేసినట్లు ఎస్సై నరేష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... శాయంపేట మండలంలోని 7 ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన బస్సులను తనిఖీ చేసినట్లు తెలిపారు. అనుమతుల పత్రాలను అసిస్టెంట్ మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శాలినీ పరిశీలించి అనుమతులు సరిగ్గా లేని మూడు పాఠశాలల బస్సులను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం విద్యార్థులను బస్సులలో తీసుకెళ్లే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పూర్తిస్థాయిలో అనుమతులు ఉండాలని, లేని పక్షంలో కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు.

ముగిసిన జాతర బ్రహ్మోత్సవాలు

నైన్‌పాక (చిట్యాల), న్యూస్‌టుడే: మండలంలోని నైన్‌పాకలో మూడు రోజుల పాటు జరిగిన నాపాక సర్వతోభద్ర జాతర బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నక్క భాస్కర్ తెలిపారు. జాతర ముగింపు రోజున వాహనాలు, బండ్లు తిరుగుట, అనంతరం కోలాటం, భజన బృందాలతో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. ఈ నెల 28న స్పీకర్ సిరికొండ మధుసూధనాచారిచే ప్రారంభమైన జాతర ఈ రోజుతో ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలి

చిట్యాల, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో అగ్రకులాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం ప్రజలు ఉద్యమించాలని తెలంగాణ సామాజిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీమాస్) జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు బొట్ల చక్రపాణి, బందు సాయిలు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో టీమాస్ ఫోరం మండల సమావేశం సకినాల మల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా చక్రపాణి, బందుసాయిలు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణలో 93 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉన్నారన్నారు. సామాజిక న్యాయాన్ని విస్మరిస్తున్నారన్నారు. నాయకులు దొడ్డి కిష్టయ్య, బొట్ల మొగిలి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కట్కూరి నరేందర్, కోకన్వీనర్లుగా దొడ్డి కిష్టయ్య, సకినాల మల్లయ్య, సభ్యులుగా బొట్ల మొగిలి, మేడిపెల్లి శ్రీనివాస్, లటికె రాజు, ఓదెల వెంకటేశ్వర్లు, గోల్కొండ మొగిలి తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం

కోల్‌బెల్ట్, న్యూస్‌టుడే: భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 1వగనిలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సింగరేణి యాజమాన్యం శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం గని ఆవరణలో ఏర్పాటు చేశారు. పదవీ విరమణ పొందిన ట్రామర్ రాంరెడ్డి, షాట్‌ఫైరర్ అమృతరెడ్డి, కోల్‌కట్టర్ బుచ్చయ్య, హలర్ ఆపరేటర్ మల్లయ్యలను యాక్టింగ్ మేనేజర్ శ్రీనివాస్ శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే బెనిఫిట్స్ డబ్బులను భద్రంగా దాచుకోవాలన్నారు. సంక్షేమ అధికారి రాజేశం, ఏఐటీయూసీ పిట్ కారదర్శి బీమా, కార్మికులు పాల్గొన్నారు.

బయటపడ్డ పురాతన విగ్రహాలు



చిట్యాల, న్యూస్‌టుడే: మండలంలోని ముచినిపర్తి నుంచి కొత్తపేట వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో ముచినిపర్తి శివారు తాటివనం వద్ద పురాతన విగ్రహాలు బయటపడ్డాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. శనివారం గుత్తేదారు రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా వీరభద్రస్వామి, నాగదేవతల పురాతన విగ్రహాలు కనిపించాయని తెలిపారు. ఈ విగ్రహాలు రెండున్నర సంవత్సరాల క్రితమే తాటివనంలో మట్టిని తరలిస్తుండగా బయటపడడంతో వాటిపై మట్టి కప్పుకపోయినట్లు చెప్పారు. శనివారం అక్కడి నుంచి తరలించి చెరువు కట్ట వద్దకు చేర్చినట్లు సర్పంచి నందికొండ రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఇసుక లారీలను నియంత్రించాలి



ప్రధాన రహదారిపై తిరుగుతున్న ఇసుక లారీలు

గణపురం, న్యూస్‌టుడే: మేడారం జాతర నాటికి పరకాల-భూపాలపల్లి ప్రధాన రహదారిపై విపరీతంగా తిరుగుతున్న ఇసుక లారీలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. విపరీతమైన రద్దీలో కూడా ఇసుకలారీలు ఇప్పుడే రోడ్డు దాటని పరిస్థితిలో ఇసుక లోడుతో రవాణాతో ప్రమాదాలకు కారణం అవుతున్నాయని ఇలాంటి పరిస్థితిలో మేడారం నాటికి వేలాది ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలు ఈ దారిగుండానే మేడారానికి వెళ్తాయని దానివల్ల ప్రమాదాలు మరింతగా పెరుగుతాయని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇసుక లారీలకు ప్రత్యామ్నాయంగా వేరేదారిని చూడాలని దీనిపై పోలీసులు, ఆర్టీఏ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

శాయంపేట, న్యూస్‌టుడే: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో భర్త సెల్‌ఫోన్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం శాయంపేట మండలకేంద్రంలో జరిగింది. బాధితుడి కథనం ప్రకారం... శాయంపేట మండలం పత్తిపాకకి చెందిన అంబాల వేణు 10 సంవత్సరాల క్రితం శాయంపేటకు చెందిన అసిరాబేగంను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిద్దరి మధ్య గొడవలు రావడంతో భార్య అసిరాబేగం భర్తను విడిచి వెళ్లిపోయింది. తిరిగి తన ఇంటికి రావాలని కోరినప్పటికీ రాకపోవడంతో మనస్తాపానికి గురైన భర్త వేణు పెట్రోల్ బాటిల్‌తో శాయంపేటలోని సెల్‌ఫోన్ టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న ఎస్సై నరేష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని భార్య అసిరాబేగంను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తానని సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. స్నేహితులు జోక్యం చేసుకోవడంతో టవర్ నుంచి దిగడంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లడంతో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

గ్రామ కమిటీల ఎన్నిక

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మెట్టుపల్లి, అంకుశాపురం గ్రామాల్లో శనివారం గ్రామ కమిటీలను ఎన్నుకున్నట్లు కొండా యువసేన మండల అధ్యక్షుడు వేముల కిరణ్ తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గాజుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా తెప్ప మధుకర్, తుమ్మ చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా నర్మెట్ట రాజమౌళి, కార్యదర్శిగా మామునూరి కృష్ణయ్య, ప్రచార కార్యదర్శిగా రాసమల్ల లక్ష్మీబాయి, సంయుక్త కార్యదర్శులుగా పెండెం రాజేందర్, సమ్మయ్యలు ఎన్నికయ్యారు, అంకుశాపురం అధ్యక్షుడిగా కౌడగాని హేమంత్, ఉపాధ్యక్షుడిగా ఉట్ల అశోక్, ప్రధాన కార్యదర్శిగా రామగిరి వంశీ, కార్యదర్శిగా శ్రీకాంత్, ప్రచార కార్యదర్శిగా నాగరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గ్యాస్ సరఫరా

భీమారం, న్యూస్‌టుడే: భీమారం ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో శనివారం బుక్ చేసుకున్న వారికి జనవరి 5లోగా సిలిండర్లను పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 0870-2564090 ఫోన్ నెంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

వర్ధన్నపేట

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నందనం(ఐనవోలు), న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై అశోక్‌కుమార్ కథనం ప్రకారం.. నందనం ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తనిఖీల్లో భాగంగా పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అద్దె భవనాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు

❐ అసౌకర్యాలతో రోగులు, సిబ్బందికి తప్పని అవస్థలు

పర్వతగిరి, న్యూస్‌టుడే: ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రాలు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పర్వతగిరి మండలంలో ఆయా గ్రామాల్లో పది ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండగా, ఏనుగల్లు మాత్రమే సొంత భవనం ఉంది. మిగిలిన అన్ని గ్రామాల్లో అద్దెభవనాల్లో అసౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారు.

పర్వతగిరి, దౌలత్‌నగర్, అన్నారం షరీఫ్ గ్రామాల్లో మొదటి ఏఎన్ఎంలు లేరు. ఆరోగ్య కేంద్రాల్లో ఆదివారం మినహా ఆరు రోజుల పాటు పలు రకాల వైద్య సేవలు అందజేయాల్సి ఉంది. అద్దె భవనాలు కావడంతో సరైన సౌకర్యాలు లేకపోవడంతో వైద్య సిబ్బందితో పాటు రోగులకు అవస్థలు తప్పడం లేదు. సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాలతో అడుగడుగున ఇబ్బందులు పడుతున్నట్లు సిబ్బంది సైతం వాపోతున్నారు. అద్దె భవనాల అద్దెల చెల్లింపునకు బిల్లులు మంజూరుకాకపోవడంతో, తప్పనిసరి పరిస్థితుల్లో ఏఎన్ఎంలే సొంత డబ్బుతో అద్దె చెల్లిస్తున్నారు.

అందని రోజువారీ సేవలు..

ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా ప్రజలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. సోమవారం ఓపీ, మంగళవారం ఫీల్డ్ వర్క్, బుధవారం వ్యాధి నిరోధక టీకాల పంపిణీ, గురువారం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వైద్య పరీక్షలు, శుక్రవారం గర్భిణులకు పరీక్షలు, శనివారం ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని తండాల్లో టీకాల పంపిణీ చేపట్టాలి. అయితే సిబ్బంది సైతం వారంలో ఒకటి, రెండు రోజులే ఈ పనులు చేపడుతున్నారు.



కల్లెడలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఆరోగ్య ఉప కేంద్రం

అద్దె భవనాలతో ఇబ్బందులు: డాక్టర్.శ్రీదేవి, వైద్యాధికారిణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మండలంలోని పది ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండగా, ఏనుగల్లులో మాత్రమే సొంత భవనం ఉంది. అద్దె భవనాల్లో అంతంత మాత్రమే వసతులు ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బడ్జెట్ విడుదలకాగానే ఉప కేంద్రాల అద్దెలు చెల్లిస్తాం. రోజువారీ విధుల నిర్వహణపై పర్యవేక్షణ చేపడుతున్నాం.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

మడికొండ,న్యూస్‌టుడే: పార్లమెంట్ శీతాకాలపు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి, చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మాదిగ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం టేకులగూడెం రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోతో వివిధ గ్రామాలకు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఆటో యూనియన్ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు మాచర్ల విల్సన్, పోడిశెట్టి పున్నచందర్ మాట్లాడుతూ వర్గీకరణ బిల్లుపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మోసపూరిత వైఖరి అవలంబిస్తున్నాయని తెలిపారు. కాలయాపన చేయకుండా తక్షణమే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు. రాజు, కిషన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాభ్యాస్ కిట్ల పంపిణీ

మడికొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందజేయాలనే లక్ష్యంతో అక్షరాభ్యాస్ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థలకు చెందిన డాక్టర్ దివ్య, డాక్టర్ స్నేహలు తెలిపారు. మడికొండ పాఠశాల విద్యార్థులకు శనివారం అక్షరాభ్యాస్ కిట్లను పంపిణీ చేశారు. ఇందులో పునాది పుస్తకం(పెద్ద బాలశిక్ష), పెన్సిల్‌తో కాగితంపై రాయడం కోసం మూడు భాషలతో కూడిన ఆరు పలకలు ఉన్నట్లు తెలిపారు. మడికొండ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు భిక్షపతియాదవ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అక్షరాభ్యాస్ మేనేజరు లక్ష్మినర్సయ్య, కోఆర్డినేటర్లు శ్రీనివాస్, పంతులు, సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం మడికొండ, రాంపూర్‌లలో నాలుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 18 అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ అక్షరాభ్యాస్ కిట్లను అందజేసినట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలి



స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏడీ ప్రదీప్‌కుమార్

కొండపర్తి(ఐనవోలు), న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వరంగల్ అర్బన్ జిల్లా గనుల శాఖ ఏడీ ప్రదీప్‌కుమార్ అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో భాగంగా శనివారం కొండపర్తి శివారులోని క్వారీలో పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్వచ్ఛతకు పాటుపడుతామని కార్మికుల చేత ప్రతిజ్ఞ చేయించారు. క్వారీల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇందుకోసం మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని సూచించారు. గనుల శాఖ ఆర్ఐ సురేఖ, క్వారీ యజమానులు ఆర్.వెంకటేశ్వర్లు, సీహెచ్ శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే రమేశ్

వంగపహాడ్(భీమారం), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం 48 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అరూరి రమేశ్ అందజేశారు. మల్లారెడ్డిపల్లి, వంగపహాడ్, పెగడపల్లి, నాగారం, పెంబర్తి, హసన్‌పర్తి, సీతంపేట, జయగిరి, చింతగట్టు, భీమారం, దేవన్నపేట, కోమటిపల్లి, సుబ్బయ్యపల్లి, భీమారం తదితర గ్రామాల్లోని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేద కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. హసన్‌పర్తి ఎంపీపీ సుకన్య, జడ్పీటీసీ సభ్యులు సుభాశ్‌గౌడ్, కార్పొరేటర్లు బానోతు కల్పన, జక్కుల వెంకటేశ్వర్లు, నాగమళ్ల ఝాన్సీ, తెరాస నాయకులు పాల్గొన్నారు.


పెగడపల్లిలో కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్

క్యాలెండర్ ఆవిష్కరణ

వంగపహాడ్(భీమారం), న్యూస్‌టుడే: 58వ డివిజన్ పరిధిలోని హసన్‌పర్తి మండలం వంగపహాడ్ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఫొటోలతో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రమేశ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నూతనోత్తేజం నింపేలా పాఠశాల ఉపాధ్యాయులు క్యాలెండర్‌ను రూపొందించటం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే నూతన సంవత్సరం కేక్ కోసి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్పొరేటర్ బానోతు కల్పన, గ్రామ విద్యాభివృద్ధి కమిటీ ఛైర్మన్ దోమ కోర్నేలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయిని శోభారాణి, వంగపహాడ్ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రెడ్డి, తెరాస నాయకులు పాల్గొన్నారు.

పెంకుటిల్లు దగ్ధం

భీమారం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతం సంభవించి ఓ పెంకుటిల్లు కాలిపోయిన ఘటన హసన్‌పర్తి మండలం సీతానాగారంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం... సీతానాగారానికి చెందిన వలుస లింగయ్య హన్మకొండలోని పెగడపల్లి డబ్బాల దగ్గర బట్టల దుకాణం నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారు. హన్మకొండకు రోజు వెళ్లి రావటం ఇబ్బందిగా ఉండడంతో సీతానాగారంలోని తన ఇంటిని ఖాళీ చేసి గత వారం రోజుల క్రితం డబ్బాల వద్దకు మకాం మార్చారు. కాగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం సంభవించి పెంకుటిల్లు పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఘటనాస్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. న్యాయం చేస్తామని తెలిపారు.

పశుసంపదను కలిగి ఉండాలి

ఉప్పరపల్లి(వర్ధన్నపేట రూరల్), న్యూస్‌టుడే: రైతులు పశు సంపదను కలిగి ఉండాలని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుజ్జ సంపత్‌రెడ్డి సూచించారు. ఉప్పరపల్లిలో శనివారం మార్కెట్ కమిటీ సహకారంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గుజ్జ సంపత్‌రెడ్డి, సర్పంచి రజిత ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పశువైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు సేంద్రియ పద్ధతిని పాటించి, అధిక లాభాలు పొందాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు మహేందర్‌రావు, పశు వైద్యాధికారి సారంగపాణి, మార్కెట్ కార్యదర్శి చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

పర్వతగిరి, న్యూస్‌టుడే: దౌలత్‌నగర్, రావూర్ గ్రామాల శివారు తండాల్లో శనివారం వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ కరుణశ్రీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడుంబా తయారుచేసిన, అమ్మకాలు చేసిన కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం మండల కేంద్రంలోని మద్యందుకాణంలో తనిఖీలు చేపట్టారు. ఎస్సై జయశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల బస్సుల తనిఖీ

మడికొండ, న్యూస్‌టుడే: ఫిట్‌నెస్ లేని వాహనాలను నడిపితే చర్యలు తప్పవని మడికొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సంతోశ్ తెలిపారు. కాజీపేట మండలం మడికొండ శివారులో శనివారం ప్రైవేటు పాఠశాలల బస్సులను పోలీసులు తనిఖీలు చేశారు. ఒకే నంబరుతో వేర్వేరుగా వాహనాలు తిరుగుతున్నాయనే అనుమానాల మేరకు అకస్మిక తనిఖీలు చేపట్టారు. వాహన ధ్రువీకరణ పత్రాలతో పాటు డ్రైవర్ పరిస్థితిని గమనించి యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు.

మామునూరు, న్యూస్‌టుడే: ఆర్టీఏ అధికారులు విద్యాసంస్థల బస్సులను తనిఖీలు చేశారు. మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వేణు, ఏఎంవీఐ ఫియిమా సుల్తానా, మామునూరు ఎస్సైలు రవికుమార్, యుగేందర్ ఆధ్వర్యంలో వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిపై శనివారం తనిఖీలు చేశారు. విద్యాసంస్థలకు చెందిన 60 బస్సుల పత్రాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం తగిన వసతులు, వాహన నాణ్యత, డ్రైవర్, అటెండర్‌ల వివరాలను పరిశీలించారు.

సంప్రదాయ వేడుకలు

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని సుమతిరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సంప్రదాయ దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సాఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ వరదారెడ్డి హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలను కాపాడేందుకు నేటి యువతరం పాటుపడాలని సూచించారు. కళాశాల విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కళాశాల ప్రాంగణంలో అందమైన ముగ్గులు వేసి అలంకరించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ ఆటపాటలతో హోరెత్తించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి, కో-ఆర్డినేటర్ విజయలక్ష్మి, ఏవో వేణుగోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

మామునూరు, న్యూస్‌టుడే: ఖిలావరంగల్ మండలం మామునూరులో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరో డివిజన్ తెరాస మహిళా అధ్యక్షురాలు మేకల రాణి చేతుల మీదుగా 30 మందికి దుస్తులు అందజేశారు. డానియల్, ఫాస్టర్ జేమ్‌రాజ్, సంఘ పెద్దలు యేసోబు, దేవానందం, గోపాల్, సుధాకర్ పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

పెద్దతండా(పర్వతగిరి), న్యూస్‌టుడే పెద్దతండా గ్రామ పంచాయతీ శివారు దూప తండాలో ప్రమాదవశాత్తు శనివారం గడ్డివాము దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోతు వెంకన్నకు చెందిన మూడువందల మోపుల గడ్డివామి సమీపంలో మంట పెట్టడంతో గడ్డికి అంటుకుంది. అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

అనాథల కోసం వస్తువుల సేకరణ

బాలసముద్రం: రాజరాజేశ్వరి అనాథ ఆశ్రమం ఆధ్వర్యంలో శనివారం బాలసముద్రంలో 'షాపింగ్ ఫర్ పూర్' అనే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ అనితారెడ్డి పేర్కొన్నారు. 'కితకితలు' సినిమా నటి గీతాసింగ్, విజయదుర్గ ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. నిరుపేదలకు ఉచితంగా వస్తువులను అందించాలనే సంకల్పంతో వస్తువులు సేకరించారని వివరించారు. అనాథ పిల్లలకు అండగా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడంపై అతిథులు అభినందించారన్నారు. రాజరాజేశ్వరి ఆశ్రమ నిర్వాహకులు శివానంద్, రామ్‌రెడ్డి, రక్ష, సందీప్ పాల్గొన్నట్లు ప్రకటనలో తెలిపారు.

వర్ధన్నపేట

నేడు పింఛనుదారులు సమావేశం

మడికొండ, న్యూస్‌టుడే: కాజీపేట మండలం మడికొండ జిల్లా పరిషత్తు పాఠశాలలో ఆదివారం పింఛనుదారులు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కన్వీనర్, కోకన్వీనర్ పరావస్తు దామోదర్‌స్వామి, జానపట్ల రాజలింగం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పింఛనుదారులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మీరూ స్పందించండి..

నియోజకవర్గ పరిధిలో వేర్వేరు ప్రాంతాల నుంచి సమస్య చిత్రాలను పలువురు పాఠకులు వాట్సప్ రూపంలో 'ఈనాడు'కు పంపించారు. ఇలా వచ్చిన చిత్రాలను పరిశీలించి ఇక్కడ ప్రచురిస్తున్నాం. మీ మీ ప్రాంతాల్లోనూ ఈ విధమైన సమస్యలతో బాధ పడుతున్నారా? సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదా? ఇంకెందుకు ఆలస్యం? వెంటనే స్పందించండి? సమస్యను తెలియజేసేలా తీసిన చిత్రాన్ని వాట్సప్ ద్వారా ఈకింది నెంబర్లకు పంపించండి. మీ పేరు, చిరునామా తప్పక రాయండి

వాట్సప్ నెంబర్:
భీమారం : 99492 87150
మడికొండ: 98857 00583
హసన్‌పర్తి: 80083 48454

భీమారం, న్యూస్‌టుడే

కుక్కలు వణికిస్తున్నాయి!



హసన్‌పర్తి మండలం భీమారం పద్మావతినగర్ కాలనీలో వీధి కుక్కల సమస్య తీవ్రమైంది. కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ కాలనీవాసులను భయంతో వణికిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. సమస్య పరిష్కార చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. **- చిరంజివి, భీమారం**

సమాధానం: వీధి కుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
- జక్కుల వెంకటేశ్వర్లు, 57వ డివిజన్ కార్పొరేటం

చెత్తతో దుర్వాసన



హసన్‌పర్తి మండలం భీమారం నుంచి చింత గట్టు గ్రామానికి వెళ్లే మార్గ మధ్యలో రోడ్డు పక్కనే ఉన్న చెత్తతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చెత్తను స్థానికంగా వేయవద్దని వరంగల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య సిబ్బందికి పలుమార్లు విన్నవించిన స్పందించటం లేదు. సమస్యను పరిష్కరించాలని కార్పొరేషన్ అధికారులను వేడుకుంటున్న పట్టించుకోవడం లేదు.
- రమేశ్, భీమారం

సమాధానం: రోడ్డు పక్కన చెత్త వేయకుండా చర్యలు చేపడుతాం. **- కాయిత సర్వోత్తంరెడ్డి, 55వ డివిజన్ కార్పొరేటర్**

కాల్వను నిర్మించరూ?



హసన్‌పర్తి మండలం భీమారంలోని అనేక చోట్ల కాల్వల జాడే లేదు. దీంతో మురుగు రోడ్డు మీదనే పారుతుంది. పలు చోట్ల పాత కాలపు కాల్వలు శిథిలమయ్యాయి. పందులు, దోమల సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యకు పరిష్కారం చూపాలని కార్పొరేషన్ అధికారులను పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు.
- రాజు, భీమారం

సమాధానం: కాల్వ నిర్మాణం పనుల కోసం వరంగల్ కార్పొరేషన్ అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.
- కాయిత సర్వోత్తంరెడ్డి, 55వ డివిజన్ కార్పొరేటర్

పరుగో.. పరుగు



హన్మకొండ మండలం పలివేల్పులలో వీధి కుక్కల సమస్య ప్రజలను వేధిస్తుంది. కుక్కలు ఇళ్ల ముందే గుంపులు గుంపులుగా తిరుగుతుండడంతో బయటకు వెళ్లాలంటేనే భయం ప్రజలు భయపడుతున్నారు. సమస్యను అధికారులు వివరిస్తున్నా, పట్టించుకోవటం లేదు. **- రవి, పలివేల్పుల**

సమాధానం: త్వరలో కుక్కల సమస్య పరిష్కార చర్యలు చేపడుతాం.
- జక్కుల వెంకటేశ్వర్లు, 57వ డివిజన్ కార్పొరేటర్

అధ్యాపకుడికి అభినందనలు

భీమారం, న్యూస్‌టుడే: భీమారం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ పెద్దోజు సురేశ్‌కుమార్ అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రాన్ని సమర్పించినట్లు కళాశాల యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుబాయ్ క్యాంపస్‌లోని అమిటి విశ్వవిద్యాలయంలో ఈనెల 18 నుంచి 20 వరకు 'ఇన్ఫోకమ్ టెక్నాలజీస్ అండ్ అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్' అనే అంశంపై నిర్వహించిన మూడు రోజుల సదస్సు పరిశోధన పత్రాన్ని సమర్పించినట్లు పేర్కొన్నారు. సురేశ్‌కుమార్‌ను యాజమాన్యం, అధ్యాపకులు అభినందినట్లు తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి

వర్ధన్నపేటటౌన్, న్యూస్‌టుడే: మండలకేంద్రానికి చెందిన పలువురు నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కనకయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎలమకంటి శ్రీనివాస్ మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన నలభై మంది సరైన ఇళ్లు లేనందున రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కొండేటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గర్జనకు తరలిన బీసీలు

ఐనవోలు, న్యూస్‌టుడే: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం 'బీసీ విద్యార్థి మహాగర్జన'కు పలు గ్రామాల నుంచి బీసీ సంఘ నాయకులు తరలివెళ్లారు. వాహనాలను బండి మహేందర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బీసీ సంక్షేమం కోసం 'బీసీ విద్యార్థి మహాగర్జనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీలు ఐక్యమై హక్కుల సాధనకు పాటుపడాలని పేర్కొన్నారు. బీసీ సంఘం మండల అధ్యక్షుడు అమరావది రవి, బండి రవి, శ్రీనివాస్, నేతాజీ, వెంకటయ్య తదితరుల పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

వర్ధన్నపేట టౌన్, న్యూస్‌టుడే: మద్యం సేవించి వాహనాలను నడపొద్దని వర్ధన్నపేట ఎస్సై ఉపేందర్ సూచించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వ్యక్తులు డిసెంబర్ 31 జనవరి 1న మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. రెండు రోజుల పాటు రహదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముగ్గుల పోటీలు

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తిలోని హైటెక్ ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పాఠశాల యాజమాన్యం విద్యార్థినులకు శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించింది. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినులు అందమైన ముగ్గులు వేసి ప్రతిభను చాటుకున్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసు నమోదు

తిమ్మాపురం(మామునూరు), న్యూస్‌టుడే: సంగెం మండలం బొల్లికుంటలో బెల్టుషాపు నిర్వహిస్తున్న యాకూబ్ పాషపై కేసు నమోదు చేసినట్లు మామునూరు ఎస్సై యుగేందర్ తెలిపారు. నిబంధనలను అతిక్రమించి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు శనివారం దాడి చేశారు. నిల్వ ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'తెరాస ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం'

నయీంనగర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే నగరాభివృద్ధి సాధ్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. శనివారం నగరంలో 44వ డివిజన్ ఉప ఎన్నికలను పురస్కరించుకొని పోచమ్మకుంటలోని తెరాస కార్యాలయం నుంచి ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. తెరాస అభ్యర్థి అనిశెట్టి సరితను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కుడా ఛైర్మన్ యాదవరెడ్డి, రాష్ట్ర వికలాంగుల సంస్థ ఛైర్మన్ వాసుదేవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండీ. అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

ఐనవోలు, న్యూస్‌టుడే: మండల ఆటో యూనియన్ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా జన్ను కుమారస్వామి, అధ్యక్షుడిగా చింత అశోక్, ఉపాధ్యక్షుడిగా అనుమల శ్రీను, కార్యదర్శిగా బుర్ర సతీశ్, ముఖ్య సలహాదారులుగా కొత్తూరి రూబెన్, మల్లేశ్, యాదగిరి, క్రాంతి, రాజు, స్వామి, సురేశ్, రాజ్‌కుమార్ ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా చింత అశోక్ మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుక వెళ్తామన్నారు. నూతన కమిటీ సభ్యులు ఎంపీపీ రవీందర్‌రావును కలిశారు. తెరాస మండల అధ్యక్షుడు మునిగాల సమ్మయ్య, నాయకులు సతీశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వడ్లకొండ, రోళ్లకల్(పర్వతగిరి), న్యూస్‌టుడే: పశువులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పర్వతగిరి పశువైద్యాధికారి డాక్టర్.నరేశ్ అన్నారు. వడ్లకొండ, రోళ్లకల్ గ్రామాల్లో శనివారం గాలికుంటు నివారణ టీకాల శిబిరం ఏర్పాటు చేశారు. సిబ్బంది వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, ఉపేందర్, కుమార్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యార్థం రూట్ పరిశీలన

రావూర్(పర్వతగిరి), న్యూస్‌టుడే: రావూర్ నుంచి బస్సు సౌకర్యం కల్పించేందుకు శనివారం నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ విజయరావు రూట్ పరిశీలన చేపట్టారు. కల్లెడ గ్రామ శివారులోని ఆకేరు వాగు బ్రిడ్జి సమీపంలో ఉన్న మూలమలుపు, సీత్య తండా నుంచి వెళ్లేందుకు ఉన్న రోడ్డును పరిశీలించారు. మేనేజర్ విజయరావు మాట్లాడుతూ జనవరి 1 నుంచి నర్సంపేట నుంచి తొర్రూరుకు వెళ్లే బస్సును రావూర్ మీదుగా నడిపేందుకు మార్గాన్ని పరిశీలించామన్నారు. అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, అసిస్టెంట్ ఇంజనీర్ రాధిక, సర్పంచి విజయ్, వార్డు సభ్యుడు లక్ష్మీనారాయణ, సంజీవ, సంతోశ్‌లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పర్వతగిరి, న్యూస్‌టుడే: స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో పీఆర్టీయూ 2018 క్యాలెండర్‌ను శనివారం ఆ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సుజాతల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు చేసేంత వరకు పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఎప్పటికప్పుడు పాటుపడనున్నట్లు పేర్కొన్నారు. అక్కల రమేశ్, చంద్రశేఖర్, నాగేశ్వర్‌రావు, శ్రీధర్, కుమారస్వామి, జలీల్, రాజిరెడ్డి, వంశీమోహన్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండరును ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

'కృష్ణ మాదిగపై విమర్శలు మానుకోవాలి'

భీమారం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగపై ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి విమర్శలు మానుకుని, ఎస్సీ వర్గీకరణకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆరెపల్లి పవన్‌మాదిగ అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో రేణకుంట్ల దుర్గప్రసాద్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదవుల కన్న జాతి ప్రయోజనాలే ముఖ్యమన్న సంకల్పంతో మంద కృష్ణమాదిగ పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం జనవరి 1 నుంచి 5 వరకు అన్ని మండల కార్యాలయాలు, గ్రామ పంచాయతీల ఎదుట దీక్షలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అశోక్ మాదిగ, రవీందర్ మాదిగ, అనిల్‌కుమార్ మాదిగ, సమ్మయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి ఆదర్శ పాఠశాలలో శనివారం నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు 2018 టీఆర్ఎంఎస్(తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్) అక్షరాల ఆకృతిలో కూర్చుని నూతన సంత్సరానికి స్వాగతం పలికారు.

- న్యూస్‌టుడే, పర్వతగిరి

